ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 27.09.2025 | సంపుటి : 12 సంచిక : 69 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ Simultaneously Published from Hyderabad & Karimnagar ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## స్థానిక సంస్థల ఎన్నికల్లో..



# బీసీలకు 42% రిజర్వేషన్

### జీవో జారీ చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

### డెడికేటెడ్ కమిషన్ సిఫారసు మేరకు కేటాయింపు



**హైదరాబాద్(జనంసాక్షి):**స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ ప్రభుత్వం కసరత్తు వేగవంతం చేసింది. ఈ దిశగా బీసీలకు 42శాతం రిజర్వే షన్లపై బీసీ సంక్షేమశాఖ జీవోను విడుదల చేసింది. డెడికేటెడ్ కమిషన్ సిఫార్సు మేరకు బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ జీవో నంబర్ 9ని విడుదల చేసింది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై ఉన్న 50% పరిమితిని ఎత్తివేసి, బీసీలకు 42% రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వ ఉత్తర్వులు(జీవో) ఇవ్వాలని ఇటీవల మంత్రి మండలి నిర్ణయించిన సంగతి తెలిసిందే. మరోవైపు సెప్టెంబరు 30లోపు ఎన్నికలు జరగాలని హైకోర్టు గడువు నిర్దేశం చినం దున దానికి అనుగుణంగా 42% బీసీ రిజర్వేషన్ల కోసం ప్రభుత్వం జీవో జారీ చేసింది.




## స్థానిక సంస్థల ఎన్నికలపై నేడు ఈసీ కీలక సమావేశం

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. ఈ క్రమంలో శనివారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర ఎన్నికల సంఘం.. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై కీలక సమావేశం నిర్వహించనుంది. ఈ సమావేశానికి సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, ఉన్నతాధికారులు హాజరు కానున్నారు.రాష్ట్రంలో గ్రామీణ మిగతా 2లో..



### మండల, జిల్లా పరిషత్ రిజర్వేషన్ల విధివిధానాలు ఖరారు

జీవో జారీ చేసిన పంచాయతీ రాజ్ శాఖ 2 లో..

# తెలంగాణ నూతన డీజీపీగా శివధర్‌రెడ్డి

### సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ ఆర్డర్ అందజేత



**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ నూతన డీజీపీగా శివ ధర్‌రెడ్డి నియమితులయ్యారు. 1994 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన శివధర్‌రెడ్డి.. ప్రస్తుతం ఇంటెలిజెన్స్ ఛీఫ్‌గా ఉన్నారు. ఈమేరకు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన అపాయింట్‌మెంట్ ఆర్డర్ అందుకున్నారు. నూతన డీజీపీగా నియమితులైన శివధర్ రెడ్డి స్వస్థలం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తూలేకలాన్ (పెద్దతుండ్ల) గ్రామం. ప్రైమరీ స్కూల్ నుంచి ఉన్నత విద్య వరకు హైద రాబాద్‌లోనే చదువుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎల్ఎల్‌బీ పూర్తి చేసి కొంతకాలం న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. ఆ తర్వాత సివిల్స్‌కు మిగతా 2లో..



# మరో బాంబు పేల్చిన ట్రంప్



### ఫార్మా దిగుమతులపై 100 % సుంకాలు విధింపు

- భారతీయ ఔషధ పరిశ్రమలు లక్ష్యంగా బాదుడు
- దీంతో పాటు ఫర్నిచర్, ట్రక్కులు, కిచెన్ ఉపకరణాల పైనా టారీఫ్‌లు పెంపు

**వాషింగ్టన్(జనంసాక్షి):**సుంకాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో బాంబు పేల్చారు. ఈసారి ఫార్మా దిగుమతుల పై భారీగా టారిఫ్‌లు విధించడం గమనార్హం.దీంతో పాటు ఫర్నిచర్, ట్రక్కులు, కిచెన్ ఉపకరణాల పైనా సుంకాలతో విరుచుకుపడ్డారు. ఈ మేరకు తన ట్రూత్ ఖాతాలో ట్రంప్ వెల్లడించారు. బ్రాండెడ్ లేదా పేటెంటెడ్ ఔషధాలపై ఏకంగా 100 శాతం దిగుమతి సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ స్పష్టం చేశారు. ఇక, కిచెన్ క్యాబినెట్, బాత్‌రూమ్ పరికరాలపై 50శాతం, అప్‌హోల్‌స్టర్డ్ ఫర్నిచర్‌పై 30శాతం, భారీ ట్రక్కులపై 25శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సుంకాలు అక్టోబరు 1 నుంచి మిగతా 2లో..



## జూబ్లీహిల్స్ ఉపఎన్నిక బీఆర్ఎస్ అభ్యర్థిగా సునిత

### గోపీనాథ్ సతీమణి పేరు ప్రకటించిన భారత రాష్ట్ర సమితి

**హైదరాబాద్(జనంసాక్షి):**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు అభ్యర్థిని భారత రాష్ట్ర సమితి ప్రకటించింది. ఇటీవల మృతిచెందిన ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతకు టికెట్ కేటాయించింది. ఈ మేరకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించారు. దీంతో అభ్యర్థి పేరును పార్టీ వెల్లడించింది.అనారోగ్య కారణాలతో ఈ ఏడాది జూన్ 8న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కన్నుమూశారు. ఆయన మృతితో జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నిక అనివార్యమైంది. త్వరలో దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం విడుదల చేయనుంది. జూబ్లీహిల్స్ అభ్యర్థిగా భారత రాష్ట్ర సమితి ప్రకటించిన అనంతరం మాగంటి సునీత మీడియాతో మాట్లాడారు. తనపై విశ్వాసంతో ఉపఎన్నికకు అభ్యర్థిగా పార్టీ అవకాశం కల్పించిందన్నారు. కేసీఆర్, కేటీఆర్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. తనకు ప్రజల మద్దతు, ఆశీర్వాదం ఉండాలని కోరుకుంటున్నానని సునీత పేర్కొన్నారు.

### భారీ మెజార్టీతో గెలుస్తాం

- విజయావకాశాలు మనకే ఉన్నాయి
- జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై కేసీఆర్ సమాలోచనలు
- సీనియర్ నేతలతో తాజా పరిస్థితులపై సమీక్ష

2 లో..

### సీఎం వేధింపులతోనే మెట్రో నుంచి ఎల్&టీ నిష్క్రమణ

మెట్రో భూములపై సీఎం, ఆయన అనుచరుల కన్ను పడింది: కేటీఆర్

# వదలని వాన



### తెలంగాణ రాష్ట్రానికి రెడ్ అలర్ట్ జారీ

### హైదరాబాద్‌లో మళ్లీ కుండపోత వర్షం • ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ నది

- ఇబ్బందులు పడ్డ నగర వాసులు
- జంట జలాశయాల్లోకి భారీగా వరద..
- మూసారాంబాగ్ బ్రిడ్జి మూసివేత
- చాలా చోట్ల నిలిచిన ట్రాఫిక్
- పలు విమానాల దారి మళ్లింపు
- కామారెడ్డి, మెదక్ జిల్లాలకు రెడ్ అలర్ట్


భారీ వరద ప్రవాహానికి మూసారాంబాగ్ బ్రిడ్జి మూసినవేసిన దృశ్యం

**హైదరాబాద్(జనంసాక్షి):**మహారాష్ట్ర నుంచి తెలంగాణ, కర్ణాటక మీదుగా ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 3.1కి.మీ ఎత్తులో కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాగల 24 గంటల్లో తెలంగాణలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా రెడ్ అలర్ట్ జారీ చేశారు. తెలంగాణలో 21 సెం.మీకు పైగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. మరోవైపు బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారింది. వాయవ్య, మధ్య బంగాళాఖాతం సమీపంలో పూరీ తీరానికి దక్షిణ ఆగ్నేయంగా 60కి.మీ దూరంలో, గోపాల్‌పూర్‌నకు తూర్పుదిశలో కేంద్రీకృతమైంది. క్రమంగా వాయవ్య దిశగా ప్రయాణం చేస్తోంది.హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. శుక్రవారం కూడా భారీ వర్షం కురుస్తుండటంతో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు విభాగం అప్రమత్తమైంది. ట్రాఫిక్ సమస్యలు, ప్రజల భద్రతా దృష్ట్యా వివిధ కంపెనీలకు మార్గదర్శకాలు మిగతా 2లో..

### అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాలపై అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష 2 లో..

### బీహార్‌లో ఎన్నికల తాయిలం..

## ఒక్కో మహిళ ఖాతాలో రూ.10వేలు

### మహిళా రోజ్‌గార్ పథకానికి ప్రధాని మోడీ శ్రీకారం



**న్యూఢిల్లీ/పాట్నా(జనంసాక్షి):** అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో బిహార్ ప్రభుత్వం అక్కడి మహిళలకు నవరాత్రి కానుక అందించింది. ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున 75లక్షల మంది మహిళల ఖాతాల్లో డబ్బు జమ చేసింది. శుక్రవారం ప్రధాని నరేంద్రమోదీ 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన' ప్రారంభించడం ద్వారా నేరుగా వారి ఖాతాల్లోకి నగదు బదిలీ చేశారు. దిల్లీలో ఉన్న మోదీ వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనికి బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్, ఇతర మంత్రులు హాజరయ్యారు. రూ.7,500 కోట్లతో బిహార్‌లోని ఎన్డీయే ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకు వచ్చింది. మహిళా సాధికారత, స్వయంఉపాధి కల్పించడం దీని ఉద్దేశం. ప్రతి కుటుంబంలో ఒక మహిళకు ఈ స్కీమ్ కింద రూ.10వేలు నేరుగా అందాయి. తర్వాత వివిధ మిగతా 2లో..

## స్పీకర్‌తో ఫిరాయింపు ఎమ్మెల్యేల భేటీ




**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో బీఆర్ఎస్ పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కాలే యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాష్ గౌడ్‌లు శుక్రవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు కూడా పాల్గొన్నారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసులకు ఇప్పటికే కాలే యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాష్ గౌడ్‌లు వివరణ ఇచ్చారు. అయితే, మిగతా 2లో..

### భారత్‌తో కాల్పుల విరమణలో

## ట్రంప్ సాయం

### పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కొత్త రాగం



**వాషింగ్టన్(జనంసాక్షి):**భారత్-పాకిస్థాన్ యుద్ధాన్ని ఆపానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న వాదనను భారత్ ఎప్పటికప్పుడు తోసిపుచ్చుతున్న విషయం తెలిసిందే.ఈ క్రమంలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కొత్త రాగం అందుకున్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవడంలో ట్రంప్ సాయం చేశారని, తద్వారా దక్షిణాసియాలో భారీ విపత్తును నివారించారని ఓ ప్రకటనలో కొనియాడారు."పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ ఆసిం మునీర్‌తో కలిసి అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని పెంపొందించుకునే అంశాలతోపాటు గాజాలో ఇజ్రాయెల్ మిగతా 2లో..

# మిగ్-21కు బైబై..

### 63 ఏళ్ల పాటు దేశానికి సేవలందించిన యుద్ధవిమానానికి వాయుసేన ఘనంగా వీడ్కోలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**భారత వాయుసేనకు కొన్ని దశాబ్దాలుగా వెన్నముకలా ఉండి.. ఎన్నో యుద్ధాల్లో విజయాన్ని అందించిన మిగ్-21 కు వాయుసేన చీఫ్ ఏపీ సింగ్ వీడ్కోలు పలికారు.శుక్రవారం చండీగఢ్ వాయుసేన కేంద్రం వేదికగా ఈ కార్యక్రమం జరిగింది. దీనికి కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఐఏఎఫ్ సీనియర్ అధికారులు, మాజీలు హాజరయ్యారు.ఈ రకం విమానం భారత్‌లో తొలిసారి అడుగుపెట్టింది కూడా ఈ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లోనే కావడం విశేషం. నాడు 'ఫస్ట్ సూపర్ సోనిక్స్'గా వ్యవహరించే 28వ స్క్వాడ్రన్‌కు వీటిని మొదటిసారి అప్పగించారు. మిగతా 2లో..





## అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం త్వరలోనే

### కేంద్ర వాణిజ్య శాఖ వెల్లడి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**భారత్, అమెరికాలకు మేలు చేసేలా, సాధ్యమైనంత త్వరగా ద్వైపా క్షిక వాణిజ్య ఒప్పందం కుదర్చుకు నేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర వాణిజ్య శాఖ వెల్లడించింది. వాణిజ్య సమస్యలపై చర్చల కోసం అమెరికాకు వెళ్లిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూశ్ గో యల్ నేతృత్వంలోని భారత ప్రతినిధి బృందం ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. పరస్పర ప్రయోజనకర వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాల చర్చలు సానుకూల దృక్పథంతో కొనసాగుతున్నాయని.. ఈ చర్చలు ఫలప్రదమై త్వరలోనే ఒప్పందం ఖరారవుతుందనే సంకేతాలు కనిపిస్తున్నట్లు పేర్కొంది.వాణిజ్య ఒప్పందంలోని మిగతా 9లో..

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
27.09.2025

# తెలంగాణ నూతన డీజీపీగా శివధర్‌రెడ్డి

ఎంపికై.. 1994లో ఇండియన్ పోలీస్ సర్వీస్‌లోకి ప్రవేశం పొందారు. ఏఎస్పీగా విశాఖ జిల్లాలోని అనకాపల్లి, నర్సీపట్నం, చింతపల్లిలో పనిచేశారు. గ్రేహౌండ్స్ స్క్వాడ్రన్ కమాండర్ గా, బెల్లంపల్లి, ఆదిలాబాద్, నల్గొండ, శ్రీకాకుళం, నెల్లూరు, గుంటూరు జిల్లాల ఎస్పీగా సేవలందించారు. ఎస్పీగా, డీఐజీ ఎస్ఐబీగా మావోయిస్టుల అణిచివేతలో కీలక పాత్ర పోషించారు. 2014-2016 మధ్య తెలంగాణ రాష్ట్రానికి మొదటి ఇంటెలిజెన్స్ చీఫ్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఐక్యరాజ్యసమితి శాంతిపరిరక్షక దళంలో భాగంగా యునైటెడ్ నేషన్స్ మిషన్ ఇన్ కొసావోలో కూడ శివధర్ రెడ్డి పనిచేశారు. నల్గొండ, శ్రీకాకుళం, నెల్లూరు, గుంటూరు ఎస్పీగా పని చేస్తున్న సమయంలో అనేక సెన్సేషనల్ కేసులను పర్యవేక్షించారు. 2007లో మక్కా మసీదులో బాంబు పేలుళ్లు, పోలీసు కాల్పుల్లో 14 మంది చనిపోయిన సంఘటన తర్వాత హైదరాబాద్ సౌత్ జోన్ డీసీపీగా శివధర్ రెడ్డిని ప్రభుత్వం నియమించింది. అత్యంత ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడిన ఆ సమయంలో అన్ని వర్గాల ప్రజల్లో ధైర్యం నింపి శాంతి భద్రతలను సమర్ధంగా కాపాడారు. విశాఖపట్నం పోలీస్ కమిషనర్ గా పనిచేసిన సమయంలో రహదారి భద్రత కోసం క్యాంపెయిన్ నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఏసీబీ అడిషనల్ డైరెక్టర్ గా, డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. పర్సనల్ వింగ్‌లో ఐజీ, అడిషనల్ డీజీగా పని చేసిన అనుభవం ఉంది. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇంటెలిజెన్స్ చీఫ్ గా మళ్ళీ శివధర్ రెడ్డి నియమించారు. ఆగస్టు 2024లో డీజీపీగా పదోన్నతి పొందారు. గ్యాలంట్రీ మెడల్, పోలీస్ మెడల్, ప్రెసిడెంట్ మెడల్, ఐక్యరాజ్యసమితి మెడల్ సహా అనేక అవార్డులు అందుకున్నారు.

## భారత్‌తో కాల్పుల విరమణలో ట్రంప్ సాయం

యుద్ధం, ఉగ్రవాదంపైపోరులో సహకారం వంటి అంశాలపై చర్చించారు. తెగువ చూపించి పాక్-భారత్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందానికి అధ్యక్షుడు ట్రంప్ సాయం చేయడంతోపాటు ముస్లిం దేశాధినేతలతో సంప్రదింపులు జరిపి గాజాలో సంక్షోభం ముగింపు, పశ్చిమాసియాలో శాంతి పునరుద్ధరణకు కృషి చేశారు” అని తాజా ప్రకటనలో ట్రంప్‌పై పాకిస్థాన్ ప్రశంసలు కురిపించింది. ఈ సందర్భంగా తమ దేశంలో కీలక రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని అమెరికాను ప్రధాని షరీఫ్ కోరినట్లు పేర్కొంది. అంతేకాకుండా వీలునుబట్టి పాకిస్థాన్‌లో పర్యటించాలని ఆహ్వానించినట్లు తెలిపింది. ఇదిలాఉంటే, ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ సైనికాధికారుల విజ్ఞప్తి మేరకే కాల్పుల విరమణకు అంగీకరించామని భారత్ పదే పదే స్పష్టం చేస్తోంది. ఇందులో మూడో దేశం జోక్యం లేదని ఉద్ఘాటిస్తోంది. ఇదే విషయంపై పలు వేదికలపై ట్రంప్ చేస్తున్న వాదనలనూ ఖండిస్తోంది. అయినప్పటికీ.. తాజాగా పాకిస్థాన్ కూడా ట్రంప్ వాదనను సమర్థిస్తూ మాట్లాడటం గమనార్హం.

### ట్రంప్‌తో పాక్ ప్రధాని షరీఫ్ రహస్య భేటీ..

**వాషింగ్టన్(జనంసాక్షి):** దాయాది దేశం పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్.. అమెరికా పర్యటనలో ఉన్నారు. తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో షెహబాజ్ షరీఫ్ భేటీ అయ్యారు.వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీస్‌లో అంతర్గతంగా వీరి సమావేశం జరిగింది. ట్రంప్‌తో పాక్ ప్రధాని రహస్యంగా సమావేశమయ్యారు. మీడియాను అనుమతించలేదు. ఈ భేటీకి పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ కూడా హాజరైనట్టు తెలుస్తోంది. ఇరువురు నేతలు ఏ అంశంపై చర్చించుకున్నారనే ఆసక్తి నెలకొంది. ఇక, ట్రంప్‌తో షెహబాజ్ షరీఫ్ భేటీ కావడం ఇదే తొలిసారి.వివరాల ప్రకారం.. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పాక్ ప్రధాని షరీఫ్ అమెరికాకు వెళ్లారు. ఈ సందర్భంగా షరీఫ్‌కు ట్రంప్ స్వాగతం పలికారు. అనంతరం.. డొనాల్డ్ ట్రంప్, షహబాజ్ షరీఫ్ మధ్య సమావేశం జరిగిందని తెలుస్తోంది. ఇరువురు నేతలు రహస్యంగా భేటీ అయినట్టు తెలుస్తోంది. ఈ సమావేశంలో భాగంగా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక ఒప్పందాలు, ప్రాంతీయ భద్రతపై చర్చించినట్టు వార్తలు వినిపిస్తున్నాయి. ఇక, ఈ సమావేశంలో వారితో పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ మునీర్ కూడా ఉన్నారని సమాచారం. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. అయితే, ప్రపంచ దేశాలపై ట్రంప్ వరుసగా పన్నులు విధిస్తున్న నేపథ్యంలో పాక్ ప్రధాని.. అమెరికా అధ్యక్షుడిని కలవడం గమనార్హం.మరోవైపు ఇప్పటికే పాక్ ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్ అమెరికాలో వరుస పర్యటనలు చేసిన సంగతి తెలిసిందే. మునీర్ గతంలో జూన్, ఆగస్టు నెలల్లో అమెరికాలో పర్యటించారు. జూన్ పర్యటనలో మునీర్‌కు ట్రంప్ వైట్ హౌస్‌లో విందు ఇచ్చారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, ఆర్థిక అభివృద్ధిపై చర్చలు జరిగాయని కొన్ని మీడియా కథనాలు తెలిపాయి. ఆ తరువాత అమెరికా.. పాకిస్తాన్‌లో చమురు నిల్వలను అభివృద్ధి చేయడానికి సహాయం చేస్తామని ప్రకటించింది. అలాగే, పాకిస్తాన్‌కు ఖనిజ రంగంలో 500 మిలియన్ డాలర్ల పెట్టుబడిని కూడా అమెరికా అందించింది.

# వదలని వాన



జారీ చేసింది. ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవ్వాలని సూచించింది. పరిస్థితిని అర్థం చేసుకొని సహకరించాలని కోరింది. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. మరోవైపు హైదరాబాద్ నగర వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో పలుచోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఛత్రినాక, తార్నాక, హబ్సిగూడ, నాచారం, కూకట్‌పల్లి, జేఎన్టీయూ, నిజాంపేట్, ప్రగతినగర్, ఆల్విన్ కాలనీ, చార్మినార్, యూకత్‌పురా, ఓయూ క్యాంపస్, హైదర్‌నగర్, బాచుపల్లి, వివేకానంద నగర్, చార్మినార్, చాంద్రయణగుట్ట, బహదూర్‌పురా, లాలాపేట్, మల్లాపూర్, ఉప్పుగూడ, బార్కస్, బషీర్‌బాగ్, అబిడ్స్, కోఠి సహా పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. మియాపూర్ మంజీరా పైపులైన్ రోడ్డు నుంచి కొండాపూర్ మైహోం మంగళ మార్గంలో రైల్వే అండర్ పాస్‌లోకి వరదనీరు చేరింది. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మియాపూర్ మంజీరా పైపు లైన్ రోడ్డు నుంచి కొండాపూర్ మై హోం మంగళ మార్గంలో రైల్వే అండర్‌పాస్‌ను పరిశీలించారు. ట్రాఫిక్ జామ్ సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలో గురువారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి 65వ జాతీయ రహదారిపై భారీగా వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో ముత్తంగి ఔటర్ రింగ్ రోడ్ వద్ద నుంచి రుద్రారం వరకు భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సంగారెడ్డి నుంచి ఇస్నాపూర్ వరకు రోడ్డుకు ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. వరద నీటిలో వాహనాలు నెమ్మదిగా ముందుకు కదులుతున్నాయి. దీంతో కార్యాలయాలకు వెళ్లాల్సిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను దారి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూలు జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

**పలు విమానాల దారి మళ్లింపు**

తెలంగాణతో పాటు- హైదరాబాద్ నగరంలో కూడా వర్షాలు దంచి కొడుతున్నాయి. భారీ వానల కారణంగా పలు విమానాలను దారి మళ్లిస్తున్నట్లు- శంషాబాద్ ఎయిర్‌పోర్టు అధికారులు ప్రకటించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. కోల్‌కతా - హైదరాబాద్ ముంబై - హైదరాబాద్, పూణే నుంచి శంషాబాద్‌కు రావాల్సిన మూడు ఇండిగో విమానాలను విజయవాడకు దారి మళ్లించినట్లు- అధికారులు తెలిపారు. భారీ వర్షాల ప్రభావం ఇలాగే ఉంటే.. ఇంకా మరికొన్ని విమానాలను కూడా దారి మళ్లించే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. అలాగే వానల కారణంగా విమాన రాకపోకలకు కూడా ఆలస్యం అవుతోందని చెప్పుకొచ్చారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందికి గురవుతున్నారు. విమానాల రాకపోకలకు ఆలస్యం, మళ్లింపు విషయాన్ని ప్రయాణికులు గమనించాలని శంషాబాద్ ఎయిర్‌పోర్టు అధికారులు సూచించారు.

**మూసారాంబాగ్ బ్రిడ్జి మూసివేత**

నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం మరోసారి భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో భారీగా కురిసిన వానతో నగర వాసులు తడిసి ముద్దయ్యారు. వివిధ పనులపై బయటకు వచ్చిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బేగంబజార్, కోఠి, నాంపల్లి, హిమాయత్ నగర్, ఖైరతాబాద్, ట్యాంక్ బండ్, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. రోడ్లపై వరద నీటితో వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మూసారాంబాగ్ బ్రిడ్జి పై నుంచి మూసీ వరద భారీ వర్షం వల్ల మూసారాంబాగ్ బ్రిడ్జి పై నుంచి మూసీ వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో మూసారాంబాగ్ బ్రిడ్జిపైకి వాహనాలను.. పోలీసులు, రెవెన్యూ అధికారులు నిలిపివేశారు. భారీ వర్షాలకు ఉస్మాన్ సాగర్ నిండిపోవడంతో పైనుంచి నీటిని దిగువ ప్రాంతాలకు వదలడంతో అంబర్‌పేటలోని మూసారాంబాగ్ బ్రిడ్జిపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో కాచిగూడ ట్రాఫిక్ పోలీసులు బ్రిడ్జిపై బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలను పూర్తిగా నిలిపివేశారు. దిల్‌సుఖ్‌నగర్ వైపు నుంచి వచ్చే వాహనాలను గోల్నాక కొత్త బ్రిడ్జి వైపు దారి మళ్లించారు.

## అప్రమత్తంగా ఉండాలి

**భారీ వర్షాలపై అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష**

**హైదరాబాద్(జనంసాక్షి):** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ మహానగరంతోపాటు- రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని లోతట్టు- ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతోపాటు- వివిధ శాఖల ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆ క్రమంలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. అలాగే నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా సీఎం ఆదేశించారు. హైదరాబాద్‌లో జీహెచ్‌ఎంసీ, హైడ్రాతో పాటు- ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని.. ఆ దిశగా సంబంధిత అధికారులను అప్రమత్తం చేయాలంటూ సీఎస్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## మిగ్-21కు బైబై..

వింగ్ కమాండర్ దిల్బాగ్ సింగ్ దీనికి నాయకత్వం వహించారు. ఆ తర్వాత ఆయన ఎయిర్ చీఫ్ మార్షల్ స్థాయికి ఎదిగారు. ఇక మిగ్-21లు కూడా దాదాపు 60 ఏళ్లకు పైగా వాయుసేనకు సేవలు అందించాయి. ఇప్పుడు ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ స్వయంగా 23వ స్క్వాడ్రన్ చివరి సార్టిలో పాల్గొన్నారు. ఆయనతో పాటు స్క్వాడ్రన్ లీడర్ ప్రియాశర్మ కూడా అందులో భాగమయ్యారు. ఈ చివరి ప్రయాణానికి గుర్తుగా మిగ్‌లకు వాటర్ సెల్యూట్ చేశారు. తర్వాత వాటికి సంబంధించిన లాగ్‌బుక్‌ను రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ఎయిర్ చీఫ్ అందజేశారు. మిగ్-21 శకానికి ముగింపుగా ఈ ప్రక్రియ చేపట్టారు. ప్రత్యేక స్మారక పోస్టల్ కవర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ ప్రత్యేక స్మారక పోస్టల్ కవర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. “ఎన్నో యుద్ధాల్లో మిగ్ పరాక్రమం చిరస్మరణీయం. 1971 యుద్ధం, కార్గిల్ వార్, బాలాకోట్ దాడులు, ఆపరేషన్ సిందూర్.. ఇలా ప్రతి సైనిక చర్యలో అది భాగమైంది. పాకిస్థాన్‌తో యుద్ధం సమయంలో ఢాకాలోని గవర్నర్ హౌస్ మిగ్ దాడిలో దెబ్బతింది. అది యుద్ధ ఫలితంపై ప్రభావం చూపింది. ప్రతి చరిత్రాత్మక మిషన్ తర్వాత ఈ యుద్ధ విమానం వల్ల దేశగౌరవం పెరుగుతూ వచ్చింది. ఈ దేశ పరాక్రమం, సైనికుల త్యాగాల సమాహారమే ఈ వీడ్కోలు కార్యక్రమం. ఈ జెట్.. భారత్-రష్యా సంబంధాలకు ఒక సాక్ష్యం” అని మంత్రి పేర్కొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై నేడు ఈసీ కీలక సమావేశం

స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత ప్రణాళికను ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖ విడుదల చేసింది. తెలంగాణలో 12,760 పంచాయతీలు, 1,12,534 వార్డులు, 565 జడ్పీటీసీలు, 5,763 ఎంపీటీసీ స్థానాలకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ప్రత్యక్ష ఎన్నికల అనంతరం పరోక్షంగా 565 మండల పరిషత్‌లు, 31 జిల్లా పరిషత్‌లకు ఛైర్‌పర్సన్ల ఎన్నికలను నిర్వహిస్తామని పేర్కొంది. రేపు సాయంత్రం రాష్ట్ర ఎన్నికల సంఘం.. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే అవకాశమున్నట్టు సమాచారం.

## స్పీకర్‌తో ఫిరాయింపు ఎమ్మెల్యేల భేటీ

ఈ నెల 30వ తేదీ వరకూ కడియం శ్రీహరి గడువు కోరారు. ఈనెల 29 నుంచి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రత్యక్ష విచారణ చేపట్టే అవకాశాలు ఉన్నాయి. అక్టోబర్ 6వ తేదీ నుంచి 23వ తేదీ వరకు విదేశీ పర్యటనకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వెళ్లనున్నారు. విదేశీ పర్యటనకు ముందే ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంపై విచారణ చేపట్టే అవకాశాలు ఉన్నాయి. ఈక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు భేటీ- కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## లద్దాఖ్‌లో అల్లర్ల ప్రమేయం

**పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ అరెస్టు**

**లేహ్(జనంసాక్షి):** లద్దాఖ్‌లో చోటు చేసుకున్న అల్లర్లకు కారకుడిగా భావిస్తున్న పర్యావరణ వేత్త సోనమ్ వాంగ్‌చుక్‌ను పోలీసులు అరెస్టు చేశారు. రెండు రోజుల క్రితం వాంగ్‌చుక్ ప్రకటనలతోనే లేహ్‌లో హింసాత్మక ఘటనలు జరిగాయని కేంద్రం ప్రకటన విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనల్లో నలుగురు మృతి చెందగా, సుమారు 90 మందికిపైగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే అతడిని పోలీసులు అరెస్టు చేశారు. లద్దాఖ్‌లో కొంతకాలంగా రాష్ట్ర హోదా కోసం జరుగుతున్న ఆందోళనలు హింసాత్మకంగా మారిన సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వ ప్రత్యక్ష పాలనను అక్కడి ప్రజలు మూడేళ్లుగా నిరసిస్తున్నారు. తమ భూమి, సంస్కృతి, వనరుల పరిరక్షణ కోసం రాజ్యాంగ భద్రత ఉండాలని కోరుతున్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర హోదా కోసం పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ రెండువారాలుగా నిరాహార దీక్ష చేస్తున్నారు.

# మరో బాంబు పేల్చిన ట్రంప్



వర్తించనున్నట్లు పేర్కొన్నారు. జాతీయభద్రతతో పాటు ఇతర కారణాలను పరిగణనలోకి తీసుకొని ఈ టారిఫ్‌లు విధిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. అయితే, అమెరికాలో ప్లాంట్‌లను నిర్మిస్తున్న విదేశీ ఔషధ తయారీ సంస్థలకు ఈ సుంకాలు వర్తించవని పేర్కొన్నారు.ఈ సుంకాలతో భారత్‌పై ఎంత ప్రభావం పడనుందనేది ఇప్పుడే ఓ అంచనాకు రాలేం. భారత ఫార్మా ఉత్పత్తుల ఎగుమతులకు అమెరికా అతిపెద్ద మార్కెట్‌గా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారత్ మొత్తంగా 27.9 బిలియన్ డాలర్ల విలువైన ఫార్మా ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసింది. ఇందులో 31 శాతం అంటే.. దాదాపు 8.7 బిలియన్ డాలర్ల విలువైన ఔషధాలు అగ్రరాజ్యానికే వెళ్లాయి. ఇక, ఈ ఏడాది తొలి అర్ధభాగంలో ఇప్పటికే 3.7 బిలియన్ డాలర్ల విలువైన ఫార్మా ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేసింది. అమెరికాలో ఉపయోగించే జనరిక్ ఔషధాల్లో 45శాతం, బయోసిమిలర్ ఔషధాల్లో 15శాతం భారత్ సరఫరా చేసినవే. డాక్టర్ రెడ్డీస్, అరబిందో ఫార్మా, జైడస్, సన్‌ఫార్మా, గ్లాండ్ ఫార్మా వంటి సంస్థల మొత్తం ఆదాయంలో 30-50శాతం అమెరికా మార్కెట్ నుంచే లభిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పుడు ట్రంప్ విధించిన టారిఫ్‌లతో అమెరికా మార్కెట్‌లో ఈ ఔషధాల ధరలు రెట్టింపు కానున్నాయి.ఇదిలాఉండగా.. ఇప్పటికే రష్యా చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై ట్రంప్ 50శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. దానిపై ఇరుదేశాల మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయి. ఈ పరిణామాల వేళ ట్రంప్ తాజాగా ఫార్మా ఉత్పత్తులపై టారిఫ్‌లు విధించడం మరింత గందరగోళానికి దారితీసింది.

## బీహార్‌లో ఎన్నికల తాయిలం..

దశల్లో ఆ సహాయం రూ.2 లక్షల వరకు ఉండనుంది. స్వయంఉపాధి కోసం పశు పోషణ, వ్యవసాయం, -టైలరింగ్ వంటి రంగాల్లో ఆ మొత్తాన్ని ఉపయోగించుకోవచ్చని ప్రభుత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది.. ఈ కార్యక్రమం సందర్భంగా లబ్ధిదారులను ఉద్దేశించి మోదీ మాట్లాడారు. ఈ నవరాత్రి సందర్భంగా బిహార్ మహిళల సంతోషంలో నేనూ భాగమైనందుకు ఆనందంగా ఉంది. ఇక్కడ నాకు స్క్రీన్‌పై లక్షలాదిమంది మహిళలు కనిపిస్తున్నారు. వారి ఆశీర్వాదాలు మాకు గొప్ప బలం అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి మోదీ మీకోసం పని చేస్తున్నారు. గత ప్రభుత్వం అలా కాదు. లాలూ ప్రసాద్ యాదవ్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ... సీఎం పదవిని కోల్పోయినప్పుడు.. తన సతీమణిని ముఖ్యమంత్రిని చేశారు. తన కుటుంబం గురించి మాత్రమే ఆందోళన చెందారు. మేం మాత్రం బిహార్ ప్రజలందరి కోసం పనిచేస్తామని విపక్ష ఆర్జేడీపై నీతీశ్‌కుమార్ విమర్శలు చేశారు.

# సీఎం వేధింపులతోనే మెట్రో నుంచి ఎల్&టీ నిష్క్రమణ

**మెట్రో భూములపై సీఎం, ఆయన అనుచరుల కన్ను పడింది: కేటీఆర్**



**హైదరాబాద్(జనంసాక్షి):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తిగత కక్ష సాధింపు, అహంకారపూరిత, నియంతృత్వ పోకడల కారణంగానే ప్రపంచ ప్రఖ్యాత నిర్మాణ సంస్థ ఎల్&టీ హైదరాబాద్ మెట్రో నుంచి అర్ధాంతరంగా వైదొలగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు ఆరోపించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ బాధ్యతారాహిత్య, అనాలోచిత నిర్ణయంతో రాష్ట్ర ప్రజలపై ఒక్కరోజే ఏకంగా రూ.15 వేల కోట్ల అప్పుల భారం పడిందని విమర్శించారు. మేడిగడ్డ విషయంలో బీఆర్ఎస్‌ను బద్నాం చేసే అవకాశం ఇవ్వకుండా, తామే మరమ్మతులు చేస్తామని ఎల్&టీ ముందుకురావడమే రేవంత్ రెడ్డికి కంటగింపుగా మారిందని, అప్పటి నుంచే ఆ సంస్థపై కక్షగట్టి వేధించి, రాష్ట్రం విడిచి వెళ్ళిపోయేలా చేశారని మండిపడ్డారు. ఇవాళ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన కేటీఆర్ , ఎల్&టీ నిష్క్రమణ వెనుక ఉన్న కుట్రలు, ప్రభుత్వ వైఫల్యాలను పూసగుచ్చినట్టు వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మెట్రో ప్రాజెక్టును ఎలా ఆదుకొని నిలబెట్టిందో కేటీఆర్ వివరించారు. “2014లో మేము అధికారంలోకి వచ్చే నాటికి మెట్రో పనులు కేవలం 20-25% మాత్రమే పూర్తయ్యాయి. రాష్ట్ర విభజనతో రైడర్‌షిప్ తగ్గుతుందని ఎల్&టీ సంస్థ ఆందోళన చెందితే, స్వయంగా కేసీఆరే వారికి ధైర్యం చెప్పారు. ప్రజా రవాణా ప్రాముఖ్యత తెలిసిన వ్యక్తిగా, హైదరాబాద్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉందని భరోసా ఇచ్చి పనులను పరుగులు పెట్టించారు. కేవలం మూడేండ్లలోనే 2017 నవంబర్ 29న ప్రధాని మోదీ చేతుల మీదుగా మొదటి దశను ప్రారంభించాం. కరోనా కష్టకాలంలోనూ సంస్థ నష్టాల్లో ఉందని భయపడితే, కేసీఆర్ గారు మరోసారి అండగా నిలిచారు. రూ.3,000 కోట్ల వడ్డీలేని రుణం మంజూరు చేసి, అందులో రూ॥900 కోట్లు విడుదల చేసి మెట్రోను కాపాడారు. మా ప్రభుత్వ హయాంలో రోజుకు 5 లక్షల మంది ప్రయాణించే స్థాయికి, పీక్ అవర్స్‌లో కోచ్‌లు సరిపోనంతగా మెట్రోను అభివృద్ధి చేశాం. 69 కిలోమీటర్ల లైన్ పూర్తిచేసి, దేశంలోనే రెండో అతిపెద్ద మెట్రో నెట్‌వర్క్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాం. కాంగ్రెస్ హయాంలో ఆవాస హోటల్ వరకే ఉన్న లైన్‌ను, లక్షలాది ఐటీ ఉద్యోగులు పనిచేసే మైండ్ స్పేస్ వరకు పొడిగించి, స్కైవాక్‌లు నిర్మించి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాం” అని కేటీఆర్ తెలిపారు. “మేము అధికారం నుంచి దిగిపోయే ముందు, హైదరాబాద్ భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని 400 కిలోమీటర్ల మెట్రో విస్తరణకు ప్రణాళికలు రచించాం. ఓఆర్ఆర్ చుట్టూ 160 కి.మీ., భువనగిరి, సంగారెడ్డి, షాద్‌నగర్, కడ్తాల్ వరకు విస్తరణకు కేబినెట్ ఆమోదం తెలిపాం. అత్యంత కీలకమైన మైండ్‌స్పేస్-శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోకు టెండర్లు పూర్తిచేసి, కేసీఆర్ గారి చేతుల మీదుగా శంకుస్థాపన కూడా చేయించాం. భూసేకరణ అవసరం లేకుండా, పిల్లర్లు లేకుండా భూమ్మీదనే నిర్మించేలా దీన్ని డిజైన్ చేశాం. కానీ, రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే తీసుకున్న మొదటి అనాలోచిత నిర్ణయం ఎయిర్‌పోర్ట్ మెట్రో రద్దు. నా భూములు ఉన్నాయని, బీఆర్ఎస్ నేతలకు లబ్ధి చేకూరుతుందని పిచ్చి పిచ్చి ఆరోపణలతో ప్రాజెక్టును రద్దు చేసి ఎల్&టీపై మొదటి దెబ్బ వేశారు. అప్పటి నుంచే సీఎంకు, ఎల్&టీ మధ్య పంచాయితీ మొదలైంది” అని కేటీఆర్ అన్నారు. “మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగినప్పుడు, రాష్ట్ర ప్రభుత్వంపై ఒక్క రూపాయి భారం పడకుండా మా సొంత ఖర్చులతో రిపేర్ చేస్తామని ఎల్&టీ ముందుకు వచ్చింది. కాళేశ్వరాన్ని 'కూలేశ్వరం' అని బద్నాం చేద్దామనుకున్న రేవంత్ రెడ్డి ప్రచారానికి ఇది గండికొట్టింది. తమ రాజకీయ లబ్ధికి ఎల్‌టీ సహకరించలేదనే కోపంతో సీఎం ఆ సంస్థపై పగబట్టారు.



# భారీ మెజార్టీతో గెలుస్తాం

- విజయావకాశాలు మనకే ఉన్నాయి
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై కేసీర్ సమాలోచనలు
- సీనియర్ నేతలతో తాజా పరిస్థితులపై సమీక్ష

**గజ్వేల్(జనంసాక్షి):** త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భారీ మెజార్టీతో గెలుపొందే అవకాశాలు ఉన్నాయని, ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకొని విజయం సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని మాజీ సీఎం, భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ అన్నారు. శుక్రవారం ఎర్రవెల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ-ఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, పద్మారావు గౌడ్‌తోపాటు- పలువురు నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు సంబంధించి అనుసరించాల్సిన వ్యూహాలపై కేసీఆర్ దిశానిర్దేశర చేశారు. జూబ్లీహిల్స్‌లో ప్రతి అంశం పార్టీకి అనుకూలంగా ఉన్నట్లు- అన్ని నివేదికలు చెబుతున్నాయని కేసీఆర్ అన్నారు. క్షేత్ర స్థాయిలో కిందిస్థాయి కార్యకర్తలను అప్రమత్తం చేసి తద్వారా ఓటర్లలో అవగాహన కల్పించాలని సూచించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయిందన్నారు. కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పేందుకు జూబ్లీహిల్స్ ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు- తెలిపారు. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీ శ్రేణుల్ని అప్రమత్తం చేయాలని కేసీఆర్ సూచించినట్లు- తెలుస్తోంది.

**చాకలి ఐలమ్మకు కెసిఆర్ నివాళి**

పాలకులు అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలను అటు న్యాయస్థానాల్లో ఇటు క్షేత్ర స్థాయిలోనూ పోరాడి గెలవాలనే ప్రజాస్వామిక స్ఫూర్తిని చిట్యాల ఐలమ్మ తెలంగాణ సమాజానికి అందించింది అని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరనారి చిట్యా(చాకలి)ఐలమ్మ 130వ జయంతి సందర్భంగా ఆమె పోరాట స్ఫూర్తిని కేసీఆర్ స్మరించుకున్నారు. తెలంగాణ మహిళా చైతన్యానికి బహుజన వర్గాల ప్రజాస్వామిక, ఆత్మగౌరవ పోరాట పటిమకు నిదర్శనం అన్నారు. ఎక్కడా రాజీ పడకుండా, సబ్బండ వర్గాల అభ్యున్నతి సంక్షేమమే ప్రధానంగా గత పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అమలు చేసిన పథకాలను కొనసాగించడం ద్వారా మాత్రమే చాకలి ఐలమ్మకి మనమందించే ఘన నివాళి అని కేసీఆర్ స్పష్టం చేశారు.

## మండల, జిల్లా పరిషత్ రిజర్వేషన్ల విధివిధానాలు ఖరారు

**జీవో విడుదల పంచాయతీ రాజ్ శాఖ**


**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీల రిజర్వేషన్ల విధానంపై పంచాయతీ రాజ్ శాఖ జీవో జారీ చేసింది. ఎస్సీ, ఎస్టీలకు 2011 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్టు జీవోలో పేర్కొన్నారు. బీసీలకు కులగణన డేటా ఆధారంగా రిజర్వేషన్లు కల్పించారు. ఇప్పటికే బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అధికార యంత్రాంగం సిద్ధం చేసింది.శనివారం రాజకీయ పార్టీల సమక్షంలో డ్రా ద్వారా మహిళా రిజర్వేషన్లు ఖరారు చేయనున్నారు. మండల, జిల్లా పరిషత్ లకు ముందుగా ఎన్నికలు నిర్వహించే అవకాశ ముంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల తర్వాత పంచాయతీ ఎన్నికలు జరిపే అవకాశమున్నట్టు సమాచారం. పంచాయతీలు, వార్డుల్లో రిజర్వేషన్ల విధివిధానాలపై కూడా జీవో జారీ అయింది.

**'పుతిన్‌కు మోదీ ఫోన్'..**

## నాటో చీఫ్ వ్యాఖ్యలు సరికాదు

**ఖండించిన భారత్**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అమెరికా సుంకాల నేపథ్యంలో ఉక్రెయిన్‌పై రష్యా వ్యూహం గురించి పుతిన్‌ను ప్రధాని మోదీ ఆరా తీశారంటూ నాటో చీఫ్ మార్క్ రుటె చేసిన వ్యాఖ్యలను భారత్ ఖండించింది. అవి నిరాధారమైనవని, అటువంటి వ్యాఖ్యలు చేసేటప్పుడు బాధ్యతగా వ్యవహరించాలని సూచించింది. జరగని సంభాషణల గురించి ఊహాజనిత వ్యాఖ్యలు చేయడం ఆమోదయోగ్యం కాదని భారత్ స్పష్టం చేసింది.




## 'ఈఎంఎస్' అప్లికేషన్‌తో గ్రేటర్ వ్యాప్తంగా లీజు చెల్లింపులు ఇక సులభతరం

**హైదరాబాద్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** పురపాలక మార్కెట్లు, షాపింగ్ కాంప్లెక్సులు, మోడల్ మార్కెట్లు, లీజు భూములు వంటి ఆస్తుల నిర్వహణను మరింత ప్రభావవంతంగా నిర్వహించడానికి జీహెచ్‌ఎంసీ ఆధునిక డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 'ఎస్టేట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈఎంఎస్)' పేరుతో రూపొందించిన ఈ యాప్‌ను సెప్టెంబర్ 24న జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించారు. కమిషనర్ ఆర్.వి. కర్నన్, కమిటీ సభ్యులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈఎంఎస్ ద్వారా లీజుదారులు తమ లీజు చెల్లింపులు, అద్దె మొత్తాలను ఆన్‌లైన్‌లోనే సులభంగా చెల్లించవచ్చు. దీనివల్ల పారదర్శకత, జవాబుదారీతనం, వ్యవస్థలో సమర్థత పెరగనుంది. మానవ జోక్యం తగ్గి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు అందుతాయి. వినియోగదారుల ఫ్రెండ్లీగా రూపొందించిన ఈ యాప్‌లో డిమాండ్, కలెక్షన్, బ్యాలెన్స్ వివరాలు రియల్‌టైమ్‌లో కనిపిస్తాయి. ఫీల్డ్ స్థాయి నుంచి హెడ్ ఆఫీస్ వరకు మానిటరింగ్‌కు ఇది దోహదపడుతుంది. పురపాలక ఆస్తుల నిర్వహణను బలోపేతం చేయడం, ప్రభావంతంగా నిర్వహించడంలో ఈ డిజిటల్ వేదిక కీలకంగా నిలవనుందని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ తెలిపారు.

# చెరువు కట్ట తెగిందని పుకార్లు షికార్లు

- ఊరు మునుగుతుందని సోషల్ మీడియాలో వదంతులు
- ఆందోళనకు గురైన సమీప గ్రామాల ప్రజలు
- చెరువుల వద్దకు పరుగులు తీసిన అధికారులు
- వదంతులను నమ్మవద్దని ఇరిగేషన్ అధికారుల సూచన


వైరల్ చేసిన చెరువు ఫొటో


ఘనపురం చెరువు

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పుకార్లు షికార్లు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేశాయి.. గత రెండు రోజులుగా జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి.. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో అనేక వదంతులు వెలువడ్డాయి.. వర్షాలకు చెరువు కట్ట తెగిందని, ఊరు మునుగుతుందని పలు వాట్సప్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టడంతో సమీప గ్రామాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు.. ఆ నోట ఈ నోట చివరికి జిల్లా అధికారుల దృష్టికి వెళ్లడంతో చెరువులను పరిశీలిస్తే, చెరువు కట్టలు తెగలేదు.. ఎలాంటి ప్రమాదాలు పొంచి లేవు.. మొత్తం మీద సోషల్ మీడియాలో వచ్చిన పుకార్లు జయశంకర్ జిల్లాను అయోమయానికి గురి చేసింది.. వివరాల్లోకి వెళితే..

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం సోషల్ మీడియాలో ఆందోళన కలిగించే ఓ వీడియోను కొందరు వైరల్ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఘన్ పూర్ చెరువు కట్ట ఇంతకుముందే తెగిపోయిందని, చెరువు నీళ్లన్నీ బయటికి వస్తున్నాయని, ఊరు మొత్తం మునిగిపోతుందనే మాటలు చెబుతూ, చెరువు కట్ట తెగిపోయి నీళ్లు బయటికి వెళ్తున్న వీడియో ఒకటి వాట్సాప్ గ్రూప్ లో షికార్లు కొట్టింది. ఈ జిల్లాలోని వివిధ వాట్సాప్ గ్రూపులకు రావడంతో పాటు, పొరుగున ఉన్న జిల్లాల నుండి కూడా ఫోన్లు రావడంతో గణపురం, భీమ్ ఘనపూర్ చెరువుల సమీప ప్రాంత గ్రామాల ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. సమీప గ్రామాల ప్రజలు తమ ప్రాణాలను రక్షించుకోవడం కోసం ముళ్లే, మూట సర్దుకుని బయటికి వెళ్లే పరిస్థితి నెలకొంది. సోషల్ మీడియాలో వచ్చిన విషయం జిల్లా అధికారుల దృష్టికి వెళ్లడంతో తమ సిబ్బందిని వెంటనే అప్రమత్తం చేశారు. వెంటనే చెరువులను పరిశీలించాలని చెప్పడంతో హుటాహుటిన పరుగులు పెట్టారు. అధికారులు, సిబ్బంది వెళ్లి చెరువులను పరిశీలించగా ఎలాంటి ప్రమాదం ఘటికలు కనిపించలేదు. చెరువు కట్టలు బాగానే ఉన్నప్పటికీ కొంతమంది కావాలనే ఇతర ప్రాంతంలోని ఓ పాత వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసి వైరల్ చేశారని, అధికారులు గ్రహించారు. కాకపోతే జయశంకర్ జిల్లా ఘన్ పూర్ చెరువు అని మాటలు వినిపించడం, ఆ వీడియో వైరల్ కు కారణమైంది. ఈ వీడియో జయశంకర్ జిల్లాను ఒక్కసారిగా ఉలిక్కి పడేలా చేసింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సమీప గ్రామాల ప్రజలు భయకంపితులయ్యారు. ఈ మేరకు అధికారులు చెరువులను పరిశీలించి అలాంటిది ఏమీ లేదని తెలియజేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఏది ఏమైనా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో చెరువు కట్ట తెగిందనే పుకార్లు షికార్లు చేయడంతో ఒక్కసారిగా ఈ ప్రాంత ప్రజలు అయోమయానికి గురయ్యారు.


### అసత్య ప్రచారాలు నమ్మవద్దు : ఇరిగేషన్ ఈఈ బసవప్రసాద్



కొన్ని ప్రాంతాల్లో చెరువులు తెగిపోయాయని సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలు నమ్మవద్దు. ప్రస్తుతం జిల్లా పరిధిలోని చెరువులు అన్నీ సురక్షితంగా ఉన్నాయి. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. సంబంధిత ప్రాంతాల్లో డీఈఈలు, ఏఈఈలు, లష్కర్లు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ తమ పరిధిలో తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అధికారుల నుంచి అందే సమాచారం తప్ప వేరే వదంతులను నమ్మవద్దు.

## బోగస్ ప్రచారాలు మానుకో కౌశిక్ రెడ్డి!


- హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్




**హుజూరాబాద్ (జనంసాక్షి) :** హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బోగస్ ప్రచారాలు మానుకోవాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ సూచించారు. హుజురాబాద్ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని,ఉప ఎన్నికల తర్వాత హుజురాబాద్ అభివృద్ధికి సంబంధించి రూపాయి నిధులు కూడా విడుదల కాలేదని,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 20 నెలల్లో ఇన్చార్జిగా హుజురాబాద్,జమ్మికుంట పట్టణాల అభివృద్ధికి 30 కోట్లు,ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా 10 కోట్లు,హుజురాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి అదనంగా మరో కోటి ఎనిమిది లక్షల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసిందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఒక వీడియోను ఆయన రిలీజ్ చేశారు.నిధులు మంజూరు చేసినందుకు గాను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,జిల్లా మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు ప్రత్యేకంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కౌశిక్ రెడ్డి సోషల్ మీడియాలో బోగస్ ప్రచారాలు చేస్తూ అబద్ధపు మాటలు మాట్లాడుతున్నాడని,ఉప ఎన్నిక తర్వాత ఎమ్మెల్సీగా అయిన నాటినుండి కౌశిక్ రెడ్డి ప్రభుత్వ విప్‌గా కొనసాగుతూ హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి రూపాయి నిధులు కూడా తీసుకురాలేదని, చిత్తశుద్ధి ఉంటే ఎన్ని నిధులు మంజూరు చేశారో తెలుపాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక,ఇన్చార్జిగా తాను బాధ్యతలు తీసుకున్న తర్వాత నియోజకవర్గ అభివృద్ధి గురించి పలుమార్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని దానికి సానుకూలంగా స్పందించి వారు నిధులు మంజూరు చేశారని,విద్యా రంగానికి ప్రాధాన్యత ఇస్తూ హుజురాబాద్ కు ఐటీఐ (ఏటీసి) కాలేజీ కూడా మంజూరు చేసిందని తెలిపారు.ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో వీణవంక నుండి నరసింగాపూర్ వెళ్లాల్సిన ప్రధాన రహదారిని పూర్తి చేయలేని కౌశిక్ రెడ్డి 30 కోట్ల నిధులు తెచ్చారు అనడం హాస్యాస్పదమని,సొమ్ము కాంగ్రెస్ ప్రభుత్వానిదైతే కేసీఆర్ ఇప్పించినట్టు బిల్డప్ కొట్టడం చూసి జనాలు నవ్వుకుంటున్నారని అన్నారు.రాబోయే రోజుల్లో హుజురాబాద్ కు మరిన్ని నిధులు తీసుకువచ్చి హుజురాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తామని అన్నారు.

## బీర్ల ఐలయ్యవి పార్టీ వ్యతిరేక చర్యలు

- మండిపడ్డ మరో ఎమ్మెల్యే సామేలు




**యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్26 (జనంసాక్షి) :** ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యపై తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీర్ల ఐలయ్య లఫంగి రాజకీయాలు మానుకుని, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి రాజకీయ వ్యభిచారం చేసుకోవాలన్నారు. భువనగిరిలో మీడియాతో మందుల సామేల్ మాట్లాడారు. మదర్ డైరీ ఎన్నికల్లో తమ జిల్లా నాయకులు కొంతమంది బీఆర్ఎస్ పార్టీతో పొత్తు పెట్టుకుంటున్నట్లు– ఆరోపించారు. డీసీసీ అధ్యక్షుడు, మదర్ డైరీ చైర్మన్ మీకు బంధుత్వం కోసం కాంగ్రెస్ పార్టీని బొందపెట్టవద్దన్నారు. మదర్ డైరీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలిస్తే నైతికంగా బాధ్యత వహిస్తూ బీర్ల ఐలయ్య తన పదవులకు రాజీనామా చేయాలన్నారు. ప్రభుత్వ విప్‌గా ఉన్న బీర్ల ఐలయ్య కాంగ్రెస్ పార్టీని బొందపెట్టె– ప్రయత్నం చేస్తున్నట్లు– మండిపడ్డారు. రేమదర్ డైరీ ముగ్గురు డైరెక్టర్ల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని చైర్మన్లను వేడుకుంటున్నట్లు– చెప్పారు. ఎవరి ప్రలోభాలకు గురి కాకుండా ముగ్గురు కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు, మదర్ డైరీ చైర్మన్ జంగిలి పనులు, లఫంగ పనులు చేయకండని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ ఓడితే నాయకులు, కార్యకర్తలు వారికి తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

## బతుకమ్మకుంట ప్రారంభం వాయిదా

**హైదరాబాద్, సెప్టెంబర్26 (జనంసాక్షి) :** అంబర్‌పేటలో పునర్నించిన బతుకమ్మ కుంట ప్రారంభోత్సవాన్ని వాయిదా వేశారు. వర్షం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం జరగాల్సిన కార్యక్రమాన్ని ఆదివారానికి వాయిదా వేశారు. హైదరాబాద్ నగరంలోని బాగ్ అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట ఆక్రమణకు గురైంది. పెద్దమొత్తంలో భవంతులు వెలిశాయి. మిగిలిన కొద్ది స్థలం కూడా కబ్జాదారుల చేతుల్లో ఉంది. దాన్ని వాహనాల పార్కింగ్ స్థలంగా వినియోగించుకునేవారు. ముళ్ల కంపలు, చెత్తాచెదారం వేసేవారు. హైడ్రా ఏర్పాటైన తర్వాత బతుకమ్మ కుంట ఆక్రమణలపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయి. రెవెన్యూ దస్త్రాలను ఆధారాలుగా చూపారు. రంగంలోకి దిగిన హైడ్రా.. ఖాళీ స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. న్యాయపరమైన అడ్డంకులను ఎదుర్కొంది. అక్కడ ఎక్స్‌కవేటర్లతో తవ్వగా మీటరు లోతులోనే నీరు ఉబికివచ్చింది. దాదాపు రూ.7.15 కోట్లు వెచ్చించి ఆధునికీకరణ పనులు చేపట్టింది. పిక్నిక్ స్పాట్‌గా తీర్చిదిద్దింది. చిన్న పిల్లలు ఆడేందుకు ఆటస్థలం, వృద్ధులు సేద తీరేందుకు బెంచీలు తదితరాలు ఏర్పాటు చేసింది.

## కేసీఆర్‌కు రుణపడి ఉంటా

- జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత



**హైదరాబాద్, సెప్టెంబర్26 (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి సునీతను గులాబీ బాస్ కేసీఆర్ ప్రకటించారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మాగంటి సునీత మాట్లాడుతూ... జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఎవరైనా టికెట్ ఆశించవచ్చని... కానీ తనమీద నమ్మకంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ టికెట్ ఇచ్చారని చెప్పుకొచ్చారు. కేసీఆర్ చేసిన అభివృద్ధే తనను జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తాను ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నికల్లో పోటీ చేయాల్సి వస్తోందని ఎప్పుడూ అనుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు మాగంటి సునీత. తన భర్త మాగంటి గోపీనాథ్ పోటీ చేసినప్పుడు బ్యాగ్రౌండ్ వర్క్ చేశానే తప్పా... బయటకు రాలేదని చెప్పుకొచ్చారు. తన భర్త గోపీనాథ్ మరణాన్ని ఇప్పటికీ జూబ్లీహిల్స్ ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు. జూబ్లీహిల్స్ ప్రజలకు గోపీనాథ్ పెద్ద కొడుకుగా ఎప్పుడూ అందుబాటులో ఉండేవారని స్పష్టం చేశారు. పార్టీలో అందర్నీ కలుపుతూ ముందుకు వెళ్తానని వెల్లడించారు. బీఆర్ఎస్ నాయకత్వం మద్దతుతోనే ఇక్కడి వరకూ వచ్చానని క్లారిటీ– ఇచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను తన భర్త గోపీనాథ్ పటిష్టంగా తయారు చేశారని మాగంటి సునీత పేర్కొన్నారు.

## పూలే- అంబేద్కర్ భావజాల వ్యాప్తి బాధ్యత ఉపాధ్యాయులదే..

- ప్రముఖ కవి రచయిత జయరాజ్..



**మహబూబాబాద్ ప్రతి నిధి, సెప్టెంబర్ 26 (జనం సాక్షి):** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఎస్వీఎం పంక్షన్ హాల్ లో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో చాగంటి ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో దళిత రత్న అంబేద్కర్ వాది సామాజిక ఉద్యమ నేత ప్రభుత్వ ఉపాధ్యాయుడు పార్నందిరామయ్య పదవి విరమణ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ కవి రచయిత జయరాజ్ మాట్లాడుతు పూలే అంబేద్కర్ భావజాల వ్యాప్తి చేయడంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో సమాజం చైతన్యము కావాలంటే పూలే అంబేద్కర్ భావజాలం మాత్రమే బహుజన వర్గాలను రక్షిస్తుందని వారు పేర్కొన్నారు. పార్నంది రామన్న బహుజన ఉద్యమాలు అంబేద్కర్ బావజాల వ్యాప్తిలో విశేష కృషి చేశారని ఉపాధ్యాయుడిగా వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దాడంలో అనేక కృషి చేశారని పేర్కొన్నారు. పదవి విరమణ సన్మాన కార్యక్రమానికి గౌరవ అతిధిదులుగా కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గణపురపు అంజయ్య డిసిహేచ డాక్టర్ చింత రమేష్ టిపిటిఎఫ్ నాయకులు మైస శ్రీనివాస్ మాజీ డిఎంహేఓ డాక్టర్ అంబరీష పిఆర్టియు నేత సంక బద్రి నారాయణ వీరు నాయక్ మందుల శ్రీరాములు బానోత్ కిషన్ నాయక్ మిరియాల సతీష్ రెడ్డి రమేష్ నంగరా బేరి నేతలు హరి నాయక్ భీమా నాయక్ సోమవారపు వీరస్వామి రాంజీ నాయక్ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## అనుమానస్పదంగా భార్యాభర్తలు మృతి

- ఇద్దరూ పశువుల కాపరులే



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** అడవిలోకి పశువులను మేపడానికి వెళ్లిన భార్యాభర్తలు మృతి చెందడం మిస్టరీగా మారింది. కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) మండల అట విశాఖ రేంజ్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. సిర్పూర్ టి మండలంలోని అచ్చలి గ్రామానికి చెందిన భార్యాభర్తలు దూలం సుశీలుశేఖర్లు పశువుల కాపర్లుగా జీవనం కొనసాగిస్తున్నారు. గురువారం పశు వులను తోలుకొని సమీపంలోని పెద్ద బండ గ్రామ శివారులో గల భీమన్న దేవాలయం సమీపంలోని అటవీ ప్రాంతంలో పశువులను మేపడానికి వెళ్లారు. ఈ క్రమంలో గురువారం రాత్రి వరకు వారు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు సిర్పూర్ టి మండల పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా భీమన్న దేవాలయం సమీపంలో గల అడవి చెట్ల మధ్య భార్య భర్తల సుశీల, శేఖర్ల శవాలను గుర్తించారు. దీంతో కాగజ్ నగర్ డివిజన్ అటవీశాఖ అధికారులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలాన్ని చేరుకున్న ఎఫ్డిఓ బోర్కుడే సుశాంత్ కుమార్ ఘటన జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం పోలీస్, అటవీ శాఖ అధికారులు జిల్లా ఫోరెన్సిక్ అధికారులను పిలిపించి మృతదేహాల నుంచి నమూనాలను సేకరించి తీసుకుని వెళ్లారు. పోస్టుమార్టం నివేదిక, ఫారెన్సీ కి నివేదిక ల ఆధారంగా పశువుల కాపర్లు సుశీల, శేఖర్ల మృతి ఎలా జరిగింది మరి పది రోజుల్లో తెలిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

## పర్యాటక అభివృద్ధిపై ప్రభుత్వ దృష్టి

- నేడు శిల్పారామంలో టూరిజం కాంక్లేవ్
- హాజరుకానున్న సిఎం రేవంత్




**హైదరాబాద్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** పర్యాటక రంగం అభివృద్ధిపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా శిల్పారామంలో టూరిజం కాంక్లేవ్ శనివారం జరుగనుంది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. టూరిజం కాంక్లేవ్ ద్వారా పర్యాటక రంగానికి రూ.15 వేల కోట్ల పెట్టుబడులు, 50 వేల ఉద్యోగాలు రానున్నాయి. హుస్సేన్ సాగర్‌లో డబుల్ డెక్కర్ బోట్‌ను 'ముచుకుందా' పేరుతో నేడు ప్రారంభించనుంది. అలాగే, తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి హోటళ్లు, వెల్‌నెస్ సెంటర్లు, రిసార్టులు, ఫైవ్‌స్టార్ హోటళ్లు ఏర్పాటు– చేయనుంది. అలాగే, ఫిల్మ్ ఇన్ తెలంగాణ పోర్టల్‌ను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రారంభించనుంది. సినిమా షూటింగ్స్‌కు తెలంగాణ ప్రభుత్వం సింగిల్ విండో అనుమతులు ఇవ్వనుంది. మెడికల్ వాల్యూ టూరిజం పోర్టల్ ప్రారంభించనుంది. ప్రపంచం నలుమూలాల నుంచి పేషెంట్లకు సౌకర్యం కల్పించనుంది. తెలంగాణలో హెలికాప్టర్ టూరిజం ప్రారంభించనుంది. సోమశిల – శ్రీశైలం రూట్‌లో తొలి సర్వీసులు కల్పించనుంది. వీటితో పాటు– సీప్లేన్ టూరిజం కోసం ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. టూరిజం పోలీస్ ఫోర్స్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. టూరిజం పోలీస్ ఫోర్స్‌లో 15 మంది నుంచి 90 మందికి పెంచనుంది. ఇందుకోసం ఐఆర్‌సీటీసీ, ట్రావెల్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంది. అలాగే, డిజిటల్ టూరిజం కార్డును కూడా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురానుంది.



## మేడిగడ్డ బ్యారేజీలో భారీ వరద

**అన్నారం బ్యారేజీ బ్యాక్ వాటర్‌తో గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం**

**మహదేవపూర్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** తెలంగాణ మహారాష్ట్ర లోగతనాలుగు రోజులకుపాటు కురుస్తున్న భారీవర్షాలకు కాళేశ్వరం ప్రణహిత నది నిండుకుండలా ప్రవహిస్తుంది.మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ లో నీరు అధికంగా చేరడంతో శు క్రవారం సాయంత్రం 6, లక్షల36,130. క్యూసెక్కుల నీటిని 85 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసినారు. అదేవిధంగా ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు అన్నారం సరస్వతి బ్యారేజ్ గోదావరి నదిలో నీరు అధికంగా ప్రవహించడంవల్ల గత ఐదు సంవత్సరముల నుండి గోదావరి బ్యాక్ వాటర్ తో అన్నారం చంద్రుపల్లి బ్రిడ్జిపై నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో గ్రామాల ప్రజల రాకపోకలు నిలిచిపోయినవి. నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో రైతుల పంట చేన్లలోకి నీరుచేరి మునిగినవని ఆందోళన చెందుతున్నారు. బ్యారేజీ వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయాగ్రామాల రైతులు వేడుకుంటున్నారు.

## గిరిజన జాతి విచ్ఛిన్నానికి పాల్పడితే నష్టపోయేది ఆదివాసీలే..



**పాలకుర్తి, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** గిరిజన జాతుల మధ్య విచ్ఛిన్నానికి పాల్పడితే నష్టం జరిగేది ఆదివానీలకేనని లంబాడ హక్కుల పోరాట సమితి జాక్ రాష్ట్ర కన్వీనర్ భూక్య జైసింగ్ రాథోడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజన భవన్లో నిర్వహించిన జిల్లా స్థాయి విస్తృత సమావేశానికి జైసింగ్ రాథోడ్, జాటోతు కిషన్నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జైసింగ్ రాథోడ్ మాట్లాడుతూ అన్నతమ్ముళ్లుగా కలిసి ఉండే గిరిజన జాతుల మధ్య కొంత మంది రియలేస్టేట్ వ్యాపారులు సుప్రీం కోర్టులో కేసు వేయించారని తెలిపారు. 1976లో పార్లమెంటులో బిల్లు పెట్టి ఆర్టికల్ 342 ప్రకారం లంబాడ గిరిజనులను ఎస్టీ జాబితాలో చేర్చారని అన్నారు. గిరిజన ఓట్లతో గద్దెనెక్కిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లంబాడ గిరిజనుల పట్ల వైఖరీ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో నాయకులు వెంకట్, నాగరాజు, మహేందర్, సురేష్. దేవేందర్, యాకూబ్, కిషన్, లక్ష్మన్ నాయక్. తదితరులు ఉన్నారు.

# లడాఖ్‌లో "జెన్-జెడ్ యువత పోరాటంగా మారనుందా?

ల‌డాఖ్‌లో హింస రగులుతోంది. లెహ్ నగరం కాలిపోతోంది. సెప్టెంబర్ 24, 2025న బీజేపీ కార్యాలయం ధ్వంసమైంది. పోలీసు వాహనాలు బూడిద య్యాయి. ఐదుగురు మరణించారు. 50 మందికి గాయాలు అయ్యాయి . జెన్-జెడ్ యువత ఆగ్రహంతో ఉన్నారు. వారు కేంద్ర పాలిత ప్రాంతానికి బదులుగా ప్రత్యేక రాష్ట్రం కావాలని ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు.అలాగే రాజ్యాంగంలోని 6వ, షెడ్యూల్ లో చేర్చాలని కోరుతున్నారు.అలాగే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అందుకోసం పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రత్యేకం గా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు,తమ భూముల పై తమకే హక్కులు ఉండాలని అడుగుతున్నారు.తమ గిరిజన సంస్కృతికి రక్షిణ కల్పించాలని కోరుతున్నారు. ఇది కేంద్ర ప్రభుత్వం పై తిరుగుబాటు కాదు. ఇది వారికి ఎదురైన నిత్య జీవిన సమస్యలు.వారి డిమాండ్స్ లో న్యాయం ఉంది.

**చారిత్రక నేపథ్యం:**

ఏదైనా విషయాన్ని చారిత్రక నేపథ్య క్రమంలో తారసపడే అనేక పరిణామాలు ను చూసి,చర్చించి సత్యాన్ని ఆకళింపు చేసుకోవాలి."లడాఖ్" ప్రాంతంలో ఒక పురాతన గిరిజన సంస్కృతి పరిడవిల్లింది. బౌద్ధులు, ముస్లింలు ఇక్కడ నివసిస్తారు. లెహ్‌లో బౌద్ధులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. కార్గిల్ ప్రాంతంలో ముస్లింలు సంఖ్య అధికం. 1947లో లడాఖ్ భారత్‌లో చేరింది. జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో భాగమైంది. వారికి ఆర్టికల్ 370 స్పెషల్ స్టేటస్ ఇచ్చింది. లడాఖ్‌కు అటానమీ ఉండేది. బీజేపీ హయాంలో 2019లో పెను మార్పులు జరిగాయి. ఆర్టికల్ 370 రద్దు అయ్యింది. లడాఖ్ యూని యన్ టెరిటరీగా మార్పు చెందింది. జమ్మూ కాశ్మీర్ నుంచి విడిపోయింది. ప్రజలు ఈ మార్పును స్వాగతించారు. ఆ సమయంలో కేంద్ర ప్రభుత్వం వారికి అనేక రక్షణ, అభివృద్ధి వాగ్దానాలు చేసింది. కానీ ఆచరణలో వారి స్వయం ప్రతిపత్తి (అటానమీ )పోయింది. వారి భూమికి భద్రత లేదు. ఉద్యోగాలు బయట వారికి వెళ్లాయి.కొత్త ఉద్యోగాలు రాలేదు.సరికదా ఉన్న ఉద్యోగాలే పోతున్నాయి.అక్కడి సైనిక చర్యల కోసం అభివృద్ధి ప్రణాళికలతో అటవీ ప్రాంతంలో పచ్చటి పర్యావరణం విధ్వంసం జరిగింది.స్థానిక ప్రజల జీవనం ప్రమాదంలో పడింది.

2020లో చైనాతో ఘర్షణ. గల్వాన్‌లో 20 మంది భారతీయ సైనికుల మరణం. లడాఖ్ సరిహద్దు సున్నిత ప్రాంతంగా ఉంది. స్ట్రాటజిక్ ఇంపార్టెన్స్ కలిగిన ప్రదేశం. వారి స్వేచ్ఛా, స్వాతంత్ర్యం స్వయం పాలన కోసం ప్రొటెస్టు లు మొదలయ్యాయి. లెహ్ ఆపెక్స్ బాడీ, కార్గిల్ డెమోక్రటిక్ అలయన్స్ ఆందోళనలు చేశాయి. ఐదేళ్లుగా పీస్‌ఫుల్ మార్చ్‌లు. హంగర్ స్ట్రైకులు. ఢిల్లీ పాదయాత్ర. నిరాహార దీక్షలు మొదలైన ప్రజాస్వామ్య పోరాట పద్ధతులు అనుసరించారు. కానీ కేంద్ర ప్రభుత్వం వారి డిమాండ్ల పట్ల ఉదాసీనంగా వ్యవహరించడంతో యువత నిరాశా నిస్పృహలతో ఉన్నారు.

**వారి ప్రధాన డిమాండ్‌లు:**

యూనియన్ టెరిటరీ నుండి స్టేట్‌హుడ్ కావాలి, వారిని రాజ్యాంగంలోని 6వ, షెడ్యూల్ లో చేర్చాలి, ట్రైబల్ ప్రొటెక్షన్, జాబ్ రిజర్వేషన్, 2 పార్లమెంట్ సీట్ల కేటాయింపు మొదలైన కోర్కెలు. కానీ కేంద్ర ప్రభుత్వం నుంచి వారికి సానూకూల ప్రతిస్పందనలు లభించలేదు.

**ప్రస్తుత పరిణామాలు:**

సెప్టెంబర్ 10, 2025న . సోనమ్ వాంగ్ చుక్(35) వారి డిమాండ్ల సాధన కోసం నిరాహార దీక్ష 35 రోజుల పాటు చేశారు . ఆరోగ్యం క్షీణించడంతో ఆసుపత్రికి పంపారు. ఆయనతో పాటు 15 మంది దీక్ష లోచేరారు. 35 రోజులు గడిచాయి. సెప్టెంబర్ 23న నిరాహార దీక్షలో ఉన్న మరో ఇద్దరి ఆరోగ్యం దిగజారింది. హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ లెహ్ ఆపెక్స్ బాడీ యూత్ వింగ్ లడాఖ్ షట్‌డౌన్ కి పిలుపు ఇచ్చారు. సెప్టెంబర్ 24న లెహ్ నగరం బంద్ కు నిరసనగా పిలుపును ఇచ్చారు. మార్టిర్స్ పార్క్‌లో సోనం స్పీచ్. "జెన్-జెడ్ రెవల్యూషన్." వైపు యువత ఆగ్రహంతో కదులుతుంది.




మాబ్ హింస చెలరేగింది. బీజేపీ ఆఫీస్ ను ధ్వంసం చేశారు. లాహ్‌డిసి బిల్డింగ్ డ్యామేజ్ అయింది. సీఆర్‌పీఎఫ్ వాహనం దగ్ధం చేశారు . స్టోన్ పెల్టింగ్... పోలీసు టియర్ గ్యాస్. లాఠీ చార్జ్. ఫైరింగ్ వేగంగా ఒకదాని వెంట ఒకటి జారిపోతున్నాయి. 5గురు మరణం. 80 మందికి గాయాలు. 30 మంది సెక్యూరిటీ సిబ్బంది గాయాలు. కర్ఫ్యూ విధింపు. సెక్షన్ 163 అమలు, 50 మందికి డిటెన్షన్. లడాఖ్ ఫెస్టివల్ రద్దు. మొదలైన సంఘటనలు వేగంగా

జరిగిపోతున్నాయి. సెప్టెంబర్ 25నుంచి కర్ఫ్యూ కొనసాగుతోంది. సెక్యూరిటీ భారీగా ఉంది. కేంద్ర హోమ్ మినిస్ట్రీ స్పందన. సోనమ్ వాంగ్ చుక్ ప్రొవోకేటివ్ స్టేట్‌మెంట్స్ వల్ల జరిగింది అంటుంది" "పొలిటికల్ మోటివేటెడ్." అని కేంద్ర ప్రభుత్వం అంటుంది. సమస్యల పరిష్కారానికి చర్చల కమిటీ మీటింగ్ అక్టోబర్ 6న జరపాలని కేంద్రం ఏక పక్ష నిర్ణయం తీసుకుంది అని నిరసన కారులు అంటున్నారు. 84 శాతం రిజర్వేషన్, 1/3 విమెన్ కోటా, భోటి, పుర్గి ఆఫీషియల్ భాషలు, 1800 ఉద్యోగాలు. అని ప్రతిపాదనలు వినవస్తున్నాయి . కానీ ఇవి సరిపోవు.

**కేంద్ర ప్రభుత్వానికి సూచనలు:**

కేంద్ర ప్రభుత్వం యువత ఆవాజ్‌ను వినాలి, హింసను "కుట్ర"గా ముద్ర వేయకూడదు. స్థానిక నాయకులు హింసా మార్గాలు వదులు కొని ప్రభుత్వంతో చర్చలను ప్రోత్సహించాలి. లడాఖ్ సమస్యలు కేవలం స్థానిక మైనవి మాత్రం కాదు. దేశవ్యాప్తమైనవి. మణిపూర్, నెపాల్ వంటి ప్రాంతాల్లో కూడా ఇలాంటి సమస్యలే ఉన్నాయి.అందుకే అక్కడ కూడా ఉద్యమాలు జరుగుతున్నాయి. యువత, ఎన్.జీ.ఓ. లు సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా ఉపయోగించాలి. అంతర్జాతీయ సమాజం భారత్‌కు మద్దతు ఇవ్వాలి, స్థానిక గిరిజనులకు మానవ హక్కుల పై శిక్షణ ఇచ్చి వారికి అవగాహన కల్పించాలి. గిరిజన హక్కులను, గిరిజన సంస్కృతిని రక్షించాలి. చివరగా, మీడియా: ఫేక్ న్యూస్‌ను నివారించి, సమతుల్య వార్తలనే కవరేజ్ చేయాలి.

చివరిగా....లడాఖ్ హింస కేంద్ర ప్రభుత్వానికి ఒక హెచ్చరిక. ఇది భారతదేశ యొక్క "ఏకతకు" పరీక్షా సమయం.అక్కడి సమస్యలను పరిష్కరించకపోతే, మరి కొన్ని ప్రాంతాల్లో ఉద్యమాలు పెల్లుబుకుతాయి. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో యువత లేవనెత్తిన అనేక ఉద్యమాలను చూశాం. స్థానిక ప్రజలతో సంభాషణలు జరిపి వారిని అభివృద్ధి పర్చడం ద్వారా, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించం ద్వారా లడాఖ్ మళ్లీ శాంతి, సమృద్ధి చిహ్నంగా మారవచ్చు. ఇది కేవలం ఒక ప్రాంతం కాదుబీ దేశ భవిష్యత్తు యొక్క కీలక భాగం.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

భారతీయ పునరుజ్జీవన ఉద్యమ పితామహుడు

# రామ్మోహన్ రాయ్

## సెప్టెంబర్ 27... రాజా రామ్మోహన్ రాయ్ వర్ధంతి



భారత సంఘ సంస్కరణల చరిత్రలోనే రామ్మోహన్ రాయ్ పేరు, సతీ సహగమనాన్ని రూపుమాపడంతో ముడిపడి చిరస్థాయిగా నిలిచిపోయారు. రామ్మోహన్ రాయ్, హిందూ పూజారుల అధికారాన్ని ధిక్కరిం చి, ఆ కాలములో సాధారణమైన బహు భార్యత్వం నేరమని జనులకు నచ్చ చెప్పారు.

**రాజా రామ్మోహన్ రాయ్**

ఆధునిక భారత పితామహుడు, పయనీర్ ఆఫ్ ఇండియా జర్నలిజం, బెంగాల్ సాంస్కృతిక పునరుజ్జీవన పితామహుడు, ఆధునిక భారత నిర్మాత. రామ్మోహన్ రాయ్ (మే 22, 1772 - సెప్టెంబరు 27, 1833) భారత దేశంలో మొదటి సామాజిక, మత సంస్కరణ ఉద్యమాలను ప్రారంభించారు. ఆయన విశేష ప్రభావం రాజకీయ, ప్రభుత్వ నిర్వహణ, విద్యా రంగాలలోనే కాకుండా హిందూమతం పైన కూడా కనపడుతుంది. ఉపనిషత్తుల్లోని నిరాకార తత్వాన్ని అంగీకరించి, మనవ సమాజంలో ఐక్యతను ఆకాంక్షించారు. అస్పృశ్యత, కులజాడ్యంపై చైతన్యం కలిగించారు. బ్రిటీష్ ప్రభుత్వం ద్వారా సతీసహ గమనాన్ని నిషేధించారు. వితంతు పునర్వివాహం, మహిళలకు ఆస్తి హక్కుల కోసం అతను పోరాడారు. అందరికీ విద్య ముఖ్యంగా స్త్రీ విద్య వల్ల దేశం పురోగతి మారుతుందని నమ్మారు. బాల్య వివాహ రద్దు చట్టం తెచ్చారు. వితంతు పునర్వివాహాలు కోసం కృషి చేశారు, స్త్రీ పురుషులకు సమాన హక్కులు కోసం గట్టిగా పోరాడారు. ముఖ్యంగా ఆంగ్ల విద్యకు అనుకూలంగా ఉండి, దేశంలో ఆంగ్ల విద్యావిధానానికి కృషిచేశారు.

రాజా రామ్మోహన్ రాయ్ బెంగాల్ లోని రాయ్ రాధా నగర్ లో 1772 మే 2న జన్మించారు. ఆయన తండ్రి రమాకాంత్ వైష్ణవుడు, కాగా తల్లి తరిణి శాక్త మతానికి చెందింది. రామ్మోహన్ బెంగాలీ, పర్షియన్, అరబిక్, సంస్కృత భాషలను పదిహేనో యేడు వరకు అభ్యసించారు. యుక్తవయస్సులో కుటుంబ ఆచారాలతో సంతృప్తి పొందక, యాత్రలు సాగించడం మొదలు పెట్టారు. రామ్మోహన్ రాయ్ 1803 నుంచి 1814 వరకు బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీలో, ఇంగ్లీష్ కోర్టులో బ్రాహ్మణ పండితులుగా పనిచేశారు. అదే సమయంలో గ్రీకు, లాటిన్ భాషలను నేర్చుకోవడం ప్రారంభించారు. 1803 నుంచి 1815 వరకు రాయ్ ముషీరాబాద్ లోని అప్పిలేట్ కోర్టు లో రిజిస్టర్ థామస్ వుడ్రాఫ్ కు మున్షి గా పని చేశారు. ఈ పదవికి రాజీనామా చేసిన తర్వాత ఈస్ట్ ఇండియా కంపెనీ లో కలెక్టర్ జాన్ డిగిబ్ కోసం పని చేశారు.

1828 లో ఇంగ్లాండుకు వెళ్ళక ముందు ద్వారకా నాథ టాగూర్తో కలసి బ్రహ్మసమాజ్ ను స్థాపించారు. బ్రహ్మసమాజ్ ఒక ముఖ్యమైన ఆధ్యాత్మిక, మత సంస్కరణ ఉద్యమంగా మారి బెంగాల్ లో సాంఘిక, వివేచనాత్మక సంస్కరణలకు దారి తీసింది. అలా రామ్మోహన్ రాయ్, బెంగాల్ సాంస్కృతిక పునరుజ్జీవనంలో ఒక ముఖ్యుడిగా గుర్తించ బడ్డారు.

తాము సంకల్పించిన సామాజిక, న్యాయ, మతపరమైన ఉద్యమాలలో రాయ్ మానవత్వాన్నే ప్రధానంగా తీసుకొన్నారు. ప్రజలకు తన ఉద్దేశం సమాజంలో ఉన్న మంచి సంప్రదాయాలను నిర్మూలించడం కాదని, కేవలం వాటిపై సంవత్సరాల పాటు నిరాదరణ వలన పేరుకు పోయిన కుళ్ళును తుడిచి వెయ్యడం అని చూపించుటకు కష్టపడ్డారు. ఉపనిషత్తులను, సూత్రాలను చదివారు. విగ్రహారాధనను ఖండించారు. ఆఖండానందాన్ని పొందుటకు, అధ్యాత్మిక చింతన, భగవంతుని ధ్యానం ఉన్నత మార్గాలని ప్రతిపాదించారు.

అచార సంబంధమైన సంస్కృత విద్య కంటే ఇంగ్లీషు విద్య మంచిదని భావించి, సంస్కృత పాఠశాలలకు ప్రభుత్వ నిధులను వ్యతిరేకించాడు. 1822 లో ఇంగ్లీషు పాఠశాలను ప్రారంభించారు. రాయ్ 1831లో మొగల్ సామ్రాజ్య రాయబారిగా ఇంగ్లాండ్ ను దర్శించాడు. 1833 సెప్టెంబరు 27న మెదడు వాపు వ్యాధితో బ్రిస్టల్ మరణించారు. రాజా రామ్మోహన్ రాయ్ విదేశాల్లో మరణించిన మొదటి వ్యక్తి.

రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

## బతుకమ్మ పాట సంబరాల పువ్వుల పూట!!

ఊర చెరువు ఉరకలెడుతుంది.
పెద్దచెరువు అలుగులు దుంకుతుంది వరి వెన్ను
వయ్యారంగా నాట్యమాడుతుంది.
ఊరి కొస పొలం సైతం నీరు తాకి
పరవశిస్తుంది
చేదుడు బావిలో నీళ్ళు పైకి వచ్చి గోలెంలా వుంది
మెట్ల బావిలో మోట తోలకుండానే నీరు
పొలంల పారుతుంది పాలకంకుల మీద
పాలపిట్ట విందారగిస్తుంది.
తాటి మట్టల మధ్య బురక పిట్టలు
సరసాలాడుతున్నాయి.
మోదుగు చెట్టు మీద గువ్వ గోరింక కోసం
నిరీక్షిస్తుంది
కోడి కూయగానే రుద్రమ్మ గుట్ట వైపు అడుగులు
ఈ నేల మొక్క తంగేడు అల్లుకున్న గుట్ట
గునుగుపూల సింగారంలో గుట్ట అందం
కంటగింపు వస్తూ వస్తూ శాయన్న కంచెల సీత
జడపూలు గట్ల మీద కట్లపూలు శనగ
చేల్ల మెరిసే సోం పువ్వు తెంపుకొచ్చే
అన్నదమ్ములు..
ఏడాదికో మారు వచ్చే బతుకమ్మ పండుగ
ఎదురుచూసే ఆడపిల్లల కళ్ళల్లో
పుట్టింటడుగిడగానే ఆనంద
భాష్పాలు తలంటుకుని ఉపవాసంతో నిష్ఠగా
పసుపు ముద్దతో గౌరమ్మ ఇత్తడి తాంబాళంల
అడుగున సొరాకు పేర్చి తంగేడాకు పరిచి
బతుకమ్మలో మహారాణి తంగేడు పువ్వుతో
అలంకరణ..
సోదరులు తెచ్చిన పూల సమతూకంల బతుకమ్మ
అందం శోభాయమానం ఎంత ఎత్తు పేర్చినా
ఒరగని నైపుణ్యం ఆడబిడ్డ సొంతం పట్టు లంగా
ఓణీలతో
పట్టు చీరలతో బిడ్డల ముస్తాబు నెత్తిన బతుకమ్మ
ఎత్తుకుని డప్పు చప్పుళ్ళతో వీధుల గుండా ఊరి
నడిబొడ్డు రావి చెట్టు దాటి చెరువు గట్టున
వలయాకారంలో బతుకమ్మల దించి ఆడి పాడే
పాటల కోరస్ ఆడబిడ్డల నోట మధురం
తరాల వారసత్వం పాటది! బతుకమ్మ సందడిది!!
నేలలో పండిన పెసర సజ్జ ముద్దలే ప్రసాదంగా
అచ్చోట బతుకమ్మ వెనుక గల కథల పునశ్చరణ
ఆఖరికి చెర్ల వదిలి వీడ్కోలు పలికి మళ్ళీ
రావమ్మా అంటూ సాగనంపే ఘటన మహత్తరం!!

# విద్యా విధానం.. సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి!

దేశ అభివృద్ధి పునాది విద్య. సమాజం ఎదుర్కొనే సవాళ్లు, ఆర్థిక వ్యవస్థలో మార్పులు, శాస్త్ర సాంకేతిక అభివృద్ధి ఇవన్నీ విద్య ద్వారా సులభంగా ఎదుర్కోవచ్చు. ఈ నేపథ్యంలో విద్యా విధానం ఒక మార్గదర్శకంగా నిలుస్తుంది. ఇది కేవలం పాఠశాలలలో పాఠ్యాంశాలు నిర్ణయించే పత్రం మాత్రమే కాదుబీ దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే బలమైన పునాది.ప్రస్తుత కాలంలో భారతదేశం జాతీయ విద్యా విధానం 2020 ద్వారా విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. ఈ విధానం విద్యార్థులలో సృజనాత్మకత, పరిశోధన, విశ్లేషణా శక్తి, నైపుణ్యాలను పెంచే దిశగా ముందుకు సాగుతోంది. చిన్ననాటి నుండి ప్రాథమిక పాఠశాల వరకు బలమైన పునాది వేసే 5ం3ం3ం4 విద్యా నిర్మాణం, మాధ్యమిక స్థాయిలో వృత్తి విద్య ప్రోత్సాహం, డిజిటల్ లెర్నింగ్ వంటి కొత్త ఆవిష్కరణలు దీని భాగం.

విద్యా విధానం యొక్క ముఖ్యమైన ఉపయోగం సమానత్వం. గ్రామీణ, పేద, మహిళలు, ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు కూడా నాణ్యమైన విద్య అందించడా నికి విధానం మార్గం సుగమం చేస్తుంది. ఉదాహరణకు, గ్రామీణ ప్రాంతాలలో డిజిటల్ వనరులు, స్కాలర్‌షిప్ పథకాలు, ఉచిత పాఠ్యపుస్తకాలు అందించడం ద్వారా పేద విద్యార్థుల చదువు మధ్యలో ఆగిపోకుండా చూడవచ్చు. ఇది కేవలం చదువుకే పరిమితం కాకుండా, సమాజంలో సామాజిక న్యాయం సాధించడానికి సహకరిస్తుంది. మరో ముఖ్య అంశం నాణ్యత. మంచి బోధన పద్ధతులు, ఉపాధ్యా యుల శిక్షణ, మరియు ఆధునిక పాఠ్యాంశాలు లేకుండా విద్యార్థులు గ్లోబల్ స్థాయిలో పోటీ చేయలేరు. కొత్త విధానం ఉపాధ్యాయుల నిరంతర శిక్షణ, టెక్నాలజీ వినియోగం, పరిశోధన ప్రోత్సాహం ద్వారా విద్యా నాణ్యత పెంపునకు ప్రాధాన్యం ఇస్తోంది. పరిశ్రమల అవసరాలకు సరిపడే కోర్సులు అందించడం, వృత్తి శిక్షణను పాఠశాల స్థాయి నుంచే ప్రవేశపెట్టడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.టెక్నాలజీ ఈ కాలపు ప్రధాన శక్తి. ఆన్‌లైన్ క్లాసులు, వర్చువల్ ల్యా బ్స్, కృత్రిమ మేధస్సు ఆధారిత బోధన విధానాలు విద్యలో విస్తృతంగా వాడకంలోకి వస్తున్నాయి. ఈ మార్పులు గ్రామీణ పట్టణ విద్యార్థుల మధ్య గ్యాప్ తగ్గించడంలో సహకరిస్తాయి. అదే సమయంలో విద్యార్థులను భవిష్యత్తు పరిశ్రమల అవసరాలకు సిద్ధం చేస్తాయి.

అంతేకాక, విద్యా విధానం పరిశోధన , ఆవిష్కరణలకు దారులు తెరుస్తుంది. విశ్వవిద్యాలయాల్లో పరిశోధన నిధులు, స్టార్టప్ సంస్కృతి, అంతర్జాతీయ సహకారం పెరుగుతోంది. ఇది శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్‌ను స్వయం సమృద్ధిగా మార్చుతుంది.

డిజిటల్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ డిమాండ్లను తీర్చడానికి సాంప్రదాయ విద్య నమూనాలు వేగంగా అభివృద్ధి చెందుతున్న పరివర్తన యుగం యొక్క అంచున భారతదేశం నిలుస్తోంది. పరిశ్రమలలో నవయుగ నిపుణుల పాత్రల పెరుగుదల ఈ డైనమిక్ మార్పులకు అనుగుణంగా ఉండే ఆధునిక విద్య యొక్క అవసరాన్ని హైలైట్ చేస్తుంది.ఆధునిక విద్య సృజనాత్మకత ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుంది. ఆచరణా త్మక, అనుభవపూర్వక అభ్యాసంహా బహుళ విభాగ విధానాలపై దృష్టి పెట్టడం ద్వారా, ఇది విద్యార్థులను సాంప్రదాయ చట్రాలకు మించి ఆలోచించమని ప్రోత్సహిస్తుంది. ఇది అధిక వృద్ధి అవకాశాలను అందించడమే కాకుండా ఆధునిక ప్రపంచంలోని సాంకేతికత ఆధారిత స్వభావాన్ని పరిష్కరించడానికి ఉద్భవించిన ప్రత్యేక పాత్రల అభివృద్ధికి దారితీసింది.హా

అందువల్ల, డిజిటల్-ఫస్ట్ కెరీర్‌లకు తగిన సామర్థ్యం నైపుణ్యాలను పెంపొందించుకోవడం అర్థమే. దీనికి ప్రత్యేకమైన, అధిక-వృద్ధి స్థానాలను చేపట్టడానికి సిద్ధంగా ఉన్న కొత్త తరం గ్రాడ్యుయేట్లు అవసరం.హా

విద్య ఎలా మారుతుందో మనం ఆలోచిస్తున్నప్పుడు విద్యా వ్యవస్థ ఆచరణాత్మకత, అనుకూలత, సాంకేతికత ద్వారా నిర్వచించబడిన గణనీయమైన పరివర్తనకు లోనవుతోంది, ఇది దేశంలో ఆధునిక విద్య యొక్క కొత్త తరంగానికి మార్గం సుగమం చేస్తుంది. భారతదేశంలో ఆధునిక విద్యా విధానం ఏమిటి!

ఆధునిక విద్యా వ్యవస్థ ఆధునిక భారతీయ విద్యావ్యవస్థ విద్యార్థులలో సమగ్ర అభివృద్ధిని పెంపొందించడానికి వినూత్న విధానాలతో కూడిన సాంప్రదాయ విద్యా విభాగాలపై నిర్మించబడింది. ఇది సైన్స్, వాణిజ్యం, కళలు వంటి ప్రధాన విషయా లను మాత్రమే కాకుండా విమర్శనాత్మక ఆలోచన, జీవిత నైపుణ్యాలు, విలువ ఆధారిత అభ్యాసం, విశ్లేషణాత్మక సామర్థ్యాలు, నిర్ణయం తీసుకోవడం వంటి వాటికి కూడా ప్రాధాన్యత ఇస్తుంది.

ఆధునిక విద్యా వ్యవస్థ వాస్తవ ప్రపంచ సమస్యలను ప్రతిబింబించే అనుభవపూర్వక అభ్యాసాన్ని ప్రోత్సహించడానికి దాని బోధనా విధానంలో సాంకేతికత , ఇంటరాక్టివ్ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించుకుంటుంది.

2.నేటి చదువుకు సార్థకత ఎందుకు లభించడం లేదు! విద్యా లక్ష్యాలను దృష్టిలో ఉంచుకోవడం లేదా! విద్య సరైన దారిలో ప్రజలకు అందకపోవడానికి ప్రభుత్వానికి బాధ్యత కాదా!విద్యా లక్ష్యాలను పునర్ నిర్వచించుకుంటే మంచిది. చదువు, విద్య అంటే కేవలం అక్షర జ్ఞానానికి మాత్రమే పరిమితమని వ్యవహారిక పదాలతో పాటు కొన్ని కఠిన గ్రాంధిక భాషా పదాలను నేర్చుకుంటే విద్యావంతులే అన్నట్లుగా ప్రచారాన్ని ముమ్మరం చేసిన కారణంగా కేవలం అక్షర జ్ఞానం ఉంటే విద్యావంతులే అనే భావన బలపడిపోయింది కానీ అది సత్య దూరం. అక్షరాలను నేర్చుకోవడం తిరిగి రాయడం అప్పగించడం అక్షరాల కూర్పుతో ఏర్పడే పదాలను రాసి సరిపోల్చుకోవడమే విద్యావంతుల లక్షణం అనుకుంటే సరిపోదు. చదువుకు సార్థకత ఉండాలి అనే మాట తరచుగా వింటూ ఉంటాము. దానికి మరింత విస్తృతార్థంలో విద్య అని నిత్యజీవితంలో వాడుతూ ఉన్నాం. అక్షర జ్ఞానంతో పాటు పదాల పొందిక, వాక్య నిర్మాణము, భాషా ప్రయోగాలు, భావము, అర్థము, సందర్భ వినియోగాన్ని చదువుగా భావించవచ్చు.

"అసలు విద్య అంటే తెలుసుకోవడం అని అర్థం. తెలుసుకున్నటువంటి అంశం లిఖితపూర్వకంగా ఉన్నప్పుడు, హేతుబద్ధంగా ఆలోచించినప్పుడు, కార్యకారణ సంబంధాలను కూడా దానికి జత చేసినప్పుడు, లోతైన ఆలోచన చేసినప్పుడు, విశ్లేషణతో కూడుకున్నటువంటి అవగాహనను పెంపొందించుకుంటే ఆ క్రమములో సాధించిన పరిజ్ఞానమంత విద్య అవుతుంది" .అయితే ఈ విశాలమైన అవగాహనకు సంబంధించిన విద్యకు మూలాధారం అక్షరాలు. అక్షరాలతో ఏర్పడినటువంటి పదాలు, పదాల పొందికతో ఏర్పడినటువంటి ధ్వని, తద్వారా విషయ అవగాహనకు, విషయ సేకరణకు, పరస్పర అభిప్రాయాల మార్పిడికి దోహదపడినప్పుడు అదే చదువు.. ఆ తర్వాత భాష అంతిమంగా విద్య అవుతుంది. విద్యావంతులు అనగానే ఒక రంగంలో నిష్ణాతులు అని మనం సాధారణంగా చెప్పుకుంటాం .అయితే ఏ రకమైన నైపుణ్యం సంపాదించాలన్న దానికి అక్షరాల పొందిక, భాష ,తద్వారా భావవ్యక్తీకరణ చేసే పదాల ఉచ్చరణ అంతా కూడా చదువు అని అనబడుతుంది. చదవడం ద్వారానే విషయాన్ని లోతుగా అర్థం చేసుకోవడానికి, తిరిగి బావ వ్యక్తీకరణకు, సందేహాలకు సమాధానం ఇవ్వడానికి, మరింత లోతైన సమాచారం కోసం అధ్యయనం చేయడానికి కూడా తోడ్పడేది చదు వే కదా!

చదువుకు సార్థకత ఎప్పుడు !స్వతంత్ర జీవితం గడిపినప్పుడు, స్వయంకృషితో కష్టపడి పని చేయడానికి ఇష్టపడినప్పుడు, నైతిక విలువలకు కట్టుబడి జీవించిన ప్పుడు, మానవ ప్రకృతి అనేక రకాల వనరులను సద్వినియోగం చేసుకున్నప్పుడు, ఇ న్ని రకాలుగా మనిషిని తీర్చిదిద్దునటువంటిదే నిజమైన చదువు అప్పుడే దానికి సార్థకత ఉంటుంది. కానీ మొక్కుబడిగా అక్షరాల యొక్క పొందిక మాత్రమే చదువు కాదని" సామాజిక ఉద్యమకారులు, విద్యావేత్త బాపూరావు పాటిల్ స్పష్టంగా ప్రకటించడాన్ని మనం మరింత లోతుగా చర్చించవలసినటువంటి అవసరం ఎంతగానో ఉన్నది .అక్షర జ్ఞానం నేర్చిన ప్రతివాళ్ళు వ్యవస్థను, వివిధ అంశాలను, ప్రకృతిలోని రహస్యాలను నిప్పి చెప్పలేరు. అంటే చదువు అక్షరజ్ఞానా నికే పరిమితం కాదు అని అర్థం. నిరక్షరాశులు కూడా సామాజిక చింతన సమాజ పరిశీలన ద్వారా మానవీయ కోణంలో ఆలోచించడం, మానవ విలువల పైన దృష్టి సారించడం, నైతిక విలువలకు కట్టుబడి ఉండడాన్ని మనం గమనించినప్పుడు అక్షర జ్ఞానము లేని వాళ్ళు కూడా ఈ రకంగా నిజాయితీపరులుగా బ్రతకగలుగుతున్నారు కనుక చదువు అంటే అక్షరజ్ఞానం మాత్రమే కాదు అని మనకు రూఢీ అవుతున్నది. అయితే అక్షరాజ్ఞానం, చదువు విశ్లేషణకు విద్యారంగ పరిపుష్టికి మనిషిని సర్వోన్నతుని చేయడానికి ఎంతో తోడ్పడుతుంది అనడంలో సందేహం లేదు.

.. అక్షరాల పరిజ్ఞానముతో చదివినటువంటి విషయాన్ని ఆధారం చేసుకుని సమాజంలో పరిశీలించిన అంశాలను క్రోడీకరించుకొని ఒక నిర్ణీత అభిప్రాయా నికి రావలసినటువంటి అవసరం కూడా ఉంటది. అంటే చదువు అనేది స్వతంత్ర జీవనం గడపడానికి అవసరమైనటువంటి శిక్షణ ఇస్తుంది అనడంలో సందేహం లేదు. ఉత్పత్తి యొక్క ప్రాధాన్యతను గనుక గుర్తించినప్పుడు కష్టపడి పనిచేయడం వల్ల మాత్రమే సంపద సృష్టించబడుతుందని ఆ సంపదను ప్రజలందరికీ పంపిణీ చేయడానికి ప్రభుత్వాలు ఉన్నాయని అప్పుడప్పుడు ప్రజల సంపదను ప్రభుత్వాలు పెట్టుబడిదారులు దోచుకుంటారని తెలుసుకునే క్రమము లోపల మనిషి యొక్క చదువుతోపాటు వ్యవహారిక జ్ఞానం కూడా ప్రజలను చైతన్యం చేయడానికి తోడ్పడు తుంది. వాస్తవంగా పాఠశాల ద్వారా అనేక రకాల నైపుణ్యాలు, మె లకువలు, ఆలోచనలు, బావ ప్రకటన స్వేచ్ఛ, సామాజిక సర్దుబాటు, ప్రకృతిలోని రహస్యా లు మానవీయ కోణంలో జీవించే ఆలోచనల సరళిని నేర్పే క్రమంలో నైతిక విలువలను కూడా నేర్పించడం పాఠశాల ద్వారా కొనసాగుతున్నటువంటి ఉత్తమ మైన ప్రక్రియ. తద్వారా సమాజంలో నైతిక విలువలు దిగజారుతున్నాయి ఆ దిగజారుతున్నటువంటి నైతిక విలువలను పునరుద్ధరించడానికి చదువు తోడ్పడా లి. అందుకు సంబంధించి పాఠ్యాంశాలలో విభిన్న అంశాలు చోటు చేసుకోవా ల్సిన అవసరాన్ని కూడా చదువు అనే ఆయుధం మనకు జ్ఞప్తికి చేస్తున్నది.

**విద్యారంగం పైన లోతైన చర్చ ప్రభుత్వ బాధ్యత**

విద్యా వ్యవస్థ పైన లోతైన చర్చ జరిపించడం ద్వారా దేశాభివృద్ధిలో చదువు యొక్క ప్రాధాన్యతను గుర్తింప చేయడం ప్రభుత్వము యొక్క బాధ్యత అని మేధావులు బుద్ధి జీవులు గతంలో నిర్ణయించిన అనేక కమిటీలు కూడా సిఫారసు చేసినప్పటికీ పాలకులు ఏనాడు పట్టించుకోలేదు. అదే విషయాన్ని ప్రస్తుతం సామాజిక ఉద్యమకారులు ప్రముఖ విద్యావేత్త బాపూరావు పాటిల్ గారు విద్య యొక్క బాధ్యతలను గుర్తిస్తూ దేశంలోనే ప్రకృతి మానవ ఇతర వనరుల యొక్క సద్వినియోగాన్ని చేసుకోవడానికి ఉపయోగపడే చదువు కీలకంగా పనిచేస్తుందని, ప్రజలు స్వతంత్ర జీవితం గడపడానికి నైతిక విలువలను పెంపొందించడం ద్వారా మానవీయ సమాజాన్ని ఆవిష్కరించడానికి చదువు స్ఫూర్తిదాయకం కావాలని చేస్తున్న సూచన పాలకులకు విద్యావేత్తలకు కూడా ఒక బాధ్యతగా పనిచేస్తుంది. వాస్తవంగా విద్యా లక్ష్యాలు అయినటువంటి పైన తెలిపిన అంశాలు నేడు గాలికి వదిలి వేయబడినవి. "శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదని" శ్రీశ్రీ అంటే శ్రమ చేయడానికి బదులుగా ఉపాయాలతో బతకాలని ఇతరులను మోసగి ంచాలని నేటి సామాజిక పరిస్థితులు ఒకవైపు హెచ్చరిస్తూ ఉన్నప్పుడు కష్టపడి పని చేసే స్వభావం ఏ రకంగా డెవలప్ అవుతుంది? అలాంటప్పుడు నైతిక విలువలు పునరుద్ధరించబడే ఆస్కారమే లేదు కదా! ఇక వనరులను సద్వినియోగం చేసుకోవ డం కాదు గదా! ప్రకృతి వనరులను కొంతమంది తమ స్వార్ధ ప్రయోజనానికి కొల్లగొట్టడం రివాజుగా మారిన దౌర్భాగ్య పరిస్థితుల మధ్యన చదువు తెల్లబోయింది. విద్యావ్యవస్థ తన లక్ష్యాన్ని సా కారం చేయలేక దుఃఖిస్తున్నది. ఇది నేడు భారతదేశంలో ఉన్నటువంటి సామాజిక రాజకీయ ఆర్థిక ముఖచిత్రంగా భావించినప్పుడు మౌలికమైనటువంటి విద్య అందుకు ఏర్పరచుకున్నటువంటి లక్ష్యాలు సమగ్రంగా ఉన్నప్పటికీ వాటి అమలులో ఏర్పడినటువంటి అవాంతరాలు అంతరాయం పాలకుల యొక్క నిర్లక్ష్యం కారణంగా విద్య పైన కోట్లాది రూపాయ లు ఖర్చు చేస్తున్నప్పటికీ దారి తెన్ను లేని పద్ధతిలో విద్య కొనసాగుతుండడం వలన ఆశించిన ఫలితాలు చేకూరడం లేదు, నైతిక సమాజం ఆవిర్భవించడం లేదు, ఉత్పత్తి లో ప్రజలందరికీ వాటా లభించడం లేదు,. అంతరాలు అసమానతలు మరింత పెరుగుతూ ఉంటే సమానత్వం మేడిపండు చందముగా మిగిలిపోయింది. ఈ పరిస్థితుల్లో సమర్థవంతమైన పాలకులు,సంపూర్ణ అవగాహన కలిగినటువంటి మేధావులు బుద్ధి జీవులు, ప్రశ్నించే ప్రజలు, పోరాట శక్తి గల ప్రజాస్వామ్యవాదుల సమీష్టి కృషి వల్ల మాత్రమే చదువుకు సార్థకత లభిస్తుంది. వనరుల సద్వినియోగం సాధ్యమై దేశం అభివృద్ధి చెందిన దేశంగా అవతరిస్తుంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

తెలంగాణ సంస్కృతికి సంప్రదాయాలకు నిలువెత్తు రూపం, నిలువెత్తు నిదర్శనం.. తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబిం మన బతుకమ్మ పండుగ వాతావరణం.. బతుకమ్మ కవిత రచనలు..

## పూల తోట బతుకమ్మ!!

మా ఊరు పూల తోట
అయిపోయింది బతుకమ్మ,
తొమ్మిది రోజులు కొలిచేము బతుకమ్మ,
పడుచులందరూ పట్టు చీరలలో
బంగారు చిలకలవుతారు బతుకమ్మ,
కోకిలలై పాడుతారమ్మ బతుకమ్మ,
సత్యమై నిలుచునమ్మా బ్రతుకమ్మ
మా జ్ఞాపకాలలో సజీవమై
నిలుచునమ్మా బతుకమ్మ
పొరలు కమ్మిన మనుషులకు
కనువిప్పు బతుకమ్మ,
ప్రతి ఇంటిలో బంధమైంది బతుకమ్మ,
ఆడపడుచుల బ్రతుకు చిత్రమైంది బతుకమ్మ,
బ్రతుకు బాటలో బంధాలు నిలుపునమ్మా
మా ఇంటి బతుకమ్మ, మా బంగారు బతుకమ్మ..
నిండైన రూపంతో నవనవలాడుతుంది
బతుకమ్మ, స్వాభిమానం అణువణువునా
నిలుపుకుంది బతుకమ్మ,
బతుకులో బతకడం చూపించింది బతుకమ్మ,
త్యాగాల పల్లకి అయ్యింది బతుకమ్మ,
మా గారాల పట్టి అయి నిలిచింది బతుకమ్మ,
అనుబంధమై వచ్చింది బతుకమ్మ,
మా ఇంట నవ్వుల పంటై విరబూసింది బతుకమ్మ,
పసిపాపల కళ్ళల్లో వెలుగైంది బతుకమ్మ,
మురిపాల చుక్క మురిపిస్తుంది బతుకమ్మ,
ప్రతిసారి పసిడి పాపయి వస్తుంది బతుకమ్మ,
పాలపిట్టై పోతుంది బతుకమ్మ
వెళ్లి రావమ్మ చల్లంగా మళ్లీ రావమ్మ
మా ఇంటి దీపంగా మా తల్లి బతుకమ్మ,



రైటర్ రాజు
(యువ కవి - అరుణ రైటింగ్స్)
తెలంగాణ యూనివర్సిటీ,
నిజామాబాద్.

# మట్టి మాఫియాకు అండగా రెవెన్యూ అధికారులు

- అభివృద్ధికి తరలిస్తున్నారు అంటూ హితువు
- మట్టి తమకే అవసరమంటున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంట్రాక్టర్లు

**కొందుర్గు, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** అధికారులు మట్టి అక్రమ రవాణాపై మౌనం వహించడం ఫిర్యాదులు అందలేదని చెప్పి బాధ్యతల నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించడం వంటి ఆరోపణలు కొందుర్గులో ఎక్కువగా ఉన్నాయి. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలు రోడ్డు నిర్మాణం పనుల పేరుతో మట్టి అక్రమ రవాణా జరుగుతున్నా పట్టించుకోని అధికారులు అనుమతులు లేకుండా తవ్వకాలు చేస్తున్నా చోద్యం చూస్తున్నారని రెవెన్యూ,మైనింగ్ శాఖ అధికారులపై విమర్శలు వస్తున్నాయి.ఎన్ని పత్రిక కథనాలు వచ్చిన అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యనికి నిలువెత్తు నిదర్శనం. కొందరు అధికారులు మట్టి అక్రమ రవాణాకు సంబంధించిన మామూళ్లకు లొంగిపోయి, వారు అక్రమ రవాణాను అరికట్టకుండా మౌనం వహిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. మట్టి అక్రమ రవాణా జరుగుతున్నా, అధికారులు తమకు ఫిర్యాదు అందలేదని బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నం



చేస్తున్నారని ఆరోపణలు ఎక్కువగా వస్తున్నాయి. రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్ వంటి సంబంధిత అధికారులు తవ్వకాలను అడ్డుకోకుండా, పట్టించుకోకుండా ఉండటం వల్ల మట్టి మాఫియా యథేచ్ఛగా రెచ్చిపోతోందని పలు వార్తా కథనాలు సూచిస్తున్నప్పటికి అక్రమ రవాణా చేస్తున్న విధానాలు మాత్రం అరికట్టలేక పోతున్నారు. అనుమతుల పేరుతో చెరువుల నుండి మట్టిని తరలించడం, అభివృద్ధి నిర్మాణాల పేరుతో ప్రభుత్వ భూముల్లో నుండి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు.

### అభివృద్ధి పేరిట ప్రభుత్వ ఆదాయానికి గండి

ఏదైనా అభివృద్ధికి శంకుస్థాపన పనులు పూర్తి చేసి అంచనా ప్రకారం నిధుల కేటాయింపు చేస్తారు. కానీ కొంతమంది రోడ్లు విస్తరణ పేరుతో ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో నుండి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి పెడుతూ సొమ్ము చేసుకుంటున్నారు.

### ప్రభుత్వ పథకాలే లక్ష్యంగా..

ఇందిరమ్మ ఇళ్ళు వంటి ప్రభుత్వ పథకాల పేరుతో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని, ఈ పథకాల వెనుక మట్టి మాఫియా యథేచ్ఛగా దండుకుంటోందని ఆరోపణలు ఉన్నాయి. ప్రజల ఆరోపణలు ప్రజలు అధికారులు మట్టి అక్రమ రవాణాను అరికట్టడంలో విఫలమవుతున్నారని ఆరోపిస్తున్నారు. కొందుర్గు వంటి ప్రాంతాల్లో మట్టి మాఫియా అక్రమాలకు పాల్పడుతోందని, స్థానికులు, అధికారులు భయంతో మౌనంగా ఉంటున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ సమస్యలపై అవగాహన కల్పించి, అక్రమ రవాణాను అరికట్టడానికి అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## హిందుత్వాన్ని చాటి చెప్పడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం

- ఆర్ఎస్ఎస్ పాలమూరు విభాగ్ ప్రచారక్ దేవేందర్ రాజు

**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణంలో హిందుత్వాన్ని చాటి చెప్పడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యమని ఆర్ఎస్ఎస్ పాలమూరు విభాగ్ ప్రచారక్ దేవేందర్ రాజు పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ వందేళ్ల స్థాపన ఉత్సవాలలో భాగంగా ఆర్ ఎస్ ఎస్. సాయి నగర్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక యాదవ సంఘం భవనంలో విజయదశమి ఉత్సవం జరిగింది. కార్యక్రమంలో ప్రధాన వక్తగా



దేవేందర్ రాజు పాల్గొని ప్రసంగించారు. 1925లో ప్రారంభమై నేడు దేశవ్యాప్తంగా విస్తృత శాఖలతో, విభిన్న రంగాలలో దేశభక్తి పూరిత, హిందుత్వ ఆధార సంస్థలతో ప్రపంచంలోని అనేక దేశాలలో పనిచేస్తుందని చెప్పారు, హిందువులలో ఐక్యతను శాఖ ఆధారంగా సంఘము పెంపొందిస్తుందని తెలిపారు.హిందుత్వం జీవన విధానం.విశ్వశాంతికి ఆధారం, ప్రపంచంలోని వివిధ మతాలను సమన్వయపరిచే సనాతన జీవన విలువలు హిందుత్వంలో ఉన్నాయని వివరించారు. దేశ అభివృద్ధి కొరకు హిందువులు పంచ పరివర్తన కోసం పాటుపడాలని సూచించారు. సామాజిక సమరసత,కుటుంబ జీవన విలువలు, స్వ ఆధారిత జీవనం మరియు పర్యావరణ పరిరక్షణ,పౌర విధులు ప్రతి ఒక్కరి కుటుంబంలో పాటించబడాలని అన్నారు. ఆర్ఎస్ఎస్ జన్మ శతాబ్దిలో భాగంగా రాబోయే రోజులలో ఇంటింటి జనజాగరణ చేపట్టబోతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంఈఓ మద్దిలేటి, స్వయం సేవకులు, కాలనీవాసులు,తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణలో రిట ర్నింగ్ అధికారుల పాత్ర కీలకం

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. రానున్న స్థానిక సంస్థల (గ్రామపంచాయతీ) 2025, రెండవ సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఆర్వోలు, ఏఆర్ఓలకు స్టేజ్ 1, స్టేజ్ 2 ఎన్నికల నిర్వహణపై,శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎర్రగుట్ట వద్ద గల బాలికల గురుకుల, కస్తూర్బా పాఠశాలల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటుగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గాంగ్వర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని, కావున ఆర్వోలు అత్యంత జాగ్రత్తగా తమ ఎన్నికల విధులను నిర్వహించవలసి ఉంటుందని తెలిపారు.ఎన్నికల నిర్వహణకు సంబంధించిన కరదీపికలో ప్రతి ఒక్క పేజీని తప్పకుండా చదివి, అర్థం చేసుకోవాలని సూచించారు. ఏమైనా అనుమానాలు ఉంటే శిక్షణలోనే నివృత్తి చేసుకోవాలని చెప్పారు. పంచాయతీ రాజ్ చట్టం - 2018, అలాగే ఎన్నికల సంఘం హ్యాండ్ బుక్ లో నిర్దేశించిన సూచనల మేరకు విధులను జాగ్రత్తగా నిర్వహించాలని తెలిపారు.ఎన్నికల ప్రక్రియలో నామినేషన్లు, నామినేషన్లను అనుమతించడం, తిరస్కరించడం, నామినేషన్ల పరిశీలన( స్క్రూటినీ )ప్రక్రియలు చాలా ముఖ్యమైనవని,ఆయా ప్రక్రియల నిర్వహణలో ఆర్వోలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.ఆర్వోలు ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో ఎలాంటి తారతమ్యాలు లేకుండా, పూర్తి పారదర్శకత పాటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రెడ్డి, డీ ఈ ఓ గోవింద రాజులు, ఆర్వోలు, ఏఆర్ వోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# దసరా పండుగలోపు కార్మికులకు వేతనాలు చెల్లించండి

- మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షురాలు ఇందిరమ్మ

**జడ్చర్ల, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** వచ్చేనెల 2వ తేదీన దసరా పండుగ ఉన్నందున మున్సిపల్ కార్మికులకు పండుగ కంటే ముందుగా వేతనాలను చెల్లించాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జడ్చర్ల పట్టణ అధ్యక్షురాలు ఇందిరమ్మ, ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకటేష్ డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, చైర్ పర్సన్ కోనేటి పుష్పలతకు వినతి పత్రం అందజేసి వారు మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన సర్కులర్ ప్రకారం పండుగ సెలవులు, వారంత సెలవులు ఇవ్వాలని, మహిళలకు రోడ్లు ఊడ్చుటకు చీపుర్లు, పనిముట్లు, మహిళలకు చీరలు, పురుషులకు డ్రెస్సులు మూడు జతలు ఇవ్వాలని,



జనవరిలో ఇచ్చిన చీరలు, డ్రెస్సులకు కుట్టుకూలీ ఇంతవరకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 15 నెలల నుంచి కార్మికులకు సబ్బులు, నూనెలు, ఇవ్వడం లేదని, గ్లౌజులు మాస్కులు సర్కులర్ ప్రకారం అందించాలన్నారు. 2012 నుండి 14 వరకు కార్మికుల వేతనాల్లో కట్ చేసిన 16 లక్షల ఈపీఎఫ్ నిధులు మున్సిపాలిటీ షేర్ 16 లక్షల రూపాయలు కలిపి 32 లక్షల రూపాయలకు గాను 2 సంవత్సరాల క్రితమే 40 లక్షలు కేటాయించిన నేటి వరకు ఈపీఎఫ్ నిధులు కార్మికుల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయలేదని, చనిపోయిన కార్మికులు 46 కుటుంబాలకు ఈపీఎఫ్ నుండి రావాల్సిన ఎటువంటి బెనిఫిట్ రాలేదని వారికి తక్షణమే న్యాయం చేయాలని అన్నారు. గతంలో పనిచేసిన అధికారుల తప్పిదం వల్ల హైదరాబాద్ ఈపీఎఫ్ కార్యాలయానికి పెనాల్టీ రూపంలో 99 లక్షల చెల్లించారని, ఇట్టి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇట్టి విషయాలపై కమిషనర్, చైర్ పర్సన్ స్పందిస్తూ కార్మికులకు, కార్మిక నాయకులకు త్వరలో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ మహేష్, విద్యాసాగర్, ఉపాధ్యక్షులు అంజమ్మ, స్వరూప, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ పండుగ ఏర్పాట్లలో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం




**నంగునూర్, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** బతుకమ్మ పండుగ నిర్వాహణ ఏర్పాట్లలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఉల్లి మల్లయ్య ప్రధాన కార్యదర్శి దేవులపల్లి కనుకయ్య అన్నారు. అన్నారు శుక్రవారం రోజు నంగునూరు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ నంగునూరు గ్రామంలో బతుకమ్మ దసరా పండుగ సందర్భంగా ఇప్పుడున్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వము ఎలాంటి పారిశుద్ధ్యంగాని వీధిలైట్లు గాని పట్టించుకోవడం లేదు, ఆడబిడ్డలు బతుకమ్మ ఆడుకునే ప్లేస్ బురదమయంగా చిత్తడిగా గుంతలు మాయంగా ఏర్పడి బతుకమ్మ ఆడుకో రాకుండా ఉండడంతో ఎంతో బాధపడుతా ఉన్నారు, కాంగ్రెస్ సర్కార్ బతుకమ్మ చీరలు గత పది రోజుల నుండి ఇస్తామని ఉవ్విల్లు ఊరిస్తూ ఇప్పటివరకు ఇవ్వలేదు, మరి ఇంకా ఎప్పుడు ఇస్తారు అని ఆడబిడ్డలు ఎదురు చూస్తా ఉన్నారు, ఎక్కడ చూసినా ఏ మూల చూసిన మురుగునీరు ప్రవహిస్తూ ఉన్నది గ్రామంలో సర్పంచు, ఎంపీటీసీ వార్డ్ మెంబర్లు ప్రజా ప్రతినిధులు లేక ఊర్లో ఉన్న సమస్యలు సమస్యలుగానే మిగిలిపోయినాయి. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు, ఉల్లి చిన్న మల్లయ్య, ప్రధాన కార్యదర్శి దేవులపల్లి కనకయ్య, పిఎసిఎస్ డైరెక్టర్ దేవులపల్లి బాలరాజు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు దేవులపల్లి రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో నిర్వాహకులు డా.వై.రవీందర్ గౌడ్ ఏర్పాటు చేసిన ఎస్ఎం ఫిజియోథెరపీ అండ్ రీహాబిలిటేషన్ సెంటర్ ను స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో అత్యాధునిక టెక్నాలజీతో ఫిజియోథెరపీ, రీహాబిలిటేషన్ ప్రారంభంభించడం అభినందనీయమని, పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఫిజియోథెరపీ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం నిర్వాహకులు డాక్టర్ వై. రవీందర్ గౌడ్ మాట్లాడుతూ...పక్షపాతం వల్ల మంచానికే పరిమితమైన వారికి ఫిజియోథెరపీ, రీహాబిలిటేషన్ సేవలు అందిస్తామని, చిన్న పిల్లలను ఎలా చూసుకుంటారో అలాగే తమ సెంటర్ కు రోగులను చూసుకుంటామన్నారు. ఫిజియోథెరఫీ వల్ల వెన్నునొప్పి, మెడనొప్పి, మోకాలి నొప్పి, ఆర్థ్రైటిస్ వల్ల వచ్చే నొప్పి తగ్గుతుందన్నారు. ఎముకల శస్త్రచికిత్స తర్వాత కదలికలు రావడానికి ఫిజియాథెరపీ ఉపయోగపడుతుందన్నారు. అనంతరం సెంటర్ లోని ఏర్పాటు చేసిన పరికరాలు(మిషన్స్) ఏ విధంగా ఉపయోగపడుతాయో నిర్వాహకులు డాక్టర్ వై రవీందర్ గౌడ్ ఎమ్మెల్యే యాదయ్యకు వివరించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల సహకార సంఘం చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యులు మర్పల్లి మాలతికృష్ణారెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు బండారి ఆగిరెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారి శైలజాఆగి రెడ్డి, మహిళా అధ్యక్షురాలు దేవర సమతావెంకట్ రెడ్డి, మాజీ సర్పంచులు రెడ్డిశెట్టి మధుసూదన్ గుప్త, తిప్పని రాంరెడ్డి, పడాల ప్రభాకర్, ఎన్ను జంగారెడ్డి, లక్ష్మణ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జుకన్నగారి శ్రీకాంత్ రెడ్డి, చేవెళ్ల సొసైటీ డైరెక్టర్ ఫైండ్ల మధుసుధన్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు రవీందర్ గౌడ్, నాయకులు విగ్నేష్ గౌడ్, సాయి కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు నూతన ఆవిష్కరణ నేర్చుకోవాలి



**మొయినాబాద్, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** సామాజిక శ్రేయస్సు కోసం విద్యార్థులు వినూత్న ఆవిష్కరణలకు ఎంచుకొని ప్రతి కనబరచాలని కేఎల్ హెచ్ యూనివర్సిటీ ప్రిన్సిపల్ డాక్టర్ రామకృష్ణ అన్నారు. మున్సిపల్ పరిధిలోని అజీత్ నగర్ సమీపంలో గల కె ఎల్ హెచ్ క్యాంపస్ లో భారత ప్రభుత్వం స్మార్ట్ ఇండియా హ్యాకాథన్ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో భాగంగా ఇంటర్నల్ హ్యాకాథన్ ఒక్కరోజు నిర్వహించారు ఈ సందర్భంగా వివిధ కళాశాలల నుంచి 116 జట్లు పాల్గొనగా అందులో 696 మంది విద్యార్థులు సిఎస్సి ఏఐ అండ్ డిఎస్ విభాగాల నుండి విద్యార్థులు పాల్గొని వివిధ రంగాల్లో తమ వినూత్న నైపుణ్యం గల ప్రాజెక్టులను ప్రదర్శించారు ఆరోగ్య రంగంలో స్మార్ట్ హెల్త్ మానిటరింగ్ సిస్టమ్స్ ఏఐ ఆధారిత వ్యాధి అవగాహన చార్ట్ బాట్లు వ్యవసాయంలో పంటల సిఫార్సు మోడల్ ఉల్లిపాయ నిలువకు మెరుగైన ఆవిష్కరణలు స్మార్ట్ సిటీస్ పాలనలో వ్యర్థాల వర్గీకరణ గ్రామీణ పాఠశాలల ఆటోమేటిక్ హాజరు విధానం రవాణా పర్యాటక ట్రాఫిక్ కంట్రోలర్ స్మార్ట్ టూరిస్ట్ సేఫ్టీ మానిటరింగ్ వంటి పరిష్కారాలు విద్యార్థులు లు ప్రతిపాదించారు 24 గంటల పాటు జరిగిన అధ్యాపకులు విద్యార్థులను మార్గనిర్దేశం చేసి నిపుణుల బృందాల ముందుకు ఆలోచనలు మెరుగుపరిచి సమర్పించడానికి కృషి చేశారు ఎంపికైన జట్లు ఇప్పుడు జాతీయస్థాయి ఎస్ ఐ హెచ్ 2025లో కే ఎల్ హెచ్ తరపున ప్రాతినిధ్యం వాయిస్తుందన్న ఇది భారత ప్రభుత్వ ఇన్నోవేషన్ ఆధారిత దేశ నిర్మాణ దృష్టి సాధనలో మరో ముందడుగు అని ప్రిన్సిపల్ రామకృష్ణ సూచించారు. హ్యాకాథన్లు డిజిటల్ ఇండియా మేడ్ ఇన్ ఇండియా ఆత్మ నిర్భర్ భారత్ లక్ష్యాల సాధనకు విద్యార్థులు చురుకుగా తోడ్పడే వేదిక అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వాగులు దాటే సాహసం చేయెుద్దు..

- వరద ప్రమాదం జరిగే 25 చోట్ల గుర్తింపు
- మరో రెండు రోజులు అతి భారీ వర్షాలు
- మత్స్యకారులు చేపల కోసం ప్రాజెక్టుల్లోకి వెళ్లొద్దు
- అనంతగిరిలో ట్రాకింగ్ నిలిపివేత
- వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

**వికారాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా రాగల రెండు రోజుల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు ఎవ్వరు సాహసం చేసి వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి కోరారు. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ ఎస్పీ నారాయణరెడ్డి ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో రెండు రోజులపాటు వికారాబాద్ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో విద్యార్థులు రైతులు ప్రజలు ఎవ్వరు వాగులు



దాటే సాహసం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయని అలాగే ప్రాజెక్టుల దిగువ భాగమున అలుగును పారి వాగుల్లో వరద ఉధృతంగా ఉందని ప్రజలు ఎవరు ఆ ప్రాంతాలకు వెళ్ళవద్దని కోరారు. జిల్లా వ్యాప్తంగా 25 చోట్ల వరద ప్రమాదం ఉన్నట్లు గుర్తించామని ఆ ప్రాంతంలో రాకపోకలను పూర్తిగా నిలిపివేసి జిల్లా అధికార యంత్రాంగం పహారా కాస్తుందని తెలియజేశారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలియజేశారు. వర్షాలు కురుస్తున్నాయని పంట పొలాలను చూడడానికి రైతులు వెళుతుంటారని వారు వాగులు దాటోదని కోరారు. అలాగే పురాతనమైన భవనాల్లో ఇండ్లలో నివసించవద్దని సురక్షిత ప్రాంతంలో నాలుగు రోజులపాటు తలదాచుకోవాలని అందుకు అవసరమైన ఏర్పాట్లను అధికార యంతరంగం చేస్తుందని తెలియజేశారు. వచ్చే శని, ఆదివారాల్లో వికారాబాద్ అనంతగిరి కొండల్లో పర్యాటకుల ప్రతి అధికంగా ఉంటుందని వర్షాలు కురుస్తున్న కారణంగా అనంతగిరికి వచ్చే పర్యాటకులను అనుమతించడం లేదని తెలియజేశారు. పర్యాటకులు ఎవరు అనంతగిరి కొండల్లో పర్యటనకు రావద్దని ఎస్పీ నారాయణరెడ్డి కోరారు. కోట్‌పల్లి ప్రాజెక్టులో బోట్ల నిలిపివేతతో పాటు అనంతగిరి కొండల్లో ట్రాకింగ్ పూర్తిగా నిషేధించినట్లు తెలియజేశారు. లక్నాపూర్, సర్పన్‌పల్లి, కోట్‌పల్లి ప్రాజెక్టుల దిగువన వరద ఉధృతంగా ఉన్న కారణంగా ఆ ప్రాంతానికి పర్యాటకులు ఎవరు వెళ్లవద్దని సూచించారు.

## సీజనల్ వ్యాధులపై ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి

**మొయినాబాద్, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** గ్రామాలలో ప్రజలు కురుస్తున్న వర్షాలకు ఆరోగ్యం పట్ల పలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉస్మానియా జనరల్ ఆసుపత్రి డాక్టర్ ప్రత్యూష, ఈఎన్ని కోటి ఆసుపత్రి డాక్టర్ రమేష్ లు పేర్కొన్నారు. శుక్రవారం మొయినాబాద్ మండల వైద్య ఆరోగ్య కేంద్రంలో సీజనల్ వ్యాధులపై క్యాంప్ నిర్వహించారు. ప్రభుత్వం ఈ నెల 17వ



తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ఆరోగ్య వైద్య కేంద్రంలో స్వస్తి నారీ స్వశక్తి పరివార్ అభియాన్ క్యాంప్ ఏర్పాటులో భాగంగా స్పెషల్ క్యాంప్ ను మండల వైద్యాధికారి అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ క్యాంపులో వివిధ గ్రామాల నుంచి దాదాపు వంద మందికి పైగా పాల్గొని పరీక్షలు నిర్వహించుకున్నారు. ఏర్పాటు చేసిన క్యాంపులో డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ రమేష్ లు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్యం మహిళా శక్తివంతమైన కుటుంబం కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. మహిళ ఆరోగ్యమే ఆ కుటుంబం బలం అని అన్నారు. ప్రస్తుత కాలంలో సీజనల్ వ్యాధులు అధికం అయ్యాయని సూచించారు. కురుస్తున్న వర్షాలతో వివిధ రకాల జబ్బులు దరి చేరుతున్నాయని తెలిపారు. ఇందుకు ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు పరిసరాల పరిశుభ్రత, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. శుద్ధి చేసిన తాగునీరు తాగాలన్నారు. శుభ్రతను పాటిస్తు ఆరోగ్యంగా ఉండేందుకు కృషి చేసుకోవాలని పేర్కొన్నారు. విచ్చేసిన రోగులందరికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి అన్నపూర్ణ, డాక్టర్ క్రాంతి, ఆరోగ్య కేంద్రం సీహెచ్ డాక్టర్ వెంకట్ రెడ్డి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

- జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు




**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** శుక్రవారం నుండి మూడు రోజులు ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలనీ జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు.కరెంట్ విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలనీ,24 గంటలు పోలీస్ అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉంన్నారనీ,అత్యవసరమైతే తప్ప ప్రజలు ప్రయాణాలు కూడా వాయిదా వేసుకోవాలనీ,వర్షాల వల్ల జిల్లాలో వాగులు ఉధృతంగా ప్రవహిస్తునందున ఏ ఆపద వచ్చిన లోకల్ పోలీస్ అధికారులకు లేదా డయల్-100 లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ 87126 70306 కు సమాచారం అందించగలరనీ జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు తెలిపారు.వర్షాల వల్ల ప్రజలకు రహదారులపై గాని ,ఇతర ప్రదేశాలలో ఏ సమస్యా తలెత్తిన వెంటనే స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ, విద్యుత్, ఆర్ అండ్ బీ, వైద్య శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ వర్షాల వల్ల కలిగే ప్రమాదాలపై స్పందించే విధంగా పోలీస్ అధికారులను సిద్ధం చెయ్యడం జరిగిందని అన్నారు. అలాగే గొర్రెల, పశువుల కాపరులు వాగులు వంకల వైపు వెళ్ళవద్దని, గ్రామాల్లో కూడా ఎప్పటికప్పుడు పరిస్థితులను తెలుసుకునేందుకు గస్తీ పోలీసులను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు.వర్షాలలో విద్యుత్ స్థంబాలకు ఎర్థింగ్ ద్వారా విధ్యుత్ సరఫరా అయ్యి, కరెంట్ షాక్ తగిలే అవకాశం ఉందని జిల్లా ప్రజలు పిల్లలు ఎవరు కూడా విద్యుత్ స్థంబాలను కానీ విద్యుత్ పరికరాలను ముట్టుకోకుండా వారిని జాగృతం చేయాలని, అలాగే విధ్యుత్ సరఫరాలో ఏదైనా లోపం ఉంటే, వెంటనే సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. నిరంతరాయంగా కురిసే వర్షాల వల్ల, ఏదైనా విపత్కర సమస్య వస్తే లోకల్ పోలీస్ అధికారులకు సమాచారం అందించినచో తక్షణ సహాయక రక్షణ చర్యలు పోలీస్ అధికారులు చేపడతారని జిల్లా ఎస్పీ తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికలను పగడ్బందీగా నిర్వహించాలి

- ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల నిబంధనలకు లోబడి పని చేయాలి
- ఎంపీడీవో వేణుగోపాల్



**నంగునూర్, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో నంగునూరు లోని రైతు వేదికలో శుక్రవారం రోజు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్ ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్ ఎంఈవో దేశి రెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎన్నికలను పొగడ్బందీగాస్థానిక ఎన్నికలను పగడ్బందీగా నిర్వహించాలని, ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల నియామవళి ని లోబడి పని చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల ప్రతి ఒక్క ఓటు కీలకంగా మారుతుందని కావునా అధికారులు జాగ్రత్త నిర్వహణ చర్యలు చేపట్టాలని, ఉప సర్పంచ్ ఎన్నిక విషయంలో చాకచక్యంగా వ్యవహరించాలని, వార్డు సభ్యుల ఎన్నిక కోసం తెలుపు రంగు బ్యాలెట్, సర్పంచ్ ఎన్నికకు గులాబీ రంగు బ్యాలెట్ పేపర్ , ఎంపిటిసి ఎన్నికకు గులాబీ రంగు, జెడ్పిటిసి ఎన్నికకు తెలుపు రంగు బ్యాలెట్ పేపర్ ఉంటుందని ఛాలెంజ్ ఓట్లు టెండర్ ఓట్ల గురించి వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సూపరిండెంట్ ప్రభాకర్ రావు, మాస్టర్ ట్రైనర్స్ రాంగోపాల్ రెడ్డి, హరి గోపాల్ ప్రిసైడింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

- టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి




**సదాశివపేట, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ సంబరాలు అని తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల మౌలికల సదుపాయాల సంస్థ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని భవిత జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాలరాజు అధ్యక్షతన బతుకమ్మ సంబరాలు నిర్వహించగా ముఖ్యఅతిథిగా టిజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ పేరు చెప్పగానే బతుకమ్మ పండుగ గుర్తుకు వస్తుందన్నారు. బతుకమ్మ దేశంలోనే అరుదైన పూల పండుగ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహిస్తుందని అన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చి ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు జయ రెడ్డి, సిడిసి చైర్మన్ గడీల రామ్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ వై. ప్రభు గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిరు, కళాశాల డైరెక్టర్లు మధుకర్ రెడ్డి, రాజు, అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలలో సగరుల సత్తా చాటాలి

- సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర పిలుపు



**మక్తల్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో సగరుల సత్తా చాటాలని తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర పిలుపునిచ్చారు. నారాయణపేట జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఆంజనేయులు అధ్యక్షతన సగర సంఘం ముఖ్యుల సమావేశం శుక్రవారం మక్తల్ లో నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర హాజరై మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో సగరులు నివాసమున్న ప్రతి గ్రామంలో సర్పంచ్‌గా, ఎంపీటీసీగా పోటీ చేయాలని పోటీ చేసే అభ్యర్థులకు రాష్ట్ర సంఘం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. బిసి కులసంఘాల నాయకులతో మాట్లాడి పరస్పర సహకారంతో ముందుకు సాగాలని సూచించారు. నారాయణపేట జిల్లా సగర సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటుకు అక్టోబర్ 12 వ తేదీన సర్వసభ్య సమావేశం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సంఘం గౌరవాధ్యక్షులు ముత్యాల హరికిషన్ సగర, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య సగర, రామాపురం హనుమంత్ సగర, ఆంజనేయులు సగర, అనంత ప్రసాద్ శేఖర్ సగర, వెంకటేష్ సగర, రామకృష్ణ సగర, శంకర్ సగర, మహేష్ సగర తదితరులు పాల్గొన్నారు.

## హమాలీలకు ప్రభుత్వం అండ

- అదనపు కలెక్టర్ శ్రీను



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** పౌరసరఫరా లో పనిచేసే హమాలీలకు ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా అదనపు రెవిన్యూ కలెక్టర్ ఎస్ శ్రీను తెలిపారు.దసరా పండుగ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎస్ శ్రీను నారాయణపేట జిల్లా పౌర సరఫరాల సంస్థ లోని ఎం ఎల్ ఎస్ పాయింట్ లో పనిచేస్తున్న 36 హమాలీలకు దసరా పండుగ శుభాకంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా హమాలిలు ఒక్కొక్కరికి రూ.7,500 హమాలీ బోనస్, హమాలీ యూనిఫామ్, ఒక్కొక్కరికి 6 మీటర్ల వస్త్రం, ఒక్కొక్కరికి రూ.900 స్వీట్ అలవెన్స్ పంపిణీ చేశారు.

## హెూంగార్డ్స్ సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

- అదనపు ఎస్పీ రియాజ్



**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** జిల్లాలో పని చేస్తున్న హెూం గార్డుల సంక్షే మాన్ని దృష్టిలో పెట్టుకొని డిజిపి కార్యాలయం నుండి వచ్చిన రెయిన్ కోట్స్, స్వెటర్స్ నీ జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో హెూంగార్డ్ ఆఫీసర్స్‌కి అదనపు ఎస్పీ రియాజ్ ఉల్ హక్ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హెూమ్ గార్డ్స్ పోలీసు శాఖలో అంత ర్గత భాగమని, పోలీసులతో పాటే నిరంతరం తమ సేవల ను అందిస్తున్నారని అన్నా రు.ప్రతి పోలీస్ స్టేషన్లో పోలీసు సిబ్బందితో బాటు విధులు నిర్వహిస్తున్నారని, క్లిష్ట పరిస్థితులలో కూడా వివిధ బందోబస్తు విధుల్లో చాలా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నా రన్నా రు. హెూమ్ గార్డ్స్ అధికా రులు, సిబ్బంది ఎవరి కైన సమస్యలు ఉంటే నేరుగా తనని సంప్రదించవచ్చని ఎస్పీ దృష్టిలో ఉంచి పరిష్కరించడం జరుగు తుందని తెలిపారు.రాష్ట్ర పోలీస్ శాఖ సిబ్బంది కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. నిరంతరం రాత్రింబవళ్ళు కష్టపడి పని చేసే సిబ్బందికి వర్షాకాలంలో అత్యవసర సమయాలలో రెయిన్ కోట్స్, స్వెటర్స్ ఎంతగానో ఉపయో గపడతాయన్నారు.విధి నిర్వహణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని,క్రమశిక్షణ కలిగిన పోలీస్ శాఖలో పనిచేస్తూ నిబంధ నలు ఉల్లగింస్తే భవిష్యత్తులో శాఖ పరమైన ఇబ్బందులు ఎదురవుతాయని వివరిం చారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ నరసింహ, హెూమ్ హార్డ్స్ ఇంచార్జి ఆర్ ఎస్ ఐ మద్దయ్య, ఆర్ఎస్ఐ లు శిరీష, కృష్ణ చైతన్య సిబ్బంది పాల్గొన్నారు.

# అంతర్ రాష్ట్ర బైక్ దొంగల ముఠా అరెస్ట్




**మక్తల్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** అంతర్ రాష్ట్ర బైక్ దొంగల ముఠా అరెస్ట్ రిమాండ్ కి తరలించినట్లు డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు. మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెహమానియ కాలనీలో ఇంటి ముందు పార్కు చేసిన బైక్ ను దొంగతనానికి గురైందని బిలాల్ ఉర్ రెహమాన్ ఇటీవల ఫిర్యాదు చేయగా జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు, డీఎస్పీ ఎన్ లింగయ్య పర్యవేక్షణలో మక్తల్ సీఐ రామ్ లాల్, ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి లు దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం మక్తల్ శివారులో వాహనాల తనిఖీలలో ఇద్దరు వ్యక్తులు రెండు షైన్ బైక్లను తీసుకొని పోతుంటే అనుమానాస్పదంగా కనిపిస్తే పట్టుకుని పోలీస్ స్టేషన్ కు తరలించి విచారించగా కర్ణాటక కు చెందిన కుంచీ కోరం ఎల్లప్ప, సన్న దుర్గప్ప ముఠాగా ఏర్పాడి రాత్రి వేళలో ఇంటిముందలో ఉన్న బైకులను తాళాలు విరగొట్టి ఈజీగా బైకులను దొంగతనం చేసి శంషుద్దీన్ ద్వారా బైకులను అమ్మి డబ్బు సంపాదించేవారు. వీరు బ్లాక్ కలర్ షైన్ బండ్లను ఎక్కువగా దొంగతనలు చేశారు అని, వీరు మక్తల్, మరికల్, కృష్ణా, ఐజ, సైఫాబాద్, హైదరాబాదు లో పలు బైకులు దొంగతనం చేసి ఒప్పుకొన్నట్లు డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు. వారి వద్ద నుండి 05 షైన్ బైక్లను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు 04 లక్షలు ఉంటుందని అట్టి బైక్లను స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను రిమాండ్ కు తరలించడం జరిగిందని డిఎస్పి తెలిపారు. అలాగే ప్రజలు రాత్రి వేళ్లలో తమ వాహనాలను సురక్షిత ప్రదేశాలలో పార్కు చేయడంతో పాటు డబల్ లాక్స్ సిస్టం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కేసులో బాగా పనిచేసిన పోలీస్ అధికారులను అభినందించి త్వరలో రివార్డు ఇవ్వడం జరుగుతుందని డిఎస్పి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ రామ్ లాల్, ఎస్ఐ వై.భాగ్యలక్ష్మి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ

- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** తెలంగాణ వీరవనిత, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో చాకలి ఐలమ్మ 130 వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ పరితోష్ పంకజ్ పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఐలమ్మ చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం, ఎస్పీ మాట్లాడుతూ... తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు, ప్రజాస్వామిక పోరాటాలకు స్పూర్తిగా నిలిచాయని, భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన తెగువ, పౌరుషం తెలంగాణ ఆస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని చాటి చెప్పాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డియస్పి నరేందర్, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ రమేష్, ఆర్ఐ. లు రామారావ్, రాజశేఖర్ రెడ్డి, ఇన్స్పెక్టర్స్ నాగేశ్వర్ రావ్, డీపీఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి ఉత్తమ సీఆర్పీగా దత్తు




**సంగారెడ్డి టౌన్, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సీఆర్పీగా పనిచేస్తున్న మరెల్లి దత్తు శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమంలో జాతీయ స్థాయి ఉత్తమ సీఆర్పీగా ఎమ్మెల్సీ కొమురయ్య, సినీ ప్రముఖుల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా దత్తు మాట్లాడుతూ విద్యా రంగంలో చేస్తున్న సేవలను గుర్తించి జాతీయ స్థాయిలో ఉత్తమ సీఆర్పీగా ఎంపిక చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, బందు మిత్రులు అభినందనలు తెలిపారు.

## బీటీ రోడ్డు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలి



**చారకొండ, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** మండల కేంద్రం నుండి ,రామాపురం చంద్రాయన్ పల్లి రోడ్డు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని బిజెపి నాయకులు మొగిళ్ళ కన్నా డిమాండ్ చేశారు ఇటీవల కురిసిన వర్షాలకి రోడ్డులో ఉన్న గుంతలలో నీరు నిలిచి రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు మొలిచి రోడ్డు కనిపియ్యకుండా ప్రమాదాలకు గురవుతున్నారు. చారకొండ నుండి రామాపురం చంద్రాయన్ పల్లి రహదారికి నిధులు మంజూరై స్థానిక ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ భూమి పూజ నిర్వహించిన ఇప్పటికీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని రోడ్డు నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని లేనిపక్షంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## దొరల పాలనకు చరమగీతం పాడిన వీరవనిత చాకలి ఐలమ్మ

- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమకారిణి వీరవనితా, తొలి భూ పోరాటానికి నాంది పలికినా ధైర్యశాలి చాకలి ఐలమ్మ అని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె వీరత్వాన్ని ఆయన మననం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వనపర్తి పట్టణం బస్టాండ్ వద్ద గల ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అగ్రకులాల స్త్రీలు, దొరసానులు తమను కూడా 'దొరా' అని పిలుపించుకొనే సంస్కృతికి చరమగీతం పాడినవారిలో ఐలమ్మ ప్రథమరాలు అనీ ఆయన అన్నారు. ప్రజా పోరాటాలకు స్పూర్తిగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, జి జె శ్రీనివాస్, లక్కాకుల సతీష్, మాజీ కౌన్సిలర్లు, వెంకటేష్, చీర్ల సత్యం, బ్రహ్మంచారి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కృష్ణ,శ్రీహరి రాజు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఇల్లు కూలి భార్య మృతి

- భర్తకు తీవ్ర గాయాలు

**మహదేవపూర్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీవర్షాలు కురియడంతో ఇల్లుకూలి మహిళా మృతి భర్తకుతీవ్ర గాయాల య్యాయి. మహదేవపూర్ మండలం బెగులూర్ గ్రామానికి చెందిన మంద లక్ష్మి (42) భర్త దుర్గయ్య తన ఇంటిలో నిద్రపోతున్న అర్ధరాత్రి సమయంలో ఇంటిగోడలుకూలి దుర్గయ్య భార్య మందలక్ష్మీపై పడడంతో ప్రమాదవశాత్తు అక్కడికక్కడే మృతి చెందిందని భర్త దుర్గయ్యకు బలమైన గాయాల య్యాయని, గ్రామానికి చెందిన స్థానికులతోపాటు భర్త దుర్గయ్య తెలిపిన వివరాల మేరకు తాసిల్దార్ రామారావుకు డిప్యూటీ తాసిల్దార్ కృష్ణకు సమాచారం అందించగా రెవెన్యూ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికివెళ్లి పంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహదేవపూర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతురాలి కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కట్కం అశోక్, మాజీ సర్పంచ్ ఆకుల రాజయ్య, బుర్రి శివరాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించారు.





# నేడు, రేపు భారీ వర్ష సూచన నేపథ్యంలో
# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- గోదావరి మొదటి ప్రమాద హెచ్చరికలో ఉన్నది
- ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్ కు సమాచారం ఇవ్వండి
- క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- అధికారులు, సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలి
- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** నేడు, రేపు రెండు రోజులు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ చేసిన హెచ్చరికల నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. భారీ వర్ష సూచనల నేపథ్యంలో ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా, సమర్థవంతంగా ఎదుర్కొనేలా అన్ని విధాలుగా సన్నద్ధం అయి ఉండాలని సూచించారు. ఎక్కడ కూడా ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, మూగ జీవాలు ప్రాణాలు కోల్పోకుండా ముందస్తుగానే జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అధికారులు, సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో విధుల్లో ఉంటూ, అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ యంత్రాంగం యావత్తు అండగా ఉందనే భరోసాను ప్రజలకు కల్పించాలని హితవు పలికారు. ముఖ్యంగా రెవెన్యూ, పోలీస్, వైద్యారోగ్య, ఇరిగేషన్, విద్యుత్, పంచాయతీ రాజ్, రోడ్లు-భవనాల శాఖలు, విపత్తు నిర్వహణ సంస్థలు రాబోయే రెండు రోజుల పాటు అప్రమత్తంగా ఉంటూ, క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే సమాచారం అందించాలన్నారు. ప్రజలు అత్యవసర పరిస్థితులు ఏర్పడితే కలెక్టరేట్ లోని కంట్రోల్ రూమ్ కు సమాచారం అందించవచ్చని కలెక్టర్ సూచించారు. ప్రజలు కూడా ఎవరికి వారు అప్రమత్తంగా ఉంటూ, తగు జాగ్రత్తలు పాటించాలని హితవు పలికారు. లోతట్టు ప్రాంతాలు, నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. ఆయా శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేస్తూ, జిల్లాలో ఎక్కడ కూడా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తతతో వ్యవహరించాలని అన్నారు. విధుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. లో లెవెల్ వంతెనలు, కాజ్ వేల మీదుగా వరద ప్రవాహం ఉన్న సమయాలలో రాకపోకలను నిషేధించాలని, చెరువులు, కాలువలు, నదులలో చేపల వేట, ఈత కోసం ఎవరూ వెళ్ళకుండా కట్టడి చేయాలన్నారు. భారీ వర్షాల వల్ల చెరువులు, కాలువ కట్టలు తెగి పోకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని హితవు పలికారు. భారీ వర్షాలు, ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు, వైర్లు తెగిపోవడం, ట్రాన్స్ఫార్మర్లు కూలిపోవడం వంటివి చోటుచేసుకున్న సందర్భాలలో యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ట్రాన్స్కో అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా రోడ్లు తెగిపోవడం వంటివి జరిగితే, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ట్రాఫిక్ మళ్లింపు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించాలని, జనజీవనం స్తంభించిపోకుండా, ప్రజలకు అసౌకర్యం కలుగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, దారిమళ్ళింపు చర్యలలో పోలీసు అధికారులు, సిబ్బంది క్రియాశీలంగా పాల్గొనాలని సూచించారు. పురాతన, శిథిలావస్థకు చేరిన భవనాలలో ఉంటున్న వారిని వెంటనే ఖాళీ చేయించాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలన్నారు. పునరావాస కేంద్రాలను ముందుగానే గుర్తిస్తూ, అవసరమైన సమయంలో వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను అక్కడికి తరలించి ఆహారం, ఇతర సదుపాయాలు సమకూర్చేలా ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. భారీ వర్షాలతో వరద జలాలు ఏర్పడి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అన్ని పీ హెచ్ సీ లు, ఆసుపత్రులలో సరిపడా మందుల స్టాక్ ను అందుబాటులో పెట్టుకుని, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి ఆదేశించారు.

# రేషన్ డీలర్లు అందరూ ఐక్యంగా ఉండాలి

- ఎలాంటి వర్గాలు లేకుండా పని చేసుకోవాలి
- ఈనెల 28న వరంగల్ మండల రేషన్ డీలర్ల ఎన్నికలు
- రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మోహన్ నాయక్




**వరంగల్ బ్యూరో ,సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** వరంగల్ మండలంలోని రేషన్ డీలర్లు అందరూ ఐక్యంగా ఉండాలని వరంగల్ జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు ధారావత్ మోహన్ నాయక్ అన్నారు.ఈ మేరకు శుక్రవారం వరంగల్ కొత్తవాడలోని ఇన్నర్ వీల్ క్లబ్లో వరంగల్ మండల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం అడ హక్ కమిటీ బాధ్యులు గజ్జి గోవర్ధన్, గోపాల్ రావు, కొమురయ్య అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశానికి కిల వరంగల్ మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు భారతి రామచందర్, ప్రధాన కార్యదర్శి మంద మహేందర్ సంగం సంఘం మండల అధ్యక్షులు ఉమేందర్ ,జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ దామోదర్, కుమారి యాదవ్ హాజరయ్యారు. అదేవిధంగా మండలంలోని సుమారు 60 మంది రేషన్ డీలర్లు హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మోహన్ నాయక్ మాట్లాడుతూ రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నట్లు చెప్పారు.రాష్ట్ర కమిటీ ఏపీలో ఇచ్చినా కూడా దానికి సహకరిస్తామని చెప్పారు.సమస్యల పరిష్కారానికి అవసరమైతే రేషన్ షాపులు బందు చేసి పోరాటానికి దిగనున్నట్లు అన్నారు.రేషన్ డీలర్లకు ఐదు నెలల నుంచి కమిషన్ ఇవ్వకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని కమిషన్ సాధించే విధంగా రాష్ట్ర కమిటీ ఏ పిలుపు ఇచ్చినా కూడా సిద్ధంగా ఉన్నట్లు జిల్లా అధ్యక్షులు మోహన్ నాయక్ వివరించారు. ఈనెల 28న ఆదివారం ఎన్నికలు నిర్వహిస్తు న్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో రేషన్ డీలర్లు బండి లక్ష్మణ్, బసవరాజు సాంబయ్య ,లక్కర్సు రాజు, కుసుమ రాజేందర్ ఎండి షబీర్ పుల్ల కుమార్ కంది యాదగిరి సాగర్ సురేష్ ఎండి ఇంతియాజ్ దేవరాజ్ సూరం రవీందర్ రాజ్ కుమార్, బసవరాజు రమేష్, డెక్క నరసయ్య ఎన్ కుమార స్వామి రాచర్ల భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఐలమ్మ పోరాటపటిమను స్ఫూర్తిగా తీసుకోవాలి

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఐలమ్మ పోరాటపటిమను, పట్టుదలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం వీరనారి చాకలి ఐలమ్మ 130 వ జయంతిని పురస్కరించుకొని ఐడిఓసి కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆయన చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోరాట ఉద్యమ నాయకురాలు వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని అధికారికంగా జరుపుకోవడం అభినందనీయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళ యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరును పెట్టి సముచిత గౌరవం కల్పించినట్లు తెలిపారు. రజాకారులను, భూ స్వాములను ఎదిరించి పోరాడిన యోధురాలు ఐలమ్మ అని, బడుగు, బలహీన వర్గాల తరుపున పోరాడిన వీరనారి అని కొనియాడారు. ఆమె ఉద్యమ చరిత్రను కళారూపాల ద్వారా కాలేజీ క్షేత్రంలో మంత్రుల సమక్షంలో నిర్వహించినట్లు తెలిపారు. ఆమె ఆశయాలను ఆచరణలో పెట్టి అమలు చేయాల్సిన బాధ్యతను మనందరం తీసుకోవాలని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ త్యాగానికి, పోరాటానికి స్ఫూర్తిగా వీరనారి చాకలి ఐలమ్మ నిలిచారని అన్నారు. చాకలి ఐలమ్మ జన్మదినాన్ని జరుపుకోవడం చాలా గర్వంగా ఉందని, ఆమె సింబల్ ఆఫ్ ఉమెన్ ఎంపవర్మెంట్ గా నిలిచారని తెలిపారు. నాటి రోజుల్లో పెత్తందారులకు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేయడం చాలా గొప్ప సంఘటనని పేర్కొన్నారు. ఆమె ఆశయాలను మన జీవితంలో పాటించాలని, వారి త్యాగాలు నేటి తరానికి తెలియజేయాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జయంతిని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఇందిర, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణపై పిఓలు, ఏపీవోలకు అవగాహన ఉండాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ




**జయశంకర్ భూపాల పల్లి బ్యూరో, (జనంసాక్షి):** స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై పిఓలు, ఏపీవోలు సమగ్ర అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై పిఓలు, ఏపీవోలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సర్వం సన్నద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ చాలా ముఖ్యమైనదని ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు ఎన్నికల ప్రక్రియపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఆర్ ఓ, ఏఆర్వోలు ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరోసారి రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించడంతో పాటు, నిర్వహించిన శిక్షణపై ఎన్నికల సంఘం సూచనల మేరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలు ఉంటాయని పోలింగ్ కేంద్రంలో చేయాల్సిన ఏర్పాట్లు, పోలింగ్ నిర్వహణ తదితర అంశాలను మాస్టర్ ట్రైనర్లు సమగ్రంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తారని, ఏదేని సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిపిఆర్ఓ శ్రీనివాస్, సిపిఓ బాబురావు, భూపాలపల్లి ఎంపీడీవో నాగరాజు, ఆర్వోలు, ఏ ఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్‌లో దొడ్డిదారిన ఉద్యోగాల భర్తీ

- జేఏసీ చైర్మన్ మహిపాల్ యాదవ్




**నిర్మల్ బ్యూరో, సెప్టెంబర్25 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లాలో దొడ్డి దారిన బ్యాక్ లాగ్ ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మహిపాల్ యాదవ్ ఆరోపించారు. గురువారం నిర్మల్ ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ పాలన నుంచి వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ బ్యాక్ లాగ్ పోస్టులను గుట్టు చప్పుడు కాకుండా దొడ్డి దారిలో భర్తీలు జరుగుతున్నాయన్నారు. అక్రమ దారిలో ఉద్యోగాలను కొనుక్కొని, సంపాదించాలని ప్రయత్నిస్తున్న వారిపై అలాగే అక్రమంగా డబ్బులు తీసుకుని భర్తీ చేయాలని చూస్తున్న అధికారులపై తాము పోరాటం చేస్తున్నామని వివరించారు. గత సంవత్సరం నుంచి హైదరాబాద్, నిజామాబాద్, కామారెడ్డి ఇలా తెలంగాణ వ్యాప్తంగా అన్ని చోట్ల ధర్నాలు చేసి దొడ్డిదారి ఉద్యోగాలను ఆపేశామని తెలియజేశారు. అలాగే నిర్మల్ లో దొడ్డి దారిలో ఉద్యోగాలు భర్తీ జరుగుతున్నాయని మా దృష్టికి వచ్చిందన్నారు. గతంలో కూడా నిర్మల్ మున్సిపల్ లో ఏకంగా 44 పోస్టులు భర్తీ చేయడం జరిగిందన్నారు. దీనికి ఎంక్వైరీ కమిటీ అధికారిక ఆర్డీవోను నియమించి, ఉద్యోగాలలో జరిగిన అవకతవకల గురించి పూర్తిస్థాయిలో నివేదిక ఇవ్వాలని చెప్పారు. కానీ ఇప్పటివరకు ఎటువంటి నివేదిక ఇవ్వలేదన్నారు.44 ఉద్యోగాలను అంగట్లో వేలం వేసి అమ్ముకున్నారని మండిపడ్డారు. ఒక్కో పోస్టు కు లక్షల్లో వసూలు చేసినట్టు సమాచారం ఉందన్నారు. 2018 సంవత్సరంలో జెన్కోలో ఎటువంటి నోటిఫికేషన్ లేకుండా కాంటాక్ట్ ఒప్పందంపై ఉద్యోగాలను భర్తీ చేసి, 2022లో పర్మినెంట్ చేశారన్నారు. వీరి వద్ద నుంచి ఒక్కో పోస్టుకు రూ .30 లక్షల దాకా డిమాండ్ చేసినట్టు సమాచారం ఉందన్నారు. ఇప్పటికే జెన్కోలో కరీంనగర్ మాజీ ఎంపీ సోదరుని కూతురికి ఎగ్జామ్ రాయకుండానే ఏఈ పోస్టు ఇచ్చినట్టు జెన్కో ప్రభాకర్ రావు పై ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దొడ్డిదారిన జరిగే బ్యాక్ లాగ్ నియామకలను అడ్డుకొని ,నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈసమావేశంలో విద్యార్థి నాయకులు కాశి, రాహుల్, సిద్ధార్థ, తదితరులు ఉన్నారు.

# భగీరథ సిబ్బందికి నాలుగు నెలల నుంచి జీతాలు లేక ఇబ్బందులు

- మిషన్ భగీరథ నీటి సరఫరా పంపు ను బంద్ చేసిన సిబ్బంది
- జీతాల కోసం నిరసన



**ములుగు/ వెంకటాపూర్, సెప్టెంబర్26 (జనం సాక్షి):** వెంకటాపూర్ మండలం పాలంపేట లోని మిషన్ భగీరథ పంపు హౌస్ వద్ద నిరసన తెలియజేసిన సిబ్బంది,మిషన్ భగీరథ సిబ్బందికి గత నాలుగు నెలల నుండి జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారు.దసరా పండుగకు ఉపవాసం ఉండలేక సిబ్బంది అందరూ ఏకతాటిపై నిలబడి మిషన్ భగీరథ వద్దకు చేరుకొని మిషన్ భగీరథ పంపు లైను ను ఆపు చేయడం జరిగింది. మిషన్ భగీరథ పంపు హౌస్ గేటుకు తాళం వేసి గేటు ముందు ధర్నా చేశారు.శుక్రవారం నుండి గ్రామాలకు నీటి సరఫరా చేయడం నిలిపివేయడం జరుగును అని తెలిపారు.ప్రజలు సహకరించాలని కోరారు.అధికారులు స్పందించి వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ సిబ్బంది పాల్గొన్నారు.

# పేద కుటుంబాలకు భరోసా సీఎం సహాయ నిధి

- డీసీసీ అధ్యక్షులు కె.శ్రీహరి రావ్



**నిర్మల్ బ్యూరో, సెప్టెంబర్26 (జనంసాక్షి) :** పేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఎంతో భరోసాగా నిలుస్తుందని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు అన్నారు. నిర్మల్ నియోజకవర్గంలో అనారోగ్యంతో ఉండి ఆసుపత్రిలో చికిత్స పొందిన 107 మంది లబ్ధిదారులకు రూ. 40,76,000 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీసీసీ క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరైనా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో సంప్రదిస్తే తప్పక సీఎం సహాయనిధి చెక్కులను మంజూరు చేస్తామన్నారు. వైద్యారోగ్యరంగంలో తెలంగాణ రాష్ట్రం సాధిస్తున్న ప్రగతి, ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా మారిందని అన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టగానే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచి ప్రజా ఆరోగ్య భద్రతపై ప్రభుత్వానికున్న చిత్తశుద్ధిని చాటుకున్నారని తెలిపారు.ఈ కార్యక్రమం లో నిర్మల్ సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు సోమా భీమ్ రెడ్డి, అబ్దుల్ హాది, నిర్మల్ మాజీ మునిసిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్,ఆత్మ కమిటీ చైర్మన్ కొండ్రు రాంరెడ్డి,వివిధ మండలాల అధ్యక్షులు కుంట వేణుగోపాల్, మధుకర్ రెడ్డి, వొద్నలా రాజేశ్వర్, బొల్లోజీ నర్సయ్య, బుజంగా శ్రీనివాస్ రెడ్డి, తక్కల విద్యాసాగర్ రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ లు అయ్యన్నగారి పోశెట్టి, నేరెళ్ల వేణుగోపాల్, నాలూరి పోశెట్టి, సలీం,శ్రీకాంత్,ఆలయ చైర్మన్లు కొండ శ్రీనివాస్,ఆలయ కమిటీ సభ్యులు సంతోష్, నరేందర్, చిరంజీవి,నాయకులు మొయిన్, కాలగిరి గంగారెడ్డి, నల్లాల లింగారెడ్డి,కొండ్రు నరేష్ రెడ్డి, మధుకర్ దాసరి రమేష్ ఉన్నారు.

# అనాథ పిల్లలతో కలిసి కలెక్టర్ భోజనం



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి):** జిల్లా కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం అనాథ పిల్లలతో కలిసి భోజనం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరం లో శుక్రవారం అనాథ పిల్లలు, కోవిడ్ పిఎం కేర్ ఫర్ చిల్డ్రన్ లతో కలెక్టర్ రాజర్షి షా సమావేశమయ్యారు. విద్యా, ఆరోగ్యం , వారి సమస్యలు తదితర అంశాలపై పిల్లలతో చర్చించారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేసి అనంతరం పిల్లలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 202 మంది పిల్లలకు ఆరోగ్యశ్రీ, 8 మందికి ఆయుష్మాన్ భారత్ కార్డులు అందించామని తెలిపారు. వసతి లేని అనాథ పిల్లల సంరక్షకులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, వారి సమస్యల పరిష్కారానికి అన్ని విధాలుగా సహాయం అందిస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ప్రతి మూడు నెలలకోసారి పిల్లలతో సమావేశమవుతామని పేర్కొన్నారు. అనంతరం ఆర్‌బీఎస్‌కే కాంపు ద్వారా పిల్లల రక్తపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ సలోని, డీడబ్ల్యూఓ మిల్కా, డిసిపీఓ రాజేంద్రప్రసాద్, ఆరోగ్యశ్రీ డిస్ట్రిక్ట్ మేనేజర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org | శనివారం 27 సెప్టెంబర్ 2025

# దొంగల ముఠాలోని ఇద్దరు అరెస్ట్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** ఈ నెల 10కి ముందు కామారెడ్డి జిల్లా లోని భిక్నూర్ పోలీసు స్టేషన్ పరిదిలోని, జాతీయ రహదారి-44 రోడ్డుపైన కొందరు వ్యక్తులు ఆటో లో వచ్చి, బస్వాపూర్ లో పెద్దమ్మ గుడి తాళం పగలగొట్టి, అందులో ఉన్న హుండీ నుండి 5000 రూపాయలు, ఆదేవిదంగా ఎల్లమ్మ గుడి తాళం పగలగొట్టి హుండీ నుండి 1000 రూపాయలు మరియు ముత్యాలమ్మ గుడి తాళం పగలగొట్టి హుండీ నుండి 1000 రూపాయలు దొంగిలించిన విషయమై భిక్నూర్ పోలీస్‌స్టేషన్ నందు కేసు నమోదు చేయడమైనది. ఎస్పీ కామారెడ్డి ఉత్తర్వుల మేరకు ఏఎస్పి. కామారెడ్డి అట్టి కేసులను చేధించుటకై 2 స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేసి దర్యాప్తు వేగవంతంగా చేసి, అట్టి దొంగతనం చేసిన అంతరాష్ట్ర ముఠాలోని ముగ్గురిలో ఇద్దరినీ పట్టుకోవడం జరిగినది.వారిని విచారించగ హైవే రోడ్డుపైన ఉన్న ఊర్లలో పరిశీలించి ఆటో లో వెళ్లి తాళం వేసి ఉన్న గుడిలోకి తాళం పగలగొట్టి చొరబడి అందులో హుండీలో ఉన్న డబ్బుని దొంగిలించారు, ఇదివరకు కూడా వీరు దొంగతనం కేసులల్లో ఉన్నారు. హైవే ప్రక్కన గ్రామాలను, గుడులను టార్గెట్ చేసి అందులోకి చొరబడి అందులో నుండి విలువైన వస్తువులను డబ్బులని దోచుకుంటున్నట్లుగా ముఠా సభ్యులు చేసిన నేరాన్ని అంగీకరించినారు. ఇట్టి ముఠా సభ్యులలో ఎ1: గాంధారి సత్యం తండ్రి సాయిలు,42 కులం: మాదిగ, వృత్తి: ఆటో డ్రైవరు, నివాసం: తిర్మనుపల్లి గ్రామం, సదాశివనగర్ మండలం, ప్రస్తుత నివాసం: ఇంటి నెంబర్ 5-6-492, ఎన్జీవోస్ కాలనీ, కామారెడ్డి ఎ2 సయ్యద్ సమీర్ తండ్రి హైమద్ అలీ, వయసు: 25 కులం: ముస్లిం, వృత్తి: కూలీ, నివాసం: అహ్మద్ పూర్ గ్రామం మరియు తాలూకా, లాతూర్ డిస్ట్రిక్ట్, మహారాష్ట్ర ఇందులో ఎ3: అహ్మెద్ పఠాన్ పరారీలో ఉన్నాడు.ఇట్టి ముఠా సబ్యులు 19 ఆగస్టు



2025 రాత్రి రామాయంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మల్లన్న గుడిలో మరియు సదాశివనగర్ మండలంలోని ఎల్లమ్మ గుడిలో, తేదీ 9.9.2025 నాడు రామాయంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో అయ్యప్ప గుడిలోని హుండీలోని డబ్బులు, వెండి పూజ సామగ్రి దొంగలించారు, అదే రోజు రాత్రి భిక్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బస్వాపూర్ గ్రామంలో ఎల్లమ్మ గుడి, పెద్దమ్మ గుడి మరియు ముత్యాలమ్మ గుడి హుండీలనుండి నగదు మరియు అమ్మవారి వెండి కళ్ళు దొంగలించారు గుడి ప్రక్కన గల ఒక ఇంటిలో దొంగతనం చేసి బంగారు మరియు నగదు దొంగిలించారు. అదే రోజు జంగంపల్లి గ్రామం లోని పెద్దమ్మ మరియు ఎల్లమ్మ గుడిలో హుండీనుండి డబ్బులు దొంగలించారు.బస్వాపూర్ పెద్దమ్మ గుడి, ఎల్లమ్మ గుడి, జంగంపల్లి ఎల్లమ్మ గుడిలో ఏర్పాటు, రామాయంపేట మల్లన్న గుడి లో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల ఆధారంగా ఇట్టి దొంగలని పట్టుకోవడం సులభతరం అయ్యింది.కావున ప్రజలు గుడి ఆవరణలలో సిసి కెమెరాల ఏర్పాటు చేసి దొంగతనాలను అరికట్టడంలో సహాయపడగలరు. ఇట్టి ముఠా సభ్యులలో ముగ్గురిలో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుండి 2 మొబైల్ ఫోన్ లు, 1 ఆటో, 3 జతల అమ్మవారి కల్లు, ఆటో కొనుగోలు చేసిన కాగితం, 5000 రూపాయల నగదు స్వాధీనపర్చుకొనైనది. అట్టి పరారీలో ఉన్న ఒక నిందితుణ్ణి పట్టుకోవడానికి టీమ్ ను ఏర్పాటు చేయడం జరిగినది.

### పట్టుబడ్డ నిందితులను అరెస్ట్ చేయబడిన నిందితుల వివరాలు

ఎ1 గాంధారి సత్యం తండ్రి సాయిలు, 42 కులం: మాదిగ, వృత్తి: ఆటో డ్రైవరు, నివాసం: తిర్మనుపల్లి గ్రామం, సదాశివనగర్ మండలం, ప్రస్తుత నివాసం: ఇంటి నెంబర్ 5-6-492, ఎన్జీవోస్ కాలనీ, కామారెడ్డి ఎ2 సయ్యద్ సమీర్ తండ్రి హైమద్ అలీ,25 కులం: ముస్లిం, వృత్తి: కూలీ, నివాసం: అహ్మద్ నగర్ గ్రామం మరియు తాలూకా, లాతూర్ డిస్ట్రిక్ట్, మహారాష్ట్ర ఎ3: పరారీలో ఉన్నాడు అహ్మెద్ పఠాన్, లాతూర్ డిస్ట్రిక్ట్, మహారాష్ట్ర స్వాధీన పరుచుకున్న వస్తువులు:2 మొబైల్ ఫోన్ లు, 1 ఆటో, 3 జతల అమ్మవారి వెండి కళ్ళు, వెండి తీర్థం చెంచ మరియు ప్లేట్, వెండి దీపాలు, మరియు 5000 రూపాయల నగదు. ఇట్టి కేసు దర్యాప్తులో పాల్గొని హైవే పై గుళ్ళలో మరియు ఇళ్ళలో దోపిడి చేసిన కేసులని ఛేదించిన ఎన్. శ్రీనివాస్ సిసిఎస్ ఇన్స్పెక్టర్, ఎమ్ సంపత్ కుమార్ భిక్నూర్ సిఐ, డి. ఆంజనేయులు ఎస్సై భిక్నూర్ సిసిఎస్ సిబ్బంది ఉస్మాన్ ఎస్సై, నర్సింగ్ రావు ఏఎస్ఐ వెంకట్రావ్ ఏఎస్ఐ భిక్నూర్, శ్రీనివాస్ సిసిఎస్ కానిస్టేబుల్, మైసయ్య సి సి ఎస్ కానిస్టేబుల్, లక్ష్మీకాంత్ సిసిఎస్ కానిస్టేబుల్, శ్రీనివాస్ రావు సి సి ఎస్ కానిస్టేబుల్, గణపతి సి సి ఎస్ కానిస్టేబుల్ మరియు రజినీకాంత్ దోమకొండ కానిస్టేబుల్, రాములు బీబీపేట కానిస్టేబుల్ మరియు కిషన్ గౌడ్ భిక్నూర్ కానిస్టేబుల్ గార్లను జిల్లా ఎస్పీ అభినందించడం జరిగింది.

## వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం నేటి యువతకు స్ఫూర్తిదాయకం కావాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.శుక్రవారం కలెక్టరేట్ లో నిర్వహించిన చాకలి ఐలమ్మ 130 వ జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పటి విషమ పరిస్థితులలో వెనుకబాటు వర్గాల వారికి న్యాయం జరగాలని కసితో ముందుకు సాగి చాకలి ఐలమ్మ పోరాటం చేశారని అన్నారు.ఆమె ఆకాంక్ష మేరకు సమాజంలో మార్పు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.ఒక వ్యవస్థను అందరు కలిసి ముందుకు తీసుకువెళ్తే ఆ ఫలితాలు సమాజానికి, దేశానికి, జిల్లాల అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు.తెలంగాణలో రైతాంగ పోరాటంలో భాగంగా, అన్యాయానికి, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా ధైర్యంగా నిలబడి చాకలి ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. ఆమె త్యాగాలు, పోరాట స్ఫూర్తి భావితరానికి దిశానిర్దేశం చేస్తాయని అన్నారు.ఆమెను స్ఫూర్తిగా తీసుకొని పది మందికి సహాయం చేయాలని అన్నారు.అదనపు కలెక్టర్ కె.సీతారామరావు మాట్లాడుతూ చాకలి ఐలమ్మ పోరాటపటిమతో తప్పును ఎదిరించే ధైర్యశాలిగా, ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడే ఎదుర్కొనే శక్తిగా ఎందరికో ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి నరసింహ, డీఈవో అశోక్, డిపిఓ యాదగిరి,ఎస్సీ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ , ట్రైబల్ వెల్ఫేర్ అధికారి శంకర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, టీఎన్జీవోస్ జిల్లా సెక్రటరీ దున్న శ్యామ్, బీసీ సంఘం నాయకులు పద్మ, సైదులు, సత్యనారాయణ పిళ్ళై, చల్లమల్ల నరసింహ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇరిగేషన్లు పూర్తయితే పాలకీడు మండలం సస్యశ్యామలం

- మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి



**పాలకవీడు, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** జవహర్ జానపాడు,బెట్టే తండా లిఫ్ట్ ఇరిగేషన్లు పూర్తి ఐతే పాలకీడు మండలం సస్య శ్యామలం అవుతుందని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. పాలకీడు మండలం అలింగాపురం వద్ద అలింగాపురం నుండి రాఘవాపురం వరకు కోటి రూపాయలతో నిర్మించిన మెటల్ లింక్ రోడ్డు ను శుక్రవారం మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గరిడేపల్లి నుండి అలింగాపురం వరకు 30 కోట్లతో డబల్ రోడ్డు నిర్మించానని తెలిపారు. ట్రైబల్ వెల్ఫేర్ ద్వారా హుజూర్నగర్ నియోజకవర్గంలో గరిడేపల్లి మండలంలో లక్య తండా నుండి కాపుర్య తండా వరకు 60 లక్షలతో,పాలకీడు మండలంలో బాపూజీ తండా నుండి ఆర్ అండ్ బి రోడ్ వరకు 40 లక్షలు,గుండ్లపాడు నుండి దేవలతండా వరకు 3 కోట్లు, మఠంపల్లి మండలం రఘునాథపాలెం నుండి పెదవీడు వరకు 3 కోట్లు రోడ్లు నిర్మించేందుకు నిధులు మంజూరు అయ్యాయని అలాగే కోదాడ నియోజకవర్గంలో అనంతగిరి మండల కేంద్రం నుండి బొజ్జగూడెం తండా వరకు 2.3 కోట్లు, మోతె నుండి గోల్ తండా వరకు 4.0 కోట్లు, నడిగూడెం మండలం రామాపురం నుండి ఎక్లాస్ ఖన్ పేట వరకు 3.2 కోట్లు మొత్తం కోదాడ, హుజూర్నగర్ నియోజకవర్గలలో గిరిజన ప్రాంతాలలో అంతర్గత రోడ్లు నిర్మించేందుకు మొత్తం 20.3 కోట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. అనంతరం నేరేడు చర్ల మున్సిపాలిటీలో జానపాడు రోడ్ లో ఎస్ డి ఎఫ్ నిధులు 41.25 లక్షలతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ ను మంత్రి స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్,ఆర్డీఓ శ్రీనివాసులు,పబ్లిక్ హెల్త్ ఎస్ ఈ వెంకటేశ్వర్లు,పంచాయతీ రాజ్ ఈఈ వెంకటయ్య, తహసీల్దార్ కమలాకర్, మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి, డిఈ రమాదేవి,ఏఈ స్వాతి, మున్సిపల్ అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు మోతిలాల్, సుబ్బారావు, గోపాల్, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు వినతి అందజేసిన ఉప్పల్ ఎమ్మెల్యే

**కాప్రా, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరీ ను శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మల్లాపూర్ డివిజన్ పరిధిలోని నేహ్రూనగర్ కాలనీకీ ఎదురుగా, ఎన్ఎఫ్‌సి కంపెనీ ప్రహరీగోడను అనుకోని ఉన్న టీ ఎస్ఐఐసి కీ సంబంధించిన మల్లాపూర్ గ్రామ సర్వే నెం 44, 45లోని ఎన్ఎఫ్‌సి వారు వదిలినటువంటి నిరుపయోగంగా ఉన్న ఖాళీ స్థలము కబ్జాలకు గురవుతున్నది, ఇట్టి స్థలాన్ని అప్పట్లో టీఎస్ఐఐసి మౌలాలి ఐలా వారికీ ప్రభుత్వం వారు అప్పగించాడము జరిగిందని ఆయన అన్నారు.



# మాట ఇచ్చి తప్పిన సీఎం

**సదాశివనగర్, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలు రోడ్లు చెరువులు తెగిపోయి వాటిని పరిశీలించిన సీఎం తమ కష్టాల నుంచి గట్టెక్కిస్తారని ఆశించిన రైతులకు నిరాశ మిగిలిందని సదాశివ నగర్ మండల మాజీ జెడ్పిటిసి పడగల రాజేశ్వరరావు ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనకు వస్తున్నారని తెలిసి రైతుల ఎంతో సంబరపడ్డారు .తీరా ముఖ్యమంత్రి ఒక రోడ్డును పరిశీలించి వరద బాధితులు ఆదుకుంటామని ప్రకటించి వెళ్లిపోయి మూడు వారాలు గడుస్తున్న మూడు పైసలు కూడా విడుదల చేయకపోవడం పట్ల ప్రజల ఆందోళన చెందుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో దాదాపు 30 వేల పైచిలుకు ఎకరాల్లో పంట నష్టం జరిగిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుగా ఉండటం ఎంతవరకు సమంజసం ప్రశ్నించారు. ఇవే కాకుండా నాగిరెడ్డిపేట మండలం ఎంకంపల్లి,లింగాల,తాండూర్, ఎర్రారం,జలాల్పూర్, వాడి, చినూర్ గోపాల్పేట్,బంజారా తండా, లింగంపల్లి ,మాటూర్, మాసంపల్లి, ఆత్మకూర్, సదాశివ నగర్ మండల్ మల్లుపేట్ గ్రామ తదితర గ్రామాల్లో మంజీరా కలవల్ల ఇప్పటికి వరి పొలాలు నీళ్లలో ఉన్నాయని అయినా పట్టించుకునే నాథుడు లేదని ఆయన పేర్కొన్నారు. ఎన్నో రోడ్లు బ్రిడ్జిలు కొట్టుకపోయిన ప్రభుత్వం నామమాత్రం మరమ్మతులు తప్ప శాశ్వత పరిష్కారానికి నిధులు కేటాయించకపోవడం విచారకరమన్నారు ఇప్పటికే నియోజకవర్గంలో పోల్కంపేట్ గోపాల్పేట్ వద్ద చెరువులు తెగిపోయి పంట పొలాల్లో ఇసుక మేటలు వేసి ఇబ్బంది పడుతున్న ప్రకటనలు తప్ప



ప్రభుత్వ సాయం అందించకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా పేద రైతులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఇక్కడి ప్రజల జీవన విధానం అగమ్య గోచరంగా తయారైందని ఆయన ఆరోపించారు. 200 కోట్ల ప్యాకేజీ వస్తుందని చెప్పిన అధికార పార్టీ నాయకులు ఆచరణలో అమలు చేయలేకపోయారని ఆరోపించారు. ఈ సమావేశంలో రామారెడ్డి మాజీ ఎంపీపీ నారెడ్డి దశరథరెడ్డి ,గాంధారి టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శివాజీ రావు, కాలభైరవ స్వామి ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు సతీష్ గుప్తా ,జిల్లా బీసీ నాయకుడు కళాలి సాయ గౌడ్ ,టిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు చాకలింగం గిరిజన నాయకుడు లింబాద్రి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పీఎంఏవైజీ సర్వే యాప్‌లో వివరాలు నమోదు చేయాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి పీఎంఏవైజీ సర్వే యాప్ లో వివరాల నమోదు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.శుక్రవారం కలెక్టరేట్ లో జిల్లాలోని గృహ నిర్మాణ శాఖ డిఈ, ఏఈలతో వెబ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు.పీఎంఏవైజీ సర్వే యాప్‌లో ఈనెల 30లోగా వివరాలు నమోదు చేయడానికి చివరి తేదీగా నిర్ణయించినందున వివరాల నమోదు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల మార్ అవుట్ వారంలో పూర్తి చేయాలని ఆదేశించారు.మార్క్ అవుట్ అయిన ఇండ్ల నిర్మాణంలో పురోగతి తీసుకువచ్చి త్వరితగతిన పూర్తి చేయాలని, పూర్తయిన ఇందిరమ్మ ఇండ్ల వివరాలను ఏఈ, డిఈ స్థాయిలో పెండింగ్ లో లేకుండా హౌజింగ్ పీడీకి పంపాలని చెప్పారు.ఇసుక, గ్రావేల్ ఇబ్బంది లేకుండా చూడాలని, ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా ఇండ్ల నిర్మాణం పూర్తి చేయాలని,ఎవరైనా అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటామని పంచాయతీ సెక్రటరీలను, హౌజింగ్ ఏఈలను ఆదేశించారు.



## ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** త్వరలో జరుగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల విధులను సక్రమంగా, బాధ్యతాయుతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.శుక్రవారం కలెక్టరేట్ లో త్వరలో నిర్వహించనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ఆర్ఓ, ఏఆర్ఓల ట్రైనింగ్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు.స్థానిక సంస్థల ఎన్నికలు కీలకంగా, బాధ్యతాయుతంగా ఉంటాయని అన్నారు.ప్రజల ఆకాంక్ష, నమ్మకం ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని, రిటర్నింగ్ ఆఫీసర్ కు కీలక బాధ్యతలు ఉంటాయని తెలిపారు.ఎలక్షన్ కమిషన్ రూల్స్ ప్రకారం ప్రతి ఒక్కరు నడుచుకోవాలని అన్నారు.ఎలక్షన్ ప్రారంభం నుండి బ్యాలెట్ బాక్స్ అప్పగించే వరకు ఆర్వో బుక్ మైంటైన్ చేయాలని,అప్డేట్ సూచనలను పాటించాలని, ఎన్నికలు చట్టబద్ధమైనందున రూల్ పొజిషన్ పాటించాలని ,అసిస్టెంట్ ఆర్వోలు సైతం బాధ్యతయుతంగా ఉండాలని అన్నారు.ఆర్వోల సూచనలను ఏఆర్ఓలకు తెలియచేయాలని ఎన్నికల అధికారులు, ఆర్వోలు, ఏఆర్వోలు కలిసికట్టుగా సమిష్టి కృషితో, బాధ్యతాయుతంగా ఎన్నికల విధులు నిర్వహించి జిల్లాకు మంచి పేరు తేవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, జడ్పీ సీఈవో వివి.అప్పారావు, డిపిఓ యాదగిరి, ఆర్వోలు, ఏఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.




## విజయదశమి నుండి ఫ్లైఓవర్ పనులు ప్రారంభం

- మంత్రి కోమటిరెడ్డి ని కలిసిన మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణం లోని నందిపాడు చౌరస్తా వద్ద నిర్మించ తలపెట్టిన ఫ్లైఓవర్ పనులను విజయదశమి పండుగ నుండి ప్రారంభం కానున్నట్లు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. ఫ్లైఓవర్ పనులను ప్రారంభించడానికి రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డినీ సంబంధిత అధికారులతో కలిసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ అభివృద్ధి పనులలో భాగంగా తలపెట్టిన నాలుగు ఫ్లై ఓవర్ లలో మొదటగా నందిపాడు చౌరస్తా వద్ద అక్టోబర్ 2న పనులను ప్రారంభించేందుకు మంత్రి అనుమతులను తీసుకున్నామన్నారు. ఫ్లై ఓవర్ నిర్మాణానికి అవసరమయ్యేటటువంటి వ్యయంతో పాటు ప్రణాళికలను మంత్రికి వివరించామన్నారు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణ పనులను ప్రారంభించేందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రానున్నట్లు తెలిపారు.



## ప్రపంచస్థాయి సాంకేతిక విద్యను అందించడమే శ్రీచైతన్య లక్ష్యం

**ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** మండలం లోని స్థానిక పొన్నేకల్ లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ బీటెక్ విద్యార్థుల కోసం శుక్రవారం ఘనంగా ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిసిఎస్ హెడ్ జేవిఆర్ఎస్ ప్రసాద్, ఇన్ఫోసిస్ టెక్నికల్ హెడ్ నివాస్,ఐసిటి అకాడమీ తెలంగాణ హెడ్ గోపాల్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ,ప్రపంచ స్థాయి సాంకేతికతను అందిస్తూ విద్యార్థుల ప్రతిభను వెలికితీయడమే మా లక్ష్యం అని విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని సమయపాలన, క్రమశిక్షణ, కృషి మరియు పట్టుదలతో ముందుకు సాగాలని,విద్యారంగంలో సమూలమైన మార్పులు వస్తున్నాయని అన్నారు., విద్యార్థులను ప్రపంచతో పోటీ పడే విధంగా వారిని తయారు చేయడం, మార్పులకి అనుగుణంగా టెక్నికల్ విద్య తోపాటు పరిశ్రమలకు కావలసిన స్కిల్స్ నేర్పించడం కోసం మా అధ్యాపక బృందం తయారు చేసిన మైక్రో షెడ్యూల్ ఉత్తమ ఫలితాలు సాధించడంలో ఎంతగానో ఉపయోగ పడుతుందని,మా మీద నమ్మకంతో మా కళాశాలను ఎంచుకున్న తల్లిదండ్రులకి విద్యార్థులకి ధన్యవాదాలు తెలిపారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక మాట్లాడుతూ గత విద్యా సంవత్సరంలో 468 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే 100% ప్లేస్మెంట్ ఇచ్చిన కళాశాలగా శ్రీచైతన్య ముందు వరుసలో ఉంది అని అన్నారు. అమెజాన్ కంపెనీలో 26.8 లక్షల వార్షికవేతనంతో ఇద్దరు విద్యార్థులు ఎన్నిక అయ్యారు అని అన్నారు.మేము అందుస్తున్న ప్లేసెమెంట్ మరియు ఇంటర్న్షిప్ కి గాను అల్ ఇండియా స్థాయి లో శ్రీ చైతన్య 128వ స్థానం సాధించడం శ్రీ చైతన్య విద్యార్థలకు అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమ-అకాడమిక్ అనుసంధానానికి నిదర్శనం అన్నారు.విద్యార్థులకు మరిన్ని ఇంటర్న్షిప్లు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అందించి భవిష్యత్తులో ఇంకా మెరుగైన ర్యాంకులు సాధించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టి సి స్ టెక్నికల్ హెడ్ జె వి ర్ స్ ప్రసాద్, ఇన్ఫోసిస్ టెక్నికల్ హెడ్ నివాస్, ఐసిటి అకాడమీ తెలంగాణ హెడ్ గోపాల్ గోపాల్,కళాశాల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీ విద్య, డీన్ అకాడమిక్స్ డాక్టర్ వి సుదర్శన్,ఎలక్ట్రానిక్స్ విభాగ అధిపతి డాక్టర్ రాజేష్,ఎలక్ట్రికల్ విభాగ అధిపతి సిహెచ్ కృష్ణ ప్రసాద్,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ మరయు వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ చిరంజీవి, డాక్టర్ ప్రణతి,డాక్టర్ జ్యోతి, శ్రీ కుమార్ అధ్యాపక బృందం, తల్లిదండ్రులు, కొత్తగా చేరిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






## వర్క్ ఫ్రమ్ హోంను సమర్థించను

• గూగుల్ మాజీ సీఈఓ



**న్యూఢిల్లీ:**మాజీ గూగుల్ సీఈఓ ఎరిక్ స్మిత్ రిమోట్ అండ్ ఫ్లెక్సిబుల్ వర్క్ మీద మరోసారి వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఫ్లెక్సిబుల్ వర్క్ ఆమోదయోగ్యం అయినప్పటికీ.. సాంకేతిక రంగంలో ఇది కుదరదు. ఇది పోటీతత్వాన్ని దెబ్బతీస్తుందని ఆయన అన్నారు. వర్క్ ఫ్రమ్ హోమ్ అనేది ఉద్యోగులకు సౌకర్యవంతంగా ఉన్నప్పటికీ.. కొత్తగా నేర్చుకునే తత్వాన్ని నాశనం చేస్తుంది. ఆఫీసులో సహోద్యుగుల నుంచి చాలావరకు నేర్చుకోవచ్చు. కాబట్టి నేను 'వర్క్ ఫ్రమ్ హోమ్'ను సమర్థించనని ఎరిక్ స్మిత్.. ఆల్-ఇన్ పాడ్‌కాస్ట్‌లో పేర్కొన్నారు.గత ఏడాది కంపెనీ రిమోట్ వర్క్ కల్చర్ కారణంగా.. చిన్న ఏఐ స్టార్టప్‌ల కంటే వెనుకబడిందని స్మిత్ అన్నారు. ప్రపంచం ఎలా పనిచేస్తుందో తెలుసుకోవడానికి కొత్తగా నేర్చుకుంటూ ఉండండి. నా కెరీర్ తొలినాళ్లలో సన్ మైక్రోసిస్టమ్స్‌లోని సహోద్యోగులు వాదించడాన్ని వినడం ద్వారా చాలా నేర్చుకున్నానని ఆయన పేర్కొన్నారు.అమెరికా, చైనా టెక్ పరిశ్రమ పోటీలను స్మిత్ హైలైట్ చేశారు. ఇక్కడ 996 పని సంస్కృతి ఉందని అన్నారు. ఈ దేశాల్లో ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు, వారానికి ఆరు రోజులు పనిచేస్తున్నారు. చైనాలో ఇటువంటి అధిక పని గంటలకు వ్యతిరేకంగా చట్టాలు ఉన్నప్పటికీ, చాలా కంపెనీలు.. ఉద్యోగులు ఇప్పటికీ ఈ కఠినమైన షెడ్యూల్‌కు కట్టుబడి ఉన్నారని, ఇది యూఎస్ వ్యాపారాలకు గణనీయమైన పోటీ ఒత్తిడిని సృష్టిస్తుందని ఎరిక్ ష్మిత్ పేర్కొన్నారు.

### ధోని ఇన్వెస్ట్ చేసిన కంపెనీకి

## ఎన్ఎస్ఈ ఓకే

### ఫైనాన్స్ బుద్ధ లిస్టింగ్‌కు లైన్ క్లియర్

**న్యూఢిల్లీ:**సుప్రసిద్ధ క్రికెటర్ ఎంఎస్ ధోని, ఇన్వెస్టర్ ఆశిష్ కచోలియా, క్యామ్స్ వ్యవస్థాపకుడు వి.శంకర్‌కు పెట్టుబడులున్న ఫిన్‌బడ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది.ఇందుకు స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ తాజాగా సూత్రప్రాయ అంగీకారాన్ని తెలియజేసింది. ఫైనాన్స్ బుద్ధ బ్రాండుతో రుణ సౌకర్యాలకు దారిచూపే కంపెనీ.. ఎస్ఎంఈ విభాగంలో నిధుల సమీకరణ చేపట్టనుంది.దీని ద్వారా ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఈ ఫిజిటల్ రుణాల సంస్థ లిస్ట్‌కానుంది. ఐపీవోలో భాగంగా రూ.10 ముఖ విలువగల 50.48 లక్షల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. ఇష్యూ నిధులను వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు, అనుబంధ సంస్థ ఎల్‌టీసీవీ క్రెడిట్‌లో పెట్టుబడులు, బిజినెస్ డెవలప్‌మెంట్, మార్కెటింగ్ కార్యకలాపాలతోపాటు.. రుణ చెల్లింపులకు వినియోగించనుంది. ఫిన్‌బడ్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌ను 2012లో వివేక్ భాటియా, పార్థ్ పాండే, పరాగ్ అగర్వాల్ ఏర్పాటు చేశారు.

# సూచీల భారీ పతనం

### • స్టాక్ మార్కెట్లు క్రాష్..



**ముంబై:**రిటైల్ పెట్టుబడిదారులలో భయాందోళనల అమ్మకం, విదేశీ పెట్టుబడిదారులవిపరీతఆఫ్ లోడ్లతో భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి.అక్టోబర్ 1నుండి తమదేశంలోకి ప్రవేశించే "ఏదైనా బ్రాండెడ్ లేదా పేటెంట్ ఫార్మాస్యూటికల్ ఉత్పత్తి" పై 100 శాతం సుంకం విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసినప్రకటనతోదలాల్ స్ట్రీట్ 'బేరు'మన్నది. బీఎస్ఈ సెన్సెక్స్ ఇండెక్స్ ఈరోజు733 పాయింట్లు లేదా 0.9 శాతం క్షీణించి 80,426.5 వద్ద ముగిసింది. ఇది ఇంట్రాడే ట్రేడ్ లో 80,332 కనిష్టాన్ని తాకింది.మరోవైపుఎన్ఎస్ఈనిఫ్టీ 50 ఇండెక్స్ 236 పాయింట్లు లేదా 0.95 శాతం క్షీణించి 24,655 వద్ద ముగిసింది. ఇది 24,629 వద్ద పడిపోయింది. దీంతో, ఈబెంచ్ మార్క్ ఏడు వారాలలో అత్యంతచెత్త వారపు క్షీణతను నమోదు చేసింది.ఎం అండ్ ఎం, సన్ ఫార్మా, ఇన్ఫోసిస్, టాటా స్టీల్, టెక్ ఎం, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్, బీఈఎల్, హెచ్సీఎల్ టెక్, ఏషియన్ పెయింట్స్, ట్రెంట్, అదానీ పోర్ట్స్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ 1 శాతం నుంచి 3.6 శాతం వరకు నష్టపోయాయి.సెన్సెక్స్ ఇండెక్స్లోఎల్ అండ్ టీ, మారుతి సుజుకి, ఐటీసీ, రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా మోటార్స్ మాత్రమే లాభపడ్డాయి.విస్తృత మార్కెట్లలో నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 2.05 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్ ఇండెక్స్ 2.2 శాతం క్షీణించాయి.నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 2.3 శాతం, నిఫ్టీ ఫార్మా 2.2 శాతం, నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ 1 శాతం నష్టపోయాయి.

**స్టాక్ మార్కెట్‌లో భారీగా పెరిగిన ఇన్వెస్టర్లు..**

స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ యూనిక్ ఇన్వెస్టర్ల సంఖ్య తాజాగా 12 కోట్లను అధిగమించింది. గత 8 నెలల్లోనే కోటిమంది జత కలిసినట్లు ఎన్ఎస్ఈ వెల్లడించింది.కాగా.. ప్రతీ నలుగురిలో ఒకరు మహిళా ఇన్వెస్టర్ అని పేర్కొంది. ఈ ఏడాది జనవరిలో తొలిసారిగా ఎన్ఎస్ఈ ఇన్వెస్టర్ల సంఖ్య 11 కోట్లను దాటింది.నిజానికి ఎన్ఎస్ఈ కార్యకలాపాలు ప్రారంభమైన 14ఏళ్ల తదుపరి ఇన్వెస్టర్ల సంఖ్య కోటికి చేరింది. తదుపరి కోటిమంది ఏడేళ్లలో జత కలవగా.. ఆపై మూడున్నరేళ్లలోనే ఈ సంఖ్యకు మరో కోటి జమయ్యింది. ఈ బాటలో ఆపై.. ఏడాదికి అటూఇటుగా మరో కోటిమంది జత కలిసినట్లు ఎన్ఎస్ఈ వివరించింది. వెరసి ఎన్ఎస్ఈ ఆవిర్భవించిన 25ఏళ్లకు అంటే 2021 మార్చికల్లా ఇన్వెస్టర్ల సంఖ్య 4 కోట్ల మైలురాయిని తాకింది. ఆపై వేగం పెరిగి 6-7 నెలల్లోనే మరో కోటి మంది ఇన్వెస్టర్లు తోడయ్యారు.ఈ స్పీడుకు ప్రధానంగా డిజిటైజేషన్, ఫిన్‌టెక్ సేవల అందుబాటు, మధ్యతరగతి పెరగడం, ప్రభుత్వ పాలసీల మద్దతు సహకరించాయి. 2025 సెప్టెంబర్ 23కల్లా ఎన్ఎస్ఈలో రిజిస్టరైన ఇన్వెస్టర్ల సంఖ్య 23.5 కోట్లకు చేరింది. అన్ని రకాల క్లయింట్ రిజిస్ట్రేషన్లతో కలిపి ఈ సంఖ్యకాగా.. క్లయింట్లు ఒక సభ్యునికంటే అధికంగా కూడా రిజిస్టరయ్యేందుకు వీలుంది.రిజిస్టర్డ్ ఇన్వెస్టర్లలో 12 కోట్లమంది సగటు వయసు 33 ఏళ్లుకాగా.. 1.9 కోట్లమంది ఇన్వెస్టర్లతో మహారాష్ట్ర ప్రథమ స్థానంలో నిలుస్తోంది. 1.4 కోట్లమంది రిజిస్టర్డ్ ఇన్వెస్టర్లరీత్యా ఉత్తరప్రదేశ్ రెండో ర్యాంకును పొందగా, 1.03 కోట్లతో గుజరాత్ తదుపరి స్థానాన్ని ఆక్రమించింది.

## 'ఉద్యోగ భద్రత ఒక జోక్'

• రాబర్ట్ కియోసాకి



**న్యూఢిల్లీ:**ఎప్పుడూ బిట్‌కాయిన్, బంగారం వంటి వాటిలో పెట్టుబడి పెట్టాలని చెప్పే.. రిచ్ డాడ్ పూర్ డాడ్ రచయిత 'రాబర్ట్ కియోసాకి', ఇప్పుడు ఉద్యోగ భద్రత అనేది ఒక జోక్ అంటూ ట్వీట్ చేశారు.ప్రస్తుతం ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ప్రభుత్వం మూతపడిందా?, ఉద్యోగాల తొలగింపు ఉంటుందా?, మీరు ఉద్యోగం కోల్పోవడానికి సిద్ధంగా ఉన్నారా?, ఈ మెసేజ్ అర్థమైందా? అంటూనే.. ఉద్యోగ భద్రత ఒక జోక్ అని రాబర్ట్ కియోసాకి పేర్కొన్నారు. ఉద్యోగిగా కాకుండా వ్యవస్థాపకుడిగా మారడం గురించి ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. మార్కెట్లో అనుకోని మార్పులు జరిగే అవకాశాలు ఉన్నాయని రాబర్ట్ కియోసాకి హెచ్చరించారు. 1976 నుంచి అమెరికా వివిధ స్థాయిలలో 22 షట్‌డౌన్‌లను ఎదుర్కొంది. 2018లో 34 రోజులు మార్కెట్ అత్యల్ప స్థాయిలో కొనసాగింది. ఆ తర్వాత స్టాక్‌లు, బిట్‌కాయిన్ రెండూ కోలుకోవడం ప్రారంభించాయి. చరిత్ర ప్రకారం.. షట్‌డౌన్‌లు కొన్ని రోజులు మాత్రమే ఉంటాయి. సగటున 2-4 వారాల పాటు ఉంటాయి. ఎలాంటి సమయంలో అయినా.. బిట్‌కాయిన్ బలంగా ఉంటుంది. గత సంవత్సరం మార్చిలో పరిస్థితులు కొంచెం అనిశ్చితంగా కనిపించినప్పుడు, గడువుకు ముందు వారంలో బిట్‌కాయిన్ 16% పెరిగి 62,700 డాలర్ల నుంచి 73600 డాలర్లకు పెరిగింది. ప్రస్తుతం దీని విలువ ఊహకందని రీతిలో భారీగా పెరిగింది. సొంతంగా వ్యాపారాన్ని ప్రారభించడం లేదా బిట్‌కాయిన్ వంటివాటిలో పెట్టుబడి వంటివి మీకు ఆర్థిక స్వేచ్ఛను ఇస్తుందని కియోసాకి సందేశం చెబుతోంది. దీనిపై పలువురు నెటిజన్లు తమదైన రీతిలో స్పందిస్తున్నారు.

## కొత్త జీఎస్టీతో ధరలు పెరిగిన బైక్‌లు..

**ముంబై:**జీఎస్టీసంస్కరణల్లోభాగంగా కొత్తపన్నురేట్లుఅమల్లోకి రావడంతో 350సీసీకంటే తక్కువఇంజిన్సామర్థ్యం ఉన్నచాలామోటర్సైకిళ్లు, స్కూటర్లధరలుతగ్గాయి. మరోవైపు 350 సీసీ కంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న బైక్ లను అత్యధిక రేటు కేటగిరిలోకి చేర్చడంతో ద్విచక్ర వాహన కంపెనీలు ఆ మేరకు పెద్ద బైక్ ల ధరలను పెంచేశాయి.హొండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా భారత మార్కెట్లో తన పెద్ద బైక్ పోర్ట్ ఫోలియో ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. కనిష్టంగారెబెల్ 500 మోడల్ధర రూ .37,000 పెరిగింది. కంపెనీఫ్లాగ్ షిప్ బైక్జీఎల్ 1800 గోల్డ్ వింగ్ టూర్ రూ .2.92 లక్షల పెరుగుదలను చూసింది.సుజుకీకూడా...:సుజుకి మోటార్ సైకిల్ ఇండియా కూడాతన మోటార్ సైకిళ్ల ధరలను సవరించింది. రేట్లుపెరిగినబైక్మోడల్స్ జాబితాలో లెజెండరీ హయాబుసా, వి-స్ట్రోమ్ 800 డీఈ, మిడిల్-వెయిట్ జీఎస్ఎక్స్-8ఆర్ ఉన్నాయి.సుజుకి భారతీయ లైనప్ లో అత్యధిక ధర కలిగిన మోడల్ గా, హయాబుసా జీఎస్టీసవరణతో ఎక్కువగా ప్రభావితమైంది. దీని ధర రూ .1.16 లక్షలు పెరిగింది.



## జీ 310 ఆర్ఆర్ లిమిటెడ్ ఎడిషన్

### 310 మందికే ఈ బైక్!

**ముంబై:**బీఎండబ్ల్యూ మోటోరాడ్.. ఇండియన్ మార్కెట్లో తన జీ 310 ఆర్ఆర్ లిమిటెడ్ ఎడిషన్ లాంచ్ చేసింది. కంపెనీ లాంచ్ చేసిన ఈ బైక్ ధర రూ.2.99 లక్షలు (ఎక్స్ షోరూమ్). దీని ధర స్టాండర్డ్ జీ 310 ఆర్ఆర్ కంటే కూడా రూ. 18000 తక్కువ. దీనిని 310 యూనిట్లకు మాత్రమే పరిమితం చేశారు. అంటే.. ఈ బైకును 310 మంది కస్టమర్లు మాత్రమే కొనుగోలు చేయగలరు.భారతదేశంలో బీఎండబ్ల్యూ జీ 310 ఆర్ఆర్ 1000 యూనిట్లు అమ్ముడైన సందర్భంగా.. కంపెనీ జీ 310 ఆర్ఆర్ లిమిటెడ్ ఎడిషన్ లాంచ్ చేసింది. ఇది కాస్మొటిక్ అప్డేట్స్ పొందినప్పటికీ.. యాంత్రికంగా ఎలాంటి మార్పులు పొందలేదు. ఫ్యూయెల్ ట్యాంక్ మీద 1/310 బ్యాడ్జ్ ఉండటం చూడవచ్చు. ఇది రెండు బేస్ కలర్ స్కీమ్‌లలో అందుబాటులో ఉంది.బీఎండబ్ల్యూ జీ 310 ఆర్ఆర్ లిమిటెడ్ ఎడిషన్ 312 సీసీ సింగిల్-సిలిండర్, లిక్విడ్-కూల్డ్ ఇంజిన్‌తో పనిచేస్తుంది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,05,300 (22 క్యారెట్లు) | ₹ 1,14,880 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)


హైదరాబాద్

₹ 1,53,000

# జీఎస్టీ క్రమబద్ధీకరణతో విజయం చేకూరిందా?



**ప్రభుత్వం ఇటీవల చేపట్టిన వస్తు సేవల పన్ను(జీఎస్టీ) హేతుబద్ధీకరణపై కొందరిలో ఆందోళనలు నెలకొంటుంటే, ఇంకొందరు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే అంతర్జాతీయంగా ప్రతికూల పరిస్థితులున్న సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థను అస్థిరపరచకుండా ఇటువంటి క్రమబద్ధీకరణకు పూనుకొని ఒకింత ప్రజల మన్ననలు పొందడంపై ప్రభుత్వం విజయం సాధించిందనే చెప్పాలి.**




**న్యూఢిల్లీ:**2017లో ప్రారంభించిన జీఎస్టీలో ప్రాథమికంగా సాంకేతిక లోపాలు, గందరగోళం, రాజకీయ విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా రాష్ట్రాలకు చెల్లించే పరిహారంపై తీవ్ర దుమారమే రేగింది. కేంద్రం రాష్ట్రాల పన్ను వాటాను హరిస్తుందనే వాదనలొచ్చాయి. కానీ కాలక్రమేణా జీఎస్టీ వ్యవస్థ బలపడుతూ వారిని కట్టడి చేయగలిగింది. ?తాజాగా జీఎస్టీ నిర్మాణంపై కీలక సూచికలు పాజిటివ్‌గా స్పందిస్తున్నాయి. ఏటా నెలవారీ జీఎస్టీ వసూళ్లు పెరుగుతున్నాయి. పన్ను చెల్లింపుదారుల సంఖ్య 2018లో 1 కోటి(యాక్టివ్ రిజిస్ట్రేషన్స్) నుంచి 2025 నాటికి 1.5 కోట్లకు విస్తరించింది. ఈ-ఇన్వాయిసింగ్, ఈ-వే బిల్లులు, డిజిటల్ రిటర్న్ ఫైలింగ్స్.. వంటి వ్యవస్థల ద్వారా మద్దతు లభించింది.జీఎస్టీ శ్లాబుల హేతుబద్ధీకరణతో విస్తృతంగా వినియోగించే వస్తువులు, అవసరమైన సేవలపై భారాన్ని తగ్గించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. తద్వారా గృహాలకు ప్రత్యక్ష ఉపశమనం కలిగిస్తుంది. గృహ వినియోగ వ్యయ సర్వే అంచనాల ప్రకారం.. టాప్ 30 గృహ వినియోగ వస్తువులపై సాధారణ సగటు జీఎస్టీ రేటు 11% నుంచి 9%కి పడిపోయింది. ముఖ్యంగా పండుగ సీజన్‌కు ముందు ప్రభుత్వ నిర్ణయం పెద్ద ఉపశమనాన్ని కలిగించింది. అదే సమయంలో లగ్జరీ వస్తువులు, సిన్‌గూడ్స్, ప్రీమియం ఉత్పత్తులు ఉపయోగించే వర్గాలకు అధిక జీఎస్టీ రేట్లను విధించింది.రేట్ల తగ్గింపు ఆదాయ నష్టానికి, ద్రవ్యోల్బణానికి దారితీస్తుందని కొందరు విమర్శిస్తున్నారు. అయితే గృహాలు, నిత్యావసరాలపై తక్కువ పన్ను ఉండడంతో కొనుగోలు శక్తి పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అధిక వాల్యూమ్‌లు క్రియేట్ అవుతుండడంతో ద్రవ్యోల్బణం కూడా సానుకూలంగా ప్రభావితమయ్యే అవకాశం ఉంది. భారీగా వినియోగించే వస్తువులపై జీఎస్టీని తగ్గించడం ద్వారా రిటైల్ ధరల సూచిక సానుకూలంగా స్పందిస్తుందనే అభిప్రాయలున్నాయి. ఇదిలా ఉండగా, ప్రభుత్వ నిర్ణయం మెజారిటీ వర్గానికి మేలు చేసేదైనప్పటికీ కొన్నిచోట్ల రిటైలర్లు, దుకాణాదారులు ఇంకా కొత్త రేట్లను వినియోగదారులకు అందించడం లేదు. దీనిపై ప్రభుత్వ యంత్రాంగం వెంటనే స్పందించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని, నిత్యం తనిఖీలు నిర్వహించాలని నిపుణులు సూచిస్తున్నారు. దాంతోపాటు జీఎస్టీపై ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించే వ్యవస్థను పటిష్టపరచాలని చెబుతున్నారు.

# వేచి చూస్తే మనకే లాభం..



### ట్రంప్ నిర్ణయం వల్ల భారత్‌కే మేలు




**జనంసాక్షి:**హెచ్-1బీ వీసా రుసుమును పెంచుతూ ట్రంప్ తీసుకున్న నిర్ణయం తాత్కాలికంగా మనల్ని నిస్పృహకు గురి చేసినా... దీర్ఘ కాలంలో మేలు చేస్తుంది. నిజానికి మన 'ఆత్మనిర్భర్' నినాదానికీ, 'అమెరికాను మళ్ళీ గొప్ప దేశంగా చేయడ'మనే ట్రంప్ పిలుపునకూ మధ్య పెద్దగా తేడా ఏమీ లేదు.మరి దానిమీద మనం ఇంతగా స్పందించడం దేనికి? అమెరికా నిర్ణయం సుశిక్షితులైన, ప్రజ్ఞావంతులు, ప్రతిభావంతులు అయిన భారతీయ వృత్తినిపుణుల సంఖ్యను ఆ దేశంలో తగ్గిస్తుంది. కొత్తగా కాలుమోపబోయే వారి సంఖ్య పరిమితమవుతుంది. అమెరికాకు వెళ్ళడాన్ని నిరుత్సాహపరుస్తుంది. కానీ, ఆ కోవకు చెందినవారికి అమెరికాలో కొరత ఉందన్నది కూడా వాస్తవం. అమెరికా కోణం నుంచి చూస్తే అది న్యాయబద్ధమైనదే. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు గైకొనే హక్కు ట్రంప్‌కు ఉంది. దానిపై మన స్పందన తార్కికమైనదిగా ఉండాలి.భారతీయ పత్తి పరిశ్రమను 19వ శతాబ్దంలో బ్రిటిష్ పాలకులు నాశనం చేశారు. నేతపనివారినీ, పత్తి పరిశ్రమలో పనిచేస్తున్న చాలా మందినీ బ్రిటన్‌కు తీసుకెళ్ళారు. మాంచెస్టర్ రాత్రికి రాత్రి పత్తి మార్కెట్ కేంద్రంగా అవతరించింది. భారతీయుల్లో చాలా మంది దాన్ని న్యాయవిరుద్ధమైన చర్యగానే పరిగణించారు. ఇంగ్లండ్ ఒక కిలో పత్తిని కూడా ఎన్నడూ పండించకపోయినా, యూరప్‌లోనే వస్త్ర పరిశ్రమకు చాలా ముఖ్యమైన కేంద్రంగా మాంచెస్టర్ రూపుదిద్దుకుంది. నిపుణులైన కార్మికులను భారత్ నుంచి బలవంతంగా తీసుకెళ్ళిన కారణంగానే అది సాధ్యమైంది. వాస్తవానికి, ట్రంప్ ఇపుడు దానికి విరుద్ధమైన పని చేస్తున్నారు. సాంకేతిక నిపుణులను లేదా నిపుణులైన సిబ్బందిని తమ దేశం నుంచి పంపించేయాలని చూస్తున్నారు. అమెరికాకు రాకుండా నివారిస్తున్నారు. కానీ, మనవారిని తీసుకెళ్ళడం వల్ల బ్రిటిష్ వారు బాగు పడినంతగా, మనవారిని పంపించేయడం వల్ల అమెరికా లబ్ధి పొందబోవడం లేదు.ట్రంప్ నిర్ణయం ఆత్మనిర్భర్ భావనను మరింత బలంగా ముందుకు తీసుకెళ్ళేందుకు పురికొల్పినదవుతుంది. ఇందుకు మన ప్రభుత్వం సైన్స్, టెక్నాలజీ, నియంత్రణలపై దృష్టి పెట్టి కీలక రంగాల్లో సత్వర సంస్కరణలు తీసుకురావాలి. సర్వవిధాలా ప్రతిభావంతులను ఆకర్షించి, అండగా నిలిచి, నిలబెట్టుకుని ప్రోత్సహించే సరైన పర్యావరణ వ్యవస్థను సృష్టించాలి. విశ్వవిద్యాలయాలను పటిష్ఠపరచాలి. హెచ్-1బీతో ట్రంప్ తాజా దాడి, ఐఐటీలు, ఐఐఎస్‌సీలు తదితర ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి తాజా గ్రాడ్యుయేట్లు తండోపతండాలుగా అమెరికాకు తరలిపోకుండా తగ్గించడానికి, ఇంకా చెప్పాలంటే ఆగిపోవడానికి కూడా తోడ్పడవచ్చు.అత్యంత ప్రతిభావంతులైన వృత్తినిపుణులను భారతదేశంలోనే అట్టిపెట్టుకునేందుకు, వారు భారతీయ ప్రయోజనాలకు ఉపయోగపడేటట్లు చేసుకునేందుకు ఇది స్పష్టంగా నిజమైన అవకాశం కల్పిస్తోంది. విద్యార్థుల చదువు, శిక్షణలకు ప్రతి ఐఐటీ పైనా భారత్ రూ.1000 కోట్లకు పైగా వెచ్చిస్తోంది. కానీ, వాటి నుంచి దేశం పూర్తి ఫలాలను నిజంగానే పొందడం లేదు. అమెరికా, యూరప్‌లకు చెందిన అనేక సంస్థల సీఈఓలుగా మన ఐఐటీ మెరికలు పని చేస్తూంటే వారి పేర్లు, పాత్రలను గొప్పగా చెప్పుకుంటూ గర్విస్తున్నాం. భారతీయుల ఆలోచనా శక్తి, వారసత్వం, ప్రజ్ఞాపాటవాలను ప్రపంచంలోని మిగిలిన దేశాలకు వినమ్రంగా, బలంగా, ఆత్మ విశ్వాసంతో చాటి చెప్పేందుకు, నిరూపించుకునేందుకు సమయం ఆసన్నమైంది.

### అరెస్టు భయంతో నెతన్యాహు

## ఏం చేశారంటే..!




**వాషింగ్టన్:**ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహు చేసిన పని ఇప్పుడు ఆసక్తికర చర్చకు దారి తీసింది. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేందుకు ఆయన న్యూయార్క్ వెళ్లారు.అయితే ప్రయాణంలో ఆయన యూరప్ గగనగలం కాకుండా.. సుదీర్ఘ మార్గంలో ప్రయాణించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.గాజా యుద్ధ నేపథ్యంతో.. అంతర్జాతీయ న్యాయస్థానం నెతన్యాహుపై అరెస్ట్ వారెంట్ జారీ చేసిన సంగతి తెలిసిందే. యుద్ధ నేరాలకు పాల్పడ్డ ఆయన్ను అవకాశం దొరికితే అరెస్ట్ చేయొచ్చని అందులో సభ్యత్వం ఉన్న 125 దేశాలకు ఇంటర్నేషనల్ కోర్టు సూచించింది. దీంతో ఐక్యరాజ్య సమితి సమావేశాలకు హాజరు కావాల్సిన ఆయన యూరప్ దేశాల మీదుగా కాకుండా.. మరో మార్గంలో వెళ్లారనే చర్చ నడుస్తోంది.ఫ్లైట్ ట్రాకింగ్ డాటా ప్రకారం.. ఆయన అధికారిక విమానం 'వింగ్స్ ఆఫ్ జియాన్' మధ్యధరా సముద్రం, జిబ్రాల్టర్ ద్వారం.. అట్లాంటిక్ మీదుగా న్యూయార్క్‌కు చేరుకుంది. ఈ క్రమంలో.. ఫ్రాన్స్, ఇటలీ, గ్రీస్ ఎయిర్‌స్పేస్‌ను తప్పించుకున్నట్లైంది. అయితే ఈ రూట్‌లో వెళ్లడం ద్వారా ఆయన అదనంగా 600 కిలోమీటర్లు ప్రయాణించారని సమాచారం.ఇదిలా ఉంటే కిందటి ఏడాది కూడా ఆయన ఐక్యరాజ్య సమితి సాధారణ అసెంబ్లీకి హాజరయ్యారు. అయితే అప్పటికి నెతన్యాహుపై వారెంట్ జారీ కాలేదు. కానీ, ఆయన ప్రసంగిస్తున్న సమయంలో పలు దేశాల ప్రతినిధులు లేచి వెళ్లిపోవడం అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఇక అంతర్జాతీయ న్యాయస్థానం కిందటి ఏడాది నవంబర్‌లో నెతన్యాహు, మాజీ రక్షణ మంత్రి యోవ్ గాలంట్‌లను యుద్ధనేరస్తులుగా పేర్కొంటూ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. అయితే ఈ అభియోగాలను ఇజ్రాయెల్ తీవ్రంగా ఖండించింది.

## త్వరలోనే అమెరికాతో వాణిజ్య ఒప్పందం

వివిధ అంశాలపై భారత ప్రతినిధి బృందం అమెరికా ప్రభుత్వంతో నిర్మాణాత్మక సమావేశాలు నిర్వహించినట్లు వాణిజ్య శాఖ వెల్లడించింది. అగ్రరాజ్యం సైతం భారత్‌లో తమ వ్యాపార కార్యకలాపాలను మరింత పెంచుకోవాలనే ఆలోచనను వ్యక్తం చేసినట్లు తెలిపింది. భారత్‌తో టారిఫ్ చర్చలు గొప్పగా జరుగుతున్నాయని అమెరికా వాణిజ్య కార్యదర్శి హొవార్డ్ లుట్నిక్ తెలిపారు. ఇరుదేశాలు సమష్టిగా ప్రయోజనాలను గుర్తించాయన్నారు. మరోవైపు అక్టోబరులో మలేసియా వేదికగా జరగనున్న ఆసియాన్ శిఖరాగ్ర సమావేశానికి కి ప్రధాని మోదీ, ట్రంప్ హాజరవ్వనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సదస్సుకు అనుబంధంగా జరగనున్న మోదీ-ట్రంప్ మధ్య ద్వైపాక్షిక భేటీలో వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన విషయాలపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రష్యా చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై ట్రంప్ 50శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. దానిపై ఇరుదేశాల మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయి. ఈ పరిణామాల వేళ ట్రంప్ తాజాగా ఫార్మా ఉత్పత్తులపై టారిఫ్‌లు విధించారు. దీంతో పరిస్థితులు మరింత గందరగోళంగా మారాయి. అమెరికాలో ఉపయోగించే జనరిక్ ఔషధాల్లో 45శాతం, బయోసిమిలర్ ఔషధాల్లో 15శాతం భారత్ సరఫరా చేసినవే.

## మస్క్ కుమార్తె వద్ద డబ్బు లేదంటా..!

### ఎవరి సాయం అవసరం లేదంటున్న వివియన్ జెన్నా విల్సన్




**వాషింగ్టన్:**ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడి కుమార్తె అంటే వెంటనే గుర్తొచ్చేది.. ఆమె విలాసాలు, లగ్జరీ కార్లు, హంగులు, ఆర్భాటాలు, పార్టీలు.. కానీ అలాంటివేవీ లేకుండా ముగ్గురు స్నేహితులతో ఓ చిన్న అపార్ట్‌మెంట్‌లో కాలం వెళ్లదీస్తున్నారు వివియన్ జెన్నా విల్సన్.ప్రపంచ కుబేరుడు, టెస్లా, స్పేస్‌ఎక్స్ సీఈఓ ఎలాన్‌మస్క్ కుమార్తె జెన్నా విల్సన్ (జేవియర్ మస్క్) ఇటీవల న్యూయార్క్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు పంచుకున్నారు .ఇంటర్వ్యూలో జెన్నా విల్సన్(21) తెలిపిన వివరాల ప్రకారం..'నా వద్ద వందలు, వేల డాలర్లు లేవు. లాస్ ఏంజిల్స్‌లోని ఒక షేరింగ్ అపార్ట్‌మెంట్‌లో ముగ్గురు రూమ్‌మేట్స్‌తో ఉంటున్నాను. ఈ పరిస్థితులను నేను భరించగలను. నాకు జన్మనిచ్చిన తండ్రితో ఏ విధంగానూ సంబంధం కలిగి ఉండటానికి ఇష్టపడను' అని చెప్పుకొచ్చారు. విల్సన్ 16 ఏళ్ల వయస్సులో ట్రాన్స్‌జెండర్‌గా ఇంట్లో నుంచి బయటకు వచ్చేసింది. 2022లో చట్టబద్ధంగా తన పేరును, జెండర్‌ను మార్చుకుంది. ఈ సందర్భంగా కోర్టు ద్వారా తన తండ్రితో బహిరంగంగా సంబంధాలు తెంచుకుంటున్నట్లు ప్రకటించింది. అప్పటి నుంచి కుటుంబానికి దూరంగానే ఉంటోంది. కోర్టు ద్వారా తండ్రి, కుటుంబం నుంచి విడిపోతున్న సమయంలో మస్క్ నుంచి లభించే ప్రత్యక్ష ఆర్థిక సహాయాన్ని ఆమె తిరస్కరించారు. తనను తాను పోషించుకోవడానికి సరళంగా జీవించేందుకు ఎవరి సహాయం అవసరం లేదని తేల్చిచెప్పారు. మస్క్ భార్యలకు పుట్టినవారిలో వివియన్ తొలి సంతానం.

# కలెక్టరేట్‌లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబురాలు





- కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, కలెక్టర్, సీ.పీ

**నిజామాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శుక్రవారం బతుకమ్మ సంబురాలు అంబరాన్ని అంటాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ వేడుకకు అట్టహాసపు ఏర్పాట్లు చేశారు. శాసన సభ్యులు డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి, దన్పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి తదితరులతో పాటు యావత్ జిల్లా యంత్రాంగం భాగస్వాములైన ఈ వేడుకతో కలెక్టరేట్ ప్రాంగణం సరికొత్త శోభతో ఉట్టిపడింది. రంగు రంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను ఒక చోటకు చేర్చి, గౌరీ మాతను స్తుతిస్తూ మహిళలు లయబద్ధంగా చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ మహిళలు ఆలపించిన గేయాల బతుకమ్మ ప్రాశస్త్యాన్ని చాటి చెప్పాయి. ప్రకృతిని ఆరాధించే ఈ వేడుక ఔన్నత్యం ఆవిష్కృతం అయ్యేలా, అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది అనే తేడా లేకుండా మహిళా ఉద్యోగులు, ఐకేపీ, మెప్మా మహిళా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని బతుకమ్మ వేడుకకు వన్నెలద్దారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఎంతో ఉత్సాహంగా ఆడిపాడారు. ఎమ్మెల్యేలు, కలెక్టర్, సీ.పీ గౌరీమాతకు సాంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో అందంగా అలంకరించిన బతుకమ్మలు కనువిందు చేస్తూ, పూల పండుగ ప్రాధాన్యతను ఇనుమడింపజేశాయి. సాయంత్రం 3.30 గంటల నుండి రాత్రి వరకు కూడా ఏమాత్రం అలసట చెందకుండా మహిళలు ఎంతో హుషారుగా బతుకమ్మ ఆడుతూ, తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. దేదీప్యమానమైన విద్యుత్ దీపాల వెలుగులలో, అందంగా అలంకరించుకుని నూతన దుస్తుల్లో బతుకమ్మలతో తరలి వచ్చిన అతివలతో కలెక్టరేట్ ప్రాంగణం అంతా సరికొత్త శోభను సంతరించుకుని అందమైన దృశ్యాన్ని ఆవిష్కరింపజేసింది. దాండియా, కోలాటాలు, బతుకమ్మ ఆటపాటలతో ఎటు చూసినా సందడి వాతావరణం కనిపించింది. ఈ వేడుకలకు విచ్చేసి విజయవంతం చేసిన ప్రజాప్రతినిధులకు, మహిళలకు జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకలలో అన్ని శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.





# ఇందిరమ్మ ఇండ్లకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం

- లబ్ధిదారులనడిగి తెలుసుకున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- ఎల్లారెడ్డిపేట మండలంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించిన కలెక్టర్
- పోటీ పరీక్షలకు విద్యార్థులు సిద్ధమవ్వాలి
- తరగతి గదుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

**ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకం కింద లబ్ధిదారులకు నాలుగు విడతల్లో ఆర్థిక సహాయం అందజేస్తామని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో కోనేటి రాజవ్వ, శ్రీరామోజు భాగలక్ష్మి, సిరిసిల్ల మంజుల, గోషిక తార, దోమల లత, రాచర్ల గుండారంలో బోయిని మణేవ్వ, గరిగే శ్రీలత, సిద్దాల అఖిల ల ఇండ్ల నిర్మాణాలు స్లాబ్ దశకు చేరుకోగా, కలెక్టర్ శుక్రవారం వీటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి, వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయిన నిధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద లబ్ధిదారులకు 5 లక్షల రూపాయలు నాలుగు దశల్లో గ్రీన్ చానల్ ద్వారా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని వివరించారు. బేస్‌మెంట్ పూర్తయితే లక్ష రూపాయలు, గోడల నిర్మాణం తర్వాత లక్ష రూపాయలు, స్లాబ్ పూర్తయిన తర్వాత 2 లక్షల రూపాయలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయలు జమ అవుతాయని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు త్వరితగతి న ఇండ్ల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. రాచర్ల గుండారం, రాచర్ల తిమ్మాపూర్ మధ్య రహదారి తాత్కాలికంగా దెబ్బతినడంతో సిసి రోడ్డు మంజూరు చేయాలని ఎంపీడీఓ సత్తయ్యకు కలెక్టర్ ఆదేశించారు.

ఎల్లారెడ్డిపేట మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పేరెంట్-టీచర్ మీటింగ్‌లో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇంటర్మీడియట్ దశ ప్రతి విద్యార్థికి కీలకమని, పదో తరగతి తర్వాత సబ్జెక్టుల పరిధి పెరుగుతుందని వివరించారు. విద్యార్థులు తాము ఎంచుకున్న గ్రూప్‌లకు సంబంధించి అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించాలని, పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. కళాశాల లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలని, డాక్టర్, ఇంజనీర్‌తో పాటు లాయర్, ఆర్కిటెక్ట్, టీచర్, బిజినెస్ వంటి రంగాల్లో అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ నుంచే సమయాన్ని సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదువుకోవాలని, తల్లిదండ్రులు పిల్లల చదువుపై దృష్టి పెట్టాలని కోరారు. కళాశాలలోని సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. విద్యార్థులు, తల్లిదండ్రులు శిథిలావస్థలో ఉన్న తరగతి గదులు, ఆర్టీసీ బస్ స్టాప్ సౌకర్యం వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, డెస్క్‌లు, డిజిటల్ బోర్డులు, శిథిల గదుల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపిస్తామని, త్వరలో నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. నారాయణపూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్మాణంలో ఉన్న తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. తుది దశ పనులైన కరెంట్ వైరింగ్, పెయింటింగ్‌ను సెలవులు ముగిసేలోగా పూర్తి చేసి, తరగతి గదులను వినియోగంలోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశించారు. పాఠశాలలో మంజూరైన బోరును పరిశీలించి, గడ్డి, పిచ్చి మొక్కలను శుభ్రం చేయాలని ఎంపీడీఓ సత్తయ్యకు సూచించారు. కలెక్టర్ వెంట ఎల్లారెడ్డిపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సబేరా బేగం, తహసీల్దార్ సుజాత, ఎంపీడీఓ సత్తయ్య, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, హౌసింగ్ పీడీ శంకర్, సంబంధిత అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## దేవకీ వాసు దేవ్ రావుకి ఘన స్వాగతం పలికిన ఆర్యవైశ్య బిజెపి నేతలు

**కరీంనగర్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి):** బీజేపీ రాష్ట్ర కోశాధికారిగా బాధ్యతలు చేపట్టి తొలిసారి కరీంనగర్ కు విచ్చేసిన దేవకీ వాసు దేవ్ రావు కి కరీంనగర్ ఆర్యవైశ్య బిజెపి నేతలు ఘన స్వాగతం పలికారు. కరీంనగర్‌లోని వాసవి కన్యాకాపరమేశ్వరి ఆలయం లో దేవకీ వాసు దేవ్ రావు ఆర్యవైశ్య నేతలందరూ శుభాకాంక్షలు తెలిపి ఆయనను ఘనంగా సన్మానించారు. కరీంనగర్ వైశ్య బీజేపీ నేతలు, వైశ్య సంఘ నాయకులు కన్న కృష్ణ , వాసవి మాత టెంపుల్ చైర్మన్ చిట్టుమల్ల శ్రీనివాస్, పట్టణ ఆర్యవైశ్య సంఘం ట్రెజరర్ సుద్దాల వెంకటేష్ , కొలిపాక శ్రీనివాస్, కాచం రాజేశ్వర్, నవీ, రాచమళ్ళ భద్రయ్య, నాగరాజు, వేణు,జీడిగే సాయి, బోడ్ల శ్రీ రాములు, లక్ష్మణ్, జిల్లా జగదీశ్వర్, అజయ్ రామ్, పైడ రవి తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఏఎంసీ చైర్మన్

**రుద్రంగి (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద శుక్రవారం మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి చేతుల మీదుగా దాదాపు 68 వేల రూపాయల విలువగల 18 మంది లబ్ధి దారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కుల ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ తిరుపతి మాట్లాడుతూ... ప్రజా ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమములో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ జెడ్పిటిసి గట్ల మీనయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, తర్రె మనోహర్ ఉన్నారు.

# విజిబుల్ పోలీసింగ్‌లో కీలక అడుగు





### మహిళా బ్లూ కోల్ట్స్ పోలీసుల సేవలు ప్రారంభం

**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో, పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం శుక్రవారం రోజు మహిళా బ్లూ కోల్ట్స్ పోలీసుల సేవలను లాంఛనంగా ప్రారంభించారు. మహిళా పోలీసుల భాగస్వామ్యాన్ని పెంచే ముఖ్య ఉద్దేశ్యంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో, పోలీసు కమీషనర్ జెండా ఊపి బ్లూ కోల్ట్స్ విధులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన మహిళా పోలీసులకు ప్రభుత్వ స్కూటీలను అందజేశారు. పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణలో మహిళా పోలీసుల పాత్ర అత్యంత కీలకంగా మారుతోందని తెలిపారు. వీరు బ్లూ కోల్ట్స్ సేవల్లో భాగస్వామ్యం కావడం ద్వారా, వారు బీట్ పెట్రోలింగ్, వాహన తనిఖీలు, డయల్ 100 కాల్స్ అటెండ్ చేయడం వంటి విధులను మరింత వేగంగా,సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కరీంనగర్ కమీషనరేట్ వ్యాప్తంగా త్వరలోనే అన్ని ప్రాంతాలలో మహిళా బ్లూ కోల్ట్స్ పోలీసుల సేవలు అందుబాటులోకి రానున్నాయని సీపీ వెల్లడించారు. మహిళల భద్రతకు, ప్రజలకు మరింత చేరువగా పోలీసులు ఉండటానికి ఈ సేవలు ఎంతగానో ఉపయోగపడతా యని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

### కరీంనగర్ పోలీసు కమీషనరేట్ కార్యాలయంలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

తెలంగాణ వీర వనిత, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు కరీంనగర్ పోలీసు కమీషనరేట్ కార్యాలయములో గురువారం రోజు ఘనంగా నిర్వహించారు. కరీంనగర్ పోలీసు కమీషనర్ గౌష్ ఆలం, కమీషనరేట్ కేంద్రంలోని అస్త్ర కన్వెన్షన్ హాలు లో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భముగా సీపీ మాట్లాడుతూ... నిరంకుశంగా వ్యవహరించిన రజాకార్లకు, జమీందార్లకు, దొరలకు వ్యతిరేఖంగా మొక్కవోని ధైర్యంతో ఐలమ్మ ఎదిరించిన తీరు అందరికీ ఆదర్శమని ఆమె చేసిన పోరాటాలను కొనియాడారు. ఆమె చేసిన భూపోరాట ఉద్యమమే తెలంగాణ సాయుధ పోరాటానికి స్ఫూర్తి అని అన్నారు. మహిళా చైతన్యానికి, ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ (పరిపాలన), భీంరావు (ఏ.ఆర్.), ఏసీపీలు మాధవి, యాదగిరిస్వామి ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలేడ్‌లో ఘనంగా జీవనోపాధి అవగాహన కార్యక్రమం



**కొడంగల్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** కొడంగల్ మండలం ఆలేడ్ గ్రామంలో సమ్మిలిత జీవనోపాధుల కార్యక్రమం ఆధ్వర్యంలో ప్రోగ్రాం పార్టిసిపేంట్ సభ్యులకు వివిధ జీవనోపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆరోగ్యకరమైన జీవన విధానం, సేంద్రీయ వ్యవసాయం, పాడి పశుసంపద, గొర్రెల పెంపకం, కూరగాయల సాగు, చిన్న తరహా వ్యాపారాలపై విస్తృతంగా చర్చించారు. ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవడం చాలా ముఖ్యమని, ఆకుకూరలు, కాయగూరలు, పండ్లను ఆహారంలో భాగం చేసుకోవాలని నిపుణులు సూచించారు. పెరటి తోటల్లో సేంద్రీయ పద్ధతిలో కూరగాయలు సాగు చేయడం ద్వారా తాజా, రసాయన రహిత ఆహారం అందుబాటులోకి వస్తుందని, ఇది ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని వివరించారు. పాడి పశువుల సంరక్షణ, సేంద్రీయ వ్యవసాయం ద్వారా ఉత్పత్తి అయ్యే ఆకుకూరలు, కాయగూరలను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులతో ఉపాధి అవకాశాలపై సమగ్ర చర్చ జరిగింది. పాడి పశుసంపద, పెరటి కోళ్ల పెంపకం, గొర్రెల పెంపకం, కూరగాయల సాగు, పెట్టీ షాపులు, పిండి గిర్నీలు వంటి చిన్న తరహా వ్యాపారాల గురించి విశ్లేషించారు. గ్రామంలోని భౌగోళిక, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఈ వ్యాపారాలు లాభదాయకంగా ఉంటాయని నిపుణులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం గ్రామీణ ఆర్థికాభివృద్ధికి, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను సృష్టించడానికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో (TGILP) SPM ఆఫీసర్లు జయరాం, భవ్య, రమేష్, రవి పాల్గొన్నారు.



## జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైన పారమిత హెరిటేజ్ విద్యార్థి

**కరీంనగర్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** ఈ నెల 27 నుంచి 29 వరకు జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ పట్టణంలోని నిజాం కాలేజ్ లో అండర్ 12 విభాగంలో జరగనున్న 17వ జాతీయ స్థాయి మినీ బాల బాలికల హండ్ బాల్ ఛాంపియన్షిప్ పోటీలకు కరీంనగర్ పట్టణంలోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి ఎ.హాస్య పటేల్ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ బాలికల ఎంపిక పోటీలలో అత్యంత ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జాతీయ స్టాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని పారమిత విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాద్‌రావు, డైరెక్టర్స్ ప్రసూన, అనుకర్ రావు, రశ్మిత, రాకేష్, వి.యు.మం ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు గోపీ కృష్ణ, సమన్వయకర్తలు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.అమరేందర్, ఎస్.రాజు అభినందించారు.

## ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



**మేడిపల్లి, సెప్టెంబర్ 26(జనంసాక్షి):** మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో వీరనారి చాకలి ఐలమ్మ 130 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం ఆత్మగౌరవం సమానత్వం కోసం పోరాడిన చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఐలమ్మ పోరాట స్ఫూర్తిని పుణికి పుచ్చుకుని నేటి తరం యువత అన్ని రంగాలలో రాణించాలని పలువురు వారి యొక్క అభిప్రాయాలు వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రక్రియలో పూర్తి బాధ్యతాయుతంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

**సదాశివనగర్ :** సదాశివనగర్ ఎన్నికల ప్రక్రియలో పూర్తి బాధ్యతాయుతంగా ఉండాలనీ కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోనీ ఆదర్శ పాఠశాలలో జరుగుచున్న ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించడం జరిగింది. శిక్షణ కార్యక్రమం ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరగాలంటే పూర్తి అవగాహన ఉండాలని శిక్షణ కార్యక్రమం సద్వినియోగం చేసుకొని సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఎన్నికల ప్రక్రియలో పూర్తి బాధ్యతాయు తంగా ఉండాలని పొరపాట్లు జరుగుతే చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి మురళి, జిల్లా పరిషత్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమేష్ బాబు, డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఎంపీడీవో సంతోష్ కుమార్, తాసిల్దార్ సత్యనారాయణ, మండల విద్యాధికారి యోసఫ్, మండల పంచాయతీ అధికారి సురేందర్, మాస్టర్ శిక్షకులు పాల్గొన్నారు.

# “స్థానిక” ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ




**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** నిబంధనలు పాటిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కు హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ... ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమన్నా రు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని అన్నారు. అన్ని అంశాలపై అవగాహన పెంచుకొని అధికారులు, సిబ్బంది సమన్వయం తో ముందుకు సాగాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఏవైనా అనుమానాలు, ఇబ్బందులు ఉంటే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకురావా లని సూచించారు. ఓటర్లకు ఇబ్బంది రాకుండా పోలింగ్ కేంద్రాల వద్ద సరిపడా స్ట్రాంగ్ రూములు, బ్యాలెట్ బాక్సులు, తాగునీరు, మరుగుదొడ్లు, వీల్ చైర్లు తదితర సౌకర్యాలతో పాటు ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికల వేళ పొరపాట్లకు తావివ్వకుండా ప్రతిక్షణం అప్రమత్తంగా ఉంటూ పారదర్శకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. హ్యాండ్ బుక్ లో ఉన్న నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, సందేహాలు నివృత్తి చేసుకొని ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా కృషి చేయాలన్నారు. చెక్ లిస్ట్ తయారు చేసుకుని నిబద్ధతతో పనిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో, మాస్టర్ ట్రైనర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాలను సందర్శించిన మంత్రి శ్రీధర్ బాబు

**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శుక్రవారం దైవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో పలు దేవాలయాలను సందర్శించారు. మొదటగా మహాలక్ష్మి దేవాలయంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని తొమ్మిది రోజులపాటు నిరోధికంగా జరుగుతున్న భజన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు మారుపాక ప్రశాంత్, ఆలయ సేవకులు అవధానుల శ్రీనివాస్, మారుపాక నటరాజ్ లు మంత్రిని శాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం శ్రీ లలితా దేవి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆలయంలో నిర్వహించిన హోమగుండం కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం శ్రీ సీతారామ సేవాసదన%శ్రీ% అధ్యక్షులు కర్నే హరిబాబు, నిర్వాహకులు నల్లగొండ హరి, దుద్దిళ్ల గణపతి, కొల్లారపు శ్రీనివాస్, ఆలయ అర్చకులు పల్లి మురళీధర్ మంత్రిని సన్మానించారు. అనంతరం శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో సాయిబాబా దర్శించుకొన్న అనంతరం ఆలయ అర్చకులు రామడుగు సాయి శ్రీనివాస్, ఆలయ కమిటీ అధ్యక్షురాలు మహావాది జలజ సత్యనారాయణ, ఉపాధ్యక్షులు మనకంటి మురళీధర్ మంత్రిని సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. మంథనిలో దైవ కార్యక్రమాలు సంప్రదాయ బద్ధంగా నిర్వహించడం ఆనందం కలిగిస్తుందని ఈ కార్యక్రమా ల్లో




పాల్గొనడం ఎంతో తృప్తినిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా, సుఖశాంతులతో జీవించాలని కోరుకున్నారు. ప్రజల సంక్షేమం కోసం కృషి చేయడం తన ధర్మం అన్నారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఐలి ప్రసాద్, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మంథని మాజీ సర్పంచ్ వోడ్నాల శ్రీనివాస్, రెడ్డి సంఘం అధ్యక్షుడు ముస్కుల సురేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, మున్సిపల్ మాజీ చైర్మన్ పెండ్రి రమాదేవి సురేష్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి మూల సరోజన పురుషోత్తం రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శశి భూషణ్ కాచే, బండ కిషోర్ రెడ్డి, పెంటరి రాజు, చొప్పకట్ల హనుమంతరావు, ఎక్కేటి అనంతరెడ్డి, ఆకుల కిరణ్, ఆరెల్లి కిరణ్, రావికంటి సతీష్ కుమార్, ఎల్లంకి సదానందం తదితరులు ఉన్నారు.

# స్థానిక ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**



**జగిత్యాల బ్యూరో సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ నిబంధనలు పాటిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహిం చాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం మెట్టుపెల్లి పట్టణం లో ఏర్పాటు చేసిన జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని అన్నారు. అన్ని అంశాలపై అవగాహన పెంచుకొని అధికారులు, సిబ్బంది సమన్వయం తో ముందుకు సాగాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఏవైనా అనుమానాలు, ఇబ్బందులు ఉంటే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకురా వాలని సూచించారు. ఓటర్లకు ఇబ్బంది రాకుండా పోలింగ్ కేంద్రాల వద్ద సరిపడా స్ట్రాంగ్ రూములు, బ్యాలెట్ బాక్సులు, తాగునీరు, మరుగుదొడ్లు, వీల్ చైర్లు తదితర సౌకర్యాలతో పాటు ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికల వేళ పొరపాట్లకు తావివ్వ కుండా ప్రతి క్షణం అప్రమత్తంగా ఉంటూ పారదర్శకంగా వ్యవహరి ంచాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజా గౌడ్ మాట్లాడుతూ హ్యాండ్ బుక్‌లో ఉన్న నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. సందేహాలు నివృత్తి చేసుకొని ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా కృషి చేయాలన్నారు. చెక్ లిస్ట్ తయారు చేసుకుని నిబద్ధతతో పనిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో, మాస్టర్ ట్రైనర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# షుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది!

- రైతులతో చెరుకు ఫ్యాక్టరీ కమిటీ సభ్యుల ముఖాముఖి కార్యక్రమం : మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- హాజరైన ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



**కోరుట్ల సెప్టెంబర్ 26(జనం సాక్షి):** షుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం వేంపేట్ గ్రామంలో షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ కమిటీ రైతులతో ముఖాముఖి చర్చ కార్యక్రమం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, కోరుట్ల కాంగ్రెస్ ఇన్చార్జి జువ్వాడి నర్సింగరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులున్నా ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కట్టుబడి ఉందని, బ్యాంక్ లకు డబ్బులు చెల్లించి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందని పేర్కొన్నారు. రైతులకు మద్దతు ధర, సీడ్, హార్వెస్టింగ్ అంశాల్లో ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. రైతులకు చెరుకు సాగులో ఎదురయ్యే సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. చెరుకు సాగు రైతులకు లాభసాటిగా ఉంటుందని, ఫ్యాక్టరీని విజయవంతంగా ప్రారంభించుకుంటామని అన్నారు. బ్యాంక్ లకు ప్రభుత్వం రూ.176 కోట్లు చెల్లించిందని, 20వేల ఎకరాల్లో చెరుకు పంటను రైతులు సాగు చేస్తారని అన్నారు. అనంతరం కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ.. ఫ్యాక్టరీ ప్రారంభానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని, చెరుకు రైతులకు సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం రైతుల హార్వెస్టింగ్ సీడ్ సమస్యలను పరిగణలోకి తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి రఘునందన్ రావు, ఇండస్ట్రియల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ పాల్గొన్నారు.

# మద్యం దుకాణాలకు రిజర్వేషన్లు ఖరారు

## నేడు నోటిఫికేషన్ విడుదల : ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి.శ్రీనివాస్ రావు



**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** జిల్లాలో మద్యం దుకాణాల నిర్వహణకు రిజర్వేషన్లు ఖరారైనట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి.శ్రీనివాస్ రావు తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ పూర్తయింది. జిల్లాలో మొత్తం 94 మద్యం దుకాణాలకు గాను 17 దుకాణాలు గీత కార్మికులకు, 9 మద్యం దుకాణాలు ఎస్సీ కేటగిరీకి రిజర్వ్ చేశారు. 94 దుకాణాల్లో ఏయే దుకాణాలు గీత కార్మికులకు, ఎస్సీలకు రిజర్వ్ చేయాలో డ్రా పద్ధతి ద్వారా ఎంపిక చేశారు.జిల్లాలో మద్యం దుకాణాల నిర్వహణదారుల ప్రస్తుత కాలపరిమితి ఈ ఏడాది నవంబర్ 30 న ముగియనుంది. డిసెంబరు 1, 2025 నూతన టెండర్లు దారులను ఖరారు చేసేందుకు శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రిజర్వేషన్ ప్రక్రియ పూర్తి చేశారు.ఈ నెల 26వ తేదీన టెండర్ నోటిఫికేషన్, అప్లికేషన్లు స్వీకరించనున్నారు.టెండర్ లో పాల్గొనేందుకు మూడు లక్షలు నాన్ రిఫండబుల్ అమౌంట్ డిపాజిట్ చేయాలన్నారు. 50 లక్షల రూపాయలు టెండర్ కి సంబంధించి 11 షాపులు 55 లక్షలకు టెండర్స్ సంబంధించిన 40 షాపులు 65 లక్షల టెండర్ కి సంబంధించి 43 షాపులు వేలంపాటలో ఉన్నాయన్నారు. అర్బన్ 21 రూరల్ 26 తిమ్మాపూర్ 14 జమ్మికుంట 16 హుజరాబాద్ 17 మద్యం దుకాణాలకు టెండర్లు నిర్వహిస్తామన్నారు. అప్లికేషన్లు ఇచ్చేందుకు ఆఖరి గడువు వచ్చే నెల(అక్టోబర్) 18వ తేదీ కాగా, వచ్చే నెల 23వ తేదీన దుకాణాల లైసెన్స్ కేటాయించేందుకు డ్రా తీయనున్నారు. డిసెంబర్ 01 వ తేదీ నుంచి నూతన లైసెన్సులతో మద్యం దుకాణాలు కొనసాగనున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి.శ్రీనివాసరావు సిఐలు జి. రాము ఎస్.అశోక్, ఎస్. బాబా, ఎస్ఐలు మహమ్మద్ ఇషాఖ్ పాషా, విజయ్ ఎక్సైజ్ సిబ్బంది అనిల్, సాయి కృష్ణ పాల్గొన్నారు.

# ఎర్రకుంట నాలాను పునరుద్ధరిస్తున్న హైడ్రా



**హైదరాబాద్, (జనం సాక్షి) :** రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం తొర్రూర్ గ్రామంలో ఎర్రకుంట చెరువు నాలాను హైడ్రా పునరుద్ధరిస్తోంది. ఎర్రకుంట నుంచి పొల్కం కుంటకు వెళ్లే నాలాతో పాటు చెరువు అలుగును కూడా మూసేశారంటూ హైడ్రా ప్రజావాణిలో స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుల మేరకు సంబంధిత శాఖల అధికారులతో క్షేత్ర స్థాయిలో విచారించిన అనంతరం నాలాను పునరుద్ధరించేందుకు హైడ్రా చర్యలు తీసుకుంది. శుక్రవారం నాలాను పునరుద్ధరిస్తోంది. చెరువు అలుగుకు నాలాకు అనుసంధానం చేయడానికి మధ్యలో 10 మీటర్ల మేర బండ రాయి ఉండడంతో దానిని తొలగించి అనుసంధానం చేస్తామని హైడ్రా అధికారులు తెలిపారు. మొత్తం 300ల మీటర్ల మేర నాలాను పునరుద్ధరిస్తే ఈ రెండు చెరువుల అనుసంధానం పూర్తి అవుతుందన్నారు.

## పిఓలకు ఎన్నికల శిక్షణ

**నాగిరెడ్డిపేట్,సెప్టెంబర్ 26 జనం సాక్షి :** పీఓలకు ఎన్నికల శిక్షణకు సంబంధించిన బుక్ లెట్స్ ఇచ్చి ప్రసీదులు తీసుకోవాలని ఎంపీడీవో లలిత కుమారి తెలిపారు.శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో లలిత కుమారి పిఓలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ లలిత కుమారి మాట్లాడుతూ మొదటి శిక్షణకు వచ్చే పీఓలు అందరూ మన మండలంలోని పని చేసేవారు ఉండాలని రెండో శిక్షణలో వేరే మండలంకు వెళ్తారని,అక్కడ మళ్ళీ బుక్ లెట్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు.

# తెలంగాణ బహుజనుల ఆత్మగౌరవ, సమానత్వ పోరాట స్ఫూర్తి ప్రదాత చాకలి ఐలమ్మ

- చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 26(జనంసాక్షి):** తెలంగాణ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్‌లో శుక్రవారం రోజు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. “చాకలి ఐలమ్మ పోరాటం భూమి కోసమే కాదు. నిజాం పాలనలో మహిళలు, రైతులు, బహుజనులు ఎదుర్కొన్న అంతులేని వివక్షను ఎదురించిన వీరనారి. తెలంగాణ బహుజనుల ఆత్మగౌరవ, సమానత్వ పోరాటాల స్ఫూర్తి ప్రదాత చాకలి ఐలమ్మ” అని అభివర్ణించారు. “అరెస్టులు, జైలు జీవితాన్ని అనుభవించినప్పటికీ నిజాం బానిసత్వానికి తలొగ్గకుండా సాగుచేసిన భూమిపై హక్కుల కోసం రైతులతో కలిసి ముందుండి పోరాటం చేసిన వీర వనిత చాకలి ఐలమ్మ జయంతిని జరుపుకోవడమంటే తెలంగాణ రైతాంగ, బహుజనుల, మహిళల ఆత్మగౌరవ పోరాటాన్ని భావి తరాలకు తెలియజేయడమేనని పేర్కొన్నారు.



**వీరనారి.. చాకలి ఐలమ్మకు ఘన నివాళి**

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి.**

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి.. చాకలి ఐలమ్మ అని, ఆమె పోరాట స్ఫూర్తి ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. శుక్రవారం చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రతిమ మల్టీప్లెక్స్ వద్ద ఉన్న ఐలమ్మ విగ్రహానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, నగర పాలిక కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, రజక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రాచకొండ నరేష్, జిల్లా గౌరవ అధ్యక్షులు కొత్తకొండ రాజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకొండ శ్రీనివాస్, రాచకొండ కొమురయ్య ,డ్రై క్లీనింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భూత్కూరి శివకృష్ణ , వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**చాకలి ఐలమ్మ కు ఘన నివాళి అర్పించిన బిఆర్ఎస్ పార్టీ**



**నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్**

భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటి చెప్పి, మహిళా లోకానికి స్ఫూర్తి నిచ్చిన ధీర వనిత చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా విగ్రహానికి పూల మాల వేసి గణ నివాళులు అర్పించిన కరీంనగర్ బిఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ...తెలంగాణ బహుజనుల ఆత్మగౌరవ, సమానత్వ పోరాటాల స్ఫూర్తి ప్రదాత చాకలి ఐలమ్మ” అని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో 37 వ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అరె రవి గౌడ్, 55వ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చేతి చెంద్రశేఖర్, 39 వ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పటేల్ సుధీర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు అనుమల్ల ఉమశంకర్, సతినేని శ్రీనివాస్, యువ నాయకులు చిలువేరి అఖిల్ పాల్గొన్నారు.

# మున్నూరుకాపు కార్పొరేషన్ హామీని ప్రభుత్వం నెరవేర్చాలి

**కొండా దేవయ్య డిమాండ్**



**ఖమ్మం సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** ఖమ్మం జిల్లా మున్నూరు కాపు ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం జరిగింది ఈ సమావేశానికి తెలంగాణ మున్నూరు కాపు సంఘం పటేల్స్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు కోసం నిధులు సాధించకోవాలంటే మున్నూరుకాపులు ఐక్యంగా ఉండాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటుకు హామీ ఇచ్చిందన్నారు. హామీని అమలు చేసేదాకా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్మారు. తెలంగాణ రాష్ట్రంలో జనాభా లెక్కల కోసం ప్రతి ఇంటిలో కుటుంబ సభ్యుల సభ్యత్వం నమోదు చేయాలన్నారు. అందుకోసం రాష్ట కమిటీ సభ్యులు గా కొంత మంది సభ్యులను ఎంపిక ల్ చేసామన్నారు. స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా. శెట్టి రంగారావు పటేల్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ గాపసుపులేటి దేవేందర్ పటేల్ స్టేట్ సెక్రటరీ గోవిందు శ్రీనువాసు రావు రాష్ట సహాయ కార్యదర్శిగా సూరంశెట్టి కిషోర్ పటేల్ స్టేట్ ఆర్గనేజింగ్ సెక్రటరీగా వేముల కృష్ణ ప్రసాద్ పటేల్ ని నియమించారు.. వీరందరికి నియామక పత్రాలు కొండ దేవయ్య పటేల్ అందజేశారు వారు మాట్లాడూతు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జనాభా లెక్కల సేకరణ కోసం పది వేల మందికి సభ్యత్వం కోసం బుక్స్ నూతన కమిటీ సభ్యులకు అందజేశారు ఈ కార్యక్రమం కొత్త సీత రాములు సభ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మున్నూరు కాపు పటేల్స్ నాయకులు పోదిల రవికుమార్ పటేల్ ,కనకం జనార్దన్ పటేల్, సూరంశెట్టి నాగ భూషణం జీ శ్రీదేవి కార్పరేటర్స్ రాపర్తి శరత్ పటేల్ చామకూరి వెంకట నారాయణ మాదురీ పూర్ణ పటేల్ ,మదూరి సైదారావు ,జే వి ల్ నరసింహారావు, నారాల నరేష్ చెరుకూరిపూర్ణ ,మాదంశెట్టి హనుమంత రావు విప్లవ కుమార్ పటేల్ సౌదం నరసింహ రావు దేవిశెట్టి వెంకటేశ్వర్లు తాళ్లూరి సోమయ్య సూరయ్య ఆర్ కె నాయుడు జయ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# షుగర్ థైరాయిడ్ హార్మోన్ల సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు

## ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ వెలుగు ప్రదీప్ కుమార్



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** బీపీ, షుగర్, థైరాయిడ్, హార్మోన్ల సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ వెలుగు ప్రదీప్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.మానవ శరీరంలోని అనేక గ్రంథుల నుండి విడుదలయ్యే హార్మోన్లు శరీరంలో జరిగే అనేక రకాల ప్రక్రియలను నియంత్రిస్తుంటాయని తెలిపారు.హార్మోన్లలో సమతుల్యం దెబ్బ తింటే పెద్దలు,చిన్నారులు పలు రకాల ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటారని చెప్పారు.ఈ సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దన్నారు. లేకపోతే బీపీ, షుగర్, ఊబకాయం, కొలెస్ట్రాల్, థైరాయిడ్, ప్రోలాక్టిన్ సమస్యలు, అడ్రినల్ గ్రంథి సమస్యలు, సంతానలేమి సమస్యలు, పిసిఓడి వంటి ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన తాను వైజాగ్ లోని కేజీహెచ్ హాస్పిటల్ లో డీఎం ఎండోక్రైనాలజీ విభాగంలో పట్టా పొందినట్లు చెప్పారు.తన సొంత ప్రాంతంలోని ప్రజలకు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రతి ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీస్టార్ హాస్పిటల్ లో అందుబాటులో ఉండనున్నట్లు తెలిపారు.పిల్లల్లో ఎదుగుదలలో లోపాలు, బీపీ, షుగర్,థైరాయిడ్,హార్మోన్ల వ్యాధులకు ప్రత్యేక వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు.సూర్యాపేట జిల్లా ప్రజలు ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అదే విధంగా మెదడు నుండి నడుము వరకు అన్ని రకాల న్యూరో సమస్యలకు ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ వెలుగు సందీప్ కుమార్ కూడా అందుబాటులో ఉంటారని తెలిపారు.మరిన్ని వివరాలకు సెల్ నెంబర్స్ 9010937551, 9989366772, 9963614275 లలో సంప్రదించవచ్చని తెలిపారు.

# ఎల్లారెడ్డిపేట సహకార సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లాకే ఆదర్శం

**ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 26, (జనంసాక్షి) :** ఎల్లారెడ్డిపేట మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లాకే ఆదర్శమని ఆ సంఘ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి అన్నారు. గుండారపు కృష్ణారెడ్డి అధ్యక్షతన సంఘ కార్యాలయం భవనంలో శుక్రవారం మహాజన సభ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 6 నెలల వరకు గల ఆదాయ, వ్యయ నివేదికలు ప్రవేశపెట్టడం, ఆడిట్ పూర్తి కాబడిన 2024-25 సంవత్సరం ఆడిట్ నివేదిక సమర్పించడం జరిగింది. సంఘ సభ్యులకు గల సందేహాలను తెలుసుకొని వారి నుండి విలువైన సూచనలు స్వీకరించారు. ఎల్లారెడ్డిపేట సహకార సంఘానికి టేస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు సహకారంతో పెద్ద ఎత్తున దీర్ఘకాలిక రుణాలు, స్వల్పకాలిక రుణాలు మంజూరు చేశామని, ఎల్లారెడ్డిపేట సహకార సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే ఎ(ప్లస్) గ్రేడ్ లోన్ ఉందన్నారు. ఎన్ఎబిఎఆర్‌డి, డిసిసిబి సహకారంతో రెండు గోదాములు, పెట్రోల్ బంక్ నిర్మించుకోవడం జరిగిందన్నారు. రైతులు ప్రతి 6 నెలలకు ఒకసారి క్రాఫ్ లోన్ రెన్యూవల్ చేసుకోవాలని, రెన్యూవల్ చేసుకున్న వారికి 7 శాతం రిబేట్‌లో 3 శాతం తిరిగి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ మానిటరింగ్ ఆఫీసర్ షఫీయోద్దిన్, సంఘ డైరెక్టర్లు జంగిటి సత్తయ్య, గొట్టే సరిత, కోనేటి ఎల్లయ్య, నేవూరి వెంకట నరసింహారెడ్డి, గంద్ర ప్రభాకర్‌రావు, కనకట్ల సుధాకర్, రైతులు కోల కొండయ్య, సుర అశోక్, గడ్డం ఆనందం, వంగాల లక్ష్మణ్, నవజీవన్ రెడ్డి, మోతే నరసింహారెడ్డి, రామ కిష్టారెడ్డి, నేవురి పద్మారెడ్డి, మద్దుల శ్రీపాల్ రెడ్డి, గొట్టె సురేందర్, బండారపు మల్లారెడ్డి, బండారి బాల్‌రెడ్డి, ఈసరి నర్సయ్య, జంగ అంజిరెడ్డి, దమ్మ భూమిరెడ్డి, కుంబాల ప్రభాకర్, సల్వాజి శ్రీనివాస్, లింగాల దాసు, ఎగదండి నర్సయ్య, సంఘ సెక్రటరీ సనుగుల కిషోర్ కుమార్, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

# యుక్త వయసులో... ప్రేమా.. ఆకర్షణా?



**యుక్తవయసులో కలిగేది ప్రేమా ? ఆకర్షణ ఎన్ని తరాలు మారినా జవాబు దొరకని ప్రశ్న. వాళ్లేమో ప్రేమంటారు. అమ్మానాన్నలేమో కాదంటారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్యా కనిపించని వారధి ఏర్పడుతుంది. కానీ నేటి సమాజంలో యువత ప్రేమ పేరుతో తొందరపాటులో పెళ్లి చేసుకుని అతి తక్కువ కాలంలో వారి జీవితాలను అంధకారం చేసుకుంటున్నారు. ప్రేమించి మోసం చేసాడని ఒకరు. ప్రేమించి పెళ్లి చేసుకుని ఇప్పుడు వద్దంటున్నాడని మరొకరు. ఇలాంటి సంఘటనలు నిత్యం చూస్తూనే ఉన్నాం. ప్రేమ మైకంలో చిక్కుకుని మోసపోతున్న నేటి యువతరంపై ‘జనంసాక్షి’ కథనం.**

- గద్వాల జిల్లాలో ఏడాదిలోపే 25 ప్రేమ కేసులు
- పారిపోయి పెండ్లిళ్లు చేసుకున్న పలువురు
- పట్టుకొచ్చిన పారిపోతున్న మరికొందరు
- పోక్సోకు చిక్కితే జీవితం జైలుపాలే : డీఎస్పీ మొగులయ్య

**రాజోలి, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :**

### గద్వాల జిల్లాలో 25 మైనర్ ప్రేమ కేసులు

సోషల్ మీడియా ప్రభావం పిల్లలపై బాగా పడుతోంది. చాటింగ్ కారణంగా పిల్లలు ప్రేమలో పడుతున్నారు. దీంతో ఇండ్ల నుంచి పారిపోతున్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో ఈ ఏడాదిలో అనేకం సంఘటనలు చోటుచేసుకున్నాయి. చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్ లెక్కల ప్రకారం ప్రతినెలా 3 నుంచి 5 జంటలు ప్రేమ పేరుతో పారిపోతున్నాయి. ఆన్లైన్ చదువుల కోసం మొదలైన స్మార్ట్ ఫోన్ వాడకం..ఇప్పుడు జీవితంతో పెనవేసుకుపోయింది. జోగులాంబ గద్వాల జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు ప్రేమలో పడిన ఘటనలు 25 కంటే ఎక్కువే వెలుగు చూశాయి. ఇందులో 25 మంది మైనర్లు ప్రేమలో పడ్డారు. పిల్లలు ఇంటి నుంచి వెళ్లిపోవడంతో పలువురు పేరెంట్స్ స్థానిక పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసుల సాయంతో చిన్నారులను తీసుకొచ్చి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ ఇచ్చారు. మరికొందరు తమ పరువు పోతుందేమోనని చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్ను ఆశ్రయించడం లేదు.

### చిన్నతనంలో ప్రేమలు సరికావు


సమాజంలో మంచి చెడులపై అవగాహన లేని కౌమార వయసు అత్యంత ప్రమాదకరమైంది. సినిమాల ప్రభావంతో కొందరు బాలబాలికలు ప్రేమ అనే ఆకర్షణకు లోనవుతున్నారు. ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోతున్నారు. తర్వాత జరిగే పర్యవసానాలు, చట్టాల తీవ్రత తెలియక.. అనేక మంది బాలలు, యువకులు పోక్సో చట్టానికి బలవుతున్నారు. ఇష్టపడి బాలిక వచ్చినాసరే.. తప్పు యువకుడిదే. లైంగికంగా వేధించినా, అత్యాచారం చేసినా.. పోక్సోలో వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తారు. ఈ తరహా నేరాలకు కఠినమైన శిక్షలు ఉంటాయి. తెలిసీ తెలియని వయసులో కలిగేది ప్రేమ కాదని, ఆ భ్రమలో నుంచి బయటపడాలని పోలీసులు, సైకాలజిస్టులు సూచిస్తున్నారు.

### తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం

ఆడపిల్లలు, ముఖ్యంగా విద్యార్థి దశలో ఉన్నప్పుడు తల్లిదండ్రులు, వారి కుటుంబ సభ్యుల పర్యవేక్షణ, తోడ్పాటు ఎంతో అవసరం. ఆడపిల్లలకు మంచి చదువును అందించే ప్రయత్నం చేయాలి. ఇంట్లో ఆడపిల్లలతో స్నేహితుల మాదిరిగా వ్యవహరించి అన్ని విషయాలు చెప్పేలా, చర్చించేలా వాతావరణం కల్పించాలి. మంచేదో, చెడేదో చెప్పి గైడ్ చేయాలి. అమ్మాయిల్లో జీవితం పట్ల సానుకూల దృక్పథం అలవడేలా, నిలదొక్కుకునేలా మంచి కెరీర్ వైపు ప్రోత్సహించాలి. తల్లిదండ్రుల మధ్య సఖ్యత లేక, పిల్లల ముందే తిట్టుకోవ డం, కొట్టుకోవడం చేస్తున్నారు. ఇద్దరిలో ఒకరు వివాహేతర సంబంధాలపై ఆసక్తి చూపడం వంటివి చేస్తున్నారు. దీంతో పిల్లలు కూడా ‘దారి’ తప్పుతున్నారు.

### మైనర్లకు పెండ్లిండ్లు..

పిల్లల వ్యవహారాన్ని గమనించిన పెద్దలు, పరువు పోతుందన్న భయంతో మైనర్లకు పెండ్లిండ్లు చేస్తున్నారు. పెండ్లిండ్లు చేస్తే చివరకు సర్దుకుపోతారని తల్లిదండ్రులు భావిస్తున్నారు. పెండ్లిని మైనర్లు వ్యతిరేకించినా పెద్దలు పట్టించుకోకపోవడంతో పిల్లలు మౌనంగా ఉండిపోతున్నారు. మరికొందరు తామే చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్కు సమాచారం ఇచ్చి పెండ్లిని అడ్డుకున్న సంఘటనలూ ఉన్నాయి. గుట్టుచప్పుడు కాకుండా అనేకమంది మైనర్లకు పెండ్లిలు చేస్తున్నా రు. తమ దృష్టికి వచ్చిన పెండ్లిలను చైల్డ్ ప్రొటెక్షన్డెపార్ట్మెంట్ ఆపగలిగింది. 2024 నుంచి ఇప్పటివరకు 98 మైనర్ల పెండ్లిండ్లను ఆపగలిగారు.



### అశ్లీల వీడియోలు బ్యాన్ చేయాలి

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆన్లైన్ గేమ్స్, బెట్టింగ్ తదితర వెబ్సైట్లను బ్యాన్ చేసిన విషయం తెలిసిందే..చిన్నారులపై లైంగిక దాడులు జరగడానికి, పెరగడానికి కారణమైన అశ్లీల, అభ్యంతరకర కంటెంట్‌ను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకోవాలి. అశ్లీల కంటెంట్ యువతను తప్పు దారి పట్టించడమే కాకుండా, సామాజిక విలువలను దెబ్బ తీస్తుంది. పిల్లల సంరక్షణ కోసం ఇంటర్నెట్‌లో పోర్న్ వీడియోలను నిషేధించాలి. ఇంటర్నెట్ యూజర్లకు పోర్న్ వీడియోలు అందుబాటులో లేకుండా కేంద్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలి.

**సునంద**
మహిళ శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి

### చిత్తశుద్ధి అవసరం

ఏదైనా సాధించాలంటే దాని పట్ల చిత్తశుద్ధి అవసరం. చిత్తశుద్ధితో కృషి చేస్తే సాధించలేనిదేదీ ఉండదు. ప్రస్తుత సమాజంలో టైం వేస్ట్ చేసే యువత కూడా ఎక్కువగానే ఉంది. ముఖ్యంగా అమ్మాయిలు, విద్యార్థినులు లక్ష్యం వైపు సాగాలంటే అనవసర విషయాలు పక్కన పెట్టాలి. సోషల్ మీడియాతో టైం వేస్ట్ చేసే లక్షణాలు కరెక్టు కాదు. లక్ష్య సాధనలో దాన్ని పాజిటివ్ యాంగిల్‌లోనూ ఉపయోగించు కోవచ్చు. కానీ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వాట్సాప్ వంటి వేదికల ద్వారా టైం వేస్ట్ చేయొద్దు. పరీక్షల సమయంలో వాటి జోలికి పోకుండా ఉండాలి. చదువాలి.. ఎదగాలి అన్న తపన ఉంటే మంచి జీవితాన్ని సొంతం చేసుకోవచ్చు.

### శిక్షలు కఠినం..

బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, ప్రేమ పేరుతో వేధించినా నేరమే. బాలిక ఇష్టపడిందని ఆమెతో శారీరకంగా కలిసినా తప్పే. ఇలాంటి ఘటనల్లో నిందితులపై పోక్సో యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తాం. సెక్షన్లు బట్టి శిక్షలు ఉంటాయి. లైంగికంగా వేధించినా ఆపైగా..యావజ్జీవ ఖైదు విధించవచ్చు. వేధించి హత్యకు పాల్పడినా, అత్యాచారం చేసిన మరణశిక్ష విధించే అవకాశాలున్నాయి. ఇంతటి కఠినమైన చట్టం గురించి కౌమార వయసులో ఉన్నవారు తెలుసుకోవాలి. ప్రతి ఒక్కరూ భవిష్యత్తు గురించి ఆలోచించుకుని..బాగా చదువుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలి. తల్లిదండ్రుల ఆశలు ఆశయాలు నెరవేర్చాలి.



**- గద్వాల జిల్లా డిఎస్పి మొగులయ్య**

# చాకలి ఐలమ్మ జీవిత చరిత్ర చాలా గొప్పది

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- బూరుగడ్డలో ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి





హుజూర్ నగర్ / హుజూర్‌నగర్ రూరల్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి): నాటి నైజాం ప్రభుత్వంలో భూసంస్కరణల కోసం విరోచిత పోరాటం చేసిన చాకలి ఐలమ్మ జీవిత చరిత్ర చాలా గొప్పదని రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం హుజూర్ నగర్ మండల పరిధిలోని బూరుగడ్డ గ్రామంలో చాకలి ఐలమ్మ 135 వ జయంతి సందర్భంగా మాజీ ఎంపీపీ గూడెపు శ్రీను ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం సామాజిక న్యాయానికి కట్టుబడి బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థలలో 42% రిజర్వేషన్ కల్పించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వీరనారి చాకలి ఐలమ్మకు గుర్తింపుగా కోటి ఉమెన్స్ యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టడమే కాకుండా వారి పేరుకు తగ్గట్టుగా వందల కోట్లతో అభివృద్ధి చేసి దేశంలోనే అగ్రగామి యూనివర్సిటీగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని మంత్రి అన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ వారి చరిత్ర విద్యార్థులకు తెలిసేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత దేశ చరిత్రలో మొదటిసారిగా తెలంగాణ ప్రభుత్వంలో తాను చైర్మన్ గా ఉన్నా కమిటీ 3.70 కోట్ల మందిని ఇంటింటి సర్వే నిర్వహించి బి సి కులగణన చేసిందని, రాష్ట్రంలో 50% బీసీలు ఉన్నారని మా ప్రభుత్వం బీసిలకు విద్యలో, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు రాష్ట్ర క్యాబినెట్, శాసనసభలో బిల్లును ఆమోదించి చట్టం చేశామని బీసీలకు అన్ని విధాల సహాయం చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకెళ్తున్నామని తెలిపారు. బూరుగడ్డ చెరువు తెగినప్పుడు 2.6 కోట్లతో యుద్ధ ప్రతిపాదికన మరమ్మతులు చేపించామని, దేవాలయం అభివృద్ధికి 80 లక్షల రూపాయలు మంజూరు చేశామని, గ్రామంలో పలు సిసి రోడ్లు నిర్మించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్మన్ లు రాధికా అరుణ కుమార్, బెల్లంకొండ విజయలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సాముల శివారెడ్డి, యరగాని నాగన్న గౌడ్, నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, గ్రామ పెద్దలు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### గోవిందపురంలో బ్రిడ్జి ప్రారంభోత్సవం

హుజూర్‌నగర్ పట్టణంలోని గోవిందాపురంలో 2 కోట్ల రూపాయలతో నిర్మంచిన బ్రిడ్జిని మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ హుజూర్ నగర్ పట్టణ వాసులుకు వర్షాలు కురిసినప్పుడు చాలా ఇబ్బంది పడుతున్నారని, పట్టణ వాసులకు మేలు జరిగేలా 2 కోట్ల రూపాయలతో బ్రిడ్జి మంజూరు చేసి ప్రారంభించటం చాలా సంతోషంగా ఉందన్నారు. పేదలకు సరైన విద్యా, వైద్య అవకాశాలు కల్పించేందుకు హుజూర్ నగర్ లో 7.5 కోట్లతో జూనియర్ కాలేజ్, 4.5 కోట్లతో డిగ్రీ కాలేజ్ లకు నూతన భవనాలు, పట్టణంలో వంద పడకల ఆసుపత్రి, డయాలసిస్ సెంటర్, సిటీ స్కాన్ సెంటర్ ఏర్పాటు చేశామని, పేదలకు సొంత ఇల్లు ఉండాలని రామస్వామి గుట్ట వద్ద 2120 సింగిల్ బెడ్ రూమ్ ఇల్లులు నిర్మించామని, అలాగే యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు 6 కోట్లతో ఐటిఐ కాలేజ్, 40 కోట్లతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను మంజూరు చేశామన్నారు. తాను గెలిచిన ప్రతిసారి విద్యా, వైద్యం, సాగునీరు, తాగునీరు లాంటి మౌలిక వసతులు ఏర్పాటుచేసి ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఓజీ సినిమా టిక్కెట్ ధరల పెంపు వీల్లేదు

- సింగిల్ జడ్జి ఆదేశాలను సమర్థించిన హైకోర్టు



హైదరాబాద్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) : పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కిన 'ఓజీ' మూవీ టికెట్ ధరల పెంపుపై తెలంగాణ హైకోర్టు షాక్ ఇచ్చింది. టిక్కెట్ ధలు పెంచేందుకు నిరాకరించింది.. పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన ఓజీ సినిమాకు తెలంగాణ హైకోర్టు మరోసారి షాకిచ్చింది. రివ్యూ తర్వాత కూడా పెంపునకు న్యాయస్థానం అంగీకరించలేదు. 'ఓజీ' బెనిఫిట్ షోలకు, ఆ సినిమా టికెట్ రేట్లను పెంచుకునేందుకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ గతంలో హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులే కొనసాగు తాయని స్పష్టం చేసింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులే అక్టోబర్ 9వ తేదీ వరకు కొనసాగుతాయని హైకోర్టు స్పష్టం చేసింది. టికెట్ రేట్లు ఎందుకు పెంచాలని అనుకు న్నారో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభు త్వానికి ఆదేశాలు జారీ చేసింది. తదు పరి విచారణను అక్టోబర్ 9వ తేదీకి వాయిదా వేసింది. ఓజీ సినిమా టికెట్ల ధరల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ను ఇప్పటికే హైకోర్టు సింగిల్ బెంచ్ నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌పై ఇటీవల విచారణ జరిపిన సింగిల్ బెంచ్.. 'ఓజీ' బెనిఫిట్ షోల ద్వారా వచ్చే రాబడిని వీధి పిల్లలు, అనాథల సంక్షేమం కోసం ఖర్చు చేస్తారా? అని నిలదీసింది. 'ఓజీ' బెనిఫిట్ షోలను, ఆ సినిమా టికెట్ రేట్ల పెంపుదలను నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. 'ఓజీ' సినిమా టికెట్లను 18 ఏండ్లలోపు వారికి విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీనిపై కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ రాష్ట్ర హోంశాఖ ముఖ్యకార్యదర్శి, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌తోపాటు 'ఓజీ' చిత్ర నిర్మాణ సంస్థ డీవీవీ ఎంటర్-టైన్‌మెంట్‌కు నోటీసులు జారీచేస్తూ.. తదుపరి విచారణను అక్టోబర్ 9కి వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్ కుమార్ బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. 'ఓజీ' బెనిఫిట్ షోలకు, ఆ సినిమా టికెట్ రేట్ల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడాన్ని సవాలు చేస్తూ హైదరాబాద్‌కు చెందిన బీ మల్లేశ్ యాదవ్ పిటిషన్ దాఖలు చేయడంతో హైకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. 'ఓజీ' యూనిట్ తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. రివ్యూ పిటిషన్‌పై ఇరు వర్గాల వాదనలు విన్న కోర్టు.. టికెట్ ధరలు పెంచడానికి వీల్లేదని స్పష్టం చేసింది.

# మద్యం షాపులు బంద్ అంటూ బోర్డులు

- గాంధీ జయంతి రోజే దసరా

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) : తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద పండుగ దసరా.. ఈ పర్వదినాన రెండు రాష్ట్రాలప్రజలు ఫుల్ జోష్‌లో ఉంటారు. బంధుమిత్రులందరినీ తమ ఇళ్లకు ఆహ్వానించి సంతోషంగా దసరాను జరుపుకుంటారు. దసరా రోజున ముక్కా, సుక్కతో ఫుల్ ఖుషీ అవుతారు. అయితే, ఈసారి మాత్రం ఆ పరిస్థితి కనిపించేలా లేదు. ఎందుకంటే.. దసరా పండుగ అక్టోబర్ 2వ తేదీన వచ్చింది. అక్టోబర్ 2 గాంధీ జయంతి. దీంతో ఆ రోజున మద్యం అమ్మకాలు పూర్తిగా నిషేధం. ఇదే విషయాన్ని తెలియజేస్తూ ఇప్పటికే చాలా వైన్స్ షాపుల వద్ద దసరా రోజున వైన్ షాప్స్ బంద్ అంటూ ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. సోషల్ మీడియాలోనూ ఈ అంశంపై రీల్స్ మీద రీల్స్ చేస్తున్నారు నెటిజన్లు. మరోవైపు.. అసలే దసరా.. అక్టోబర్ 2న మందు బంద్ అనడంతో.. మద్యం ప్రియులు వైన్ షాపుల వద్దకు పరుగెత్తుకెళ్తున్నారు. ముందే స్టాక్ తీసుకెళ్తున్నారు.

# ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌లకు పోటెత్తిన వరద



హైదరాబాద్ (జనంసాక్షి) : ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు కురియడంతో వరద పోటెత్తింది. వర్షాల వల్ల జంట జలాశయాల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. 8000 క్యూ సెక్కుల వరద నీరు వస్తుండటంతో పూర్తి స్థాయి నీటి మట్టానికి జంట జలాశయాలు నిండాయి. ఈ నేపథ్యంలో జంట జలాశయాల గేట్లు ఎత్తారు. హిమాయత్ సాగర్ 4 గేట్లు మూడు అడుగు మేర ఎత్తి 4069 క్యూ సెక్కుల నీటి విడుదల చేశారు. ఉస్మాన్ సాగర్ 10 గేట్లు 6 అడుగుల మేర ఎత్తి 6370 క్యూ సెక్కుల నీరు దిగువకు విడుదల చేశారు. మొత్తం జంట జలాశయాల నుంచి 10439 క్యూసెక్కులు వరద నీరు మూసీ నదిలోకి విడుదల చేశారు. గేట్ల ఎత్తివేత నేపథ్యంలో మూసీ నది పరివాహక ప్రాంత ప్రజల్ని అధికారులు అప్రమత్తం చేశారు. ఈ నేపథ్యంలో జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రాబోయే రెండు రోజులపాటు ఎలాంటి సెలవులు మంజూరు చేయబడవని... ఇప్పటికే ఎవరు సెలవులో ఉన్నా, ఆ సెలవులు రద్దు చేస్తున్నట్లు అన్నారు. అధికారులు రాబోయే రెండు రోజులు ప్రత్యేకంగా మూసీ నది క్యాచ్‌మెంట్ ప్రాంతాన్ని జాగ్రత్తగా పర్యవేక్షించాలని అన్నారు. అలాగే మూసీ పరివాహక ప్రాంతాల్లోని అన్ని లైన్ విభాగాలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హిమాయత్‌సాగర్, ఓస్మాన్‌సాగర్ రిజర్వాయర్ల వర్షపాతం, వాతావరణ సూచనల కారణంగా, హిమాయత్‌సాగర్ నుండి విడుదలను క్రమంగా 10,000 క్యూసెక్కులకు పెంచనున్నట్టు తెలిపారు. అలాగే ఓస్మాన్‌సాగర్ నుండి విడుదలను 11,000 క్యూసెక్కులకు పెంచనున్నటు తెలిపారు. రెండు రిజర్వాయర్ల నుండి కలిపి విడుదల 21,000 క్యూసెక్కులు శుక్రవారం సాయంత్రం 4:30 గంటల నుండి కొనసాగుతున్నదని తెలిపారు.

# వర్షానికి మూసీకి వరద

- మూసారాంబాగ్ వద్ద రాకపోకలు నిషేధం
- మంచిరేవుల వద్ద నిలిచిపోయిన రాకపోకలు



హైదరాబాద్, సెప్టెంబర్26 (జనంసాక్షి) : నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం మరోసారి భారీ వర్షం కురియడంతో పలు ప్రాంతాల్లో నగర వాసులు తడిసి ముద్దయ్యారు. వివిధ పనులపై బయటకు వచ్చిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బేగంబజార్, కోఠి, నాంపల్లి, హిమాయత్ నగర్, ఖైరతాబాద్, ట్యాంక్ బండ్, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. జంటజలాశయాలు, హుస్సేన్ సాగర్ పూర్తిగా నిండిపోయాయి. దీంతో గేట్లు ఎత్తి నీటిని వదిలారు. ఈ క్రమంలో మరోమారు మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. రోడ్లపై భారీ వర్షం వల్ల మూసారాంబాగ్ బ్రిడ్జిపై నుంచి మూసీ వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో మూసారాంబాగ్ బ్రిడ్జిపైకి వాహనాలను.. పోలీసులు, రెవెన్యూ అధికారులు నిలిపివేశారు. భారీ వర్షాలకు ఉస్మాన్ సాగర్ నిండిపోవడంతో పైనుంచి నీటిని దిగువ ప్రాంతాలకు వదలడంతో అంబర్‌పేటలోని మూసారాంబాగ్ బ్రిడ్జిపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో కాచిగూడ ట్రాఫిక్ పోలీసులు బ్రిడ్జిపై బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలను పూర్తిగా నిలిపివేశారు. దిల్‌సుఖ్‌నగర్ వైపు నుంచి వచ్చే వాహనాలను గోల్నాక కొత్త బ్రిడ్జి వైపు దారి మళ్లించారు.

ఎగువన కురుస్తున్న కుండపోత వర్షాలతో జంట జలాశయాలైన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ లోకి భారీగా వరద నీరు చేరుతోంది. ఈసా, మూసీ నదుల నుంచి పెద్ద ఎత్తున వరద ప్రవాహం జంట జలాశయాల్లోకి చేరడంతో అవి నిండుకుండలా మారాయి. గంటగంటకు వరద పెరుగుతుండటంతో జలమండలి అధికారులు రెండు జలాశయాల గేట్లను ఎత్తి మూసీలోకి వదులుతున్నారు. సాయంత్రం 4 గంటల వరకు ఉస్మాన్ సాగర్ 11 గేట్లు- 7 ఎడుగుల మేర ఎత్తి 7,986 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో మంచిరేవుల గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. వర్షాకాలం వచ్చిందంటే గండిపేట జలాశయం గేట్లు-ఎత్తడం, తద్వారా మూసీలోకి భారీ వరద ప్రవాహం కారణంగా నార్సింగి, మంచి రేవుల గ్రామాల మధ్యన రాకపోకలు నిలిచిపోవడం మంచిరేవుల గ్రామ ప్రజలకు శాపంగా మారింది. మూసీ నదిపై నాలుగు చోట్ల కల్వర్టులు ఉన్నా.. అన్నీ కూడా లో లెవెల్‌లో ఉండడంతో గండిపేట జలాశయం నాలుగు గేట్లు-ఎత్తి నీటిని విడుదల చేసిన వెంటనే ఈ కల్వర్టులపై నుంచి వరద ప్రవాహం ఉంటుంది. ఈ క్రమంలో.. ముందు జాగ్రత్త చర్యగా అధికారులు కల్వర్టులపై నుంచి రాకపోకలు నిలిపివేసారు. ఈ పరిణామం.. మంచిరేవుల గ్రామస్తులకు ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో పెద్ద తలనొప్పిగా మారింది. ఉద్యోగాలు, ఉపాధి కోసం బయటకు వెళ్లిన వారు తిరిగి ఇంటికి చేరుకోవడానికి 4, 5 కిలోమీటర్లు చుట్టూ తిరిగి ఇంటికి చేరుకోవాల్సి వస్తుంది. ఈ సమస్యను అధిగమించేందుకు నార్సింగి, మంచి రేవుల గ్రామాల మధ్యన ప్రస్తుతం ఉన్న కల్వర్టు స్థానంలో పది అడుగుల ఎత్తులో బ్రిడ్జి నిర్మించేందుకు అధికారులు రూ. 40 కోట్లతో ప్రతిపాదనలు చేసి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా మంచి రేవుల గ్రామ ప్రజల సమస్యను గుర్తించి నార్సింగి, మంచి రేవుల గ్రామాల మధ్యన బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# అరెస్టుకు భయపడేది లేదు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్26 (జనంసాక్షి) : టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. తన అరెస్టుపై కాంగ్రెస్ నేతలు కలలు కంటున్నారని కేటీఆర్ విమర్శించారు. తన అరెస్టు కోసం కాంగ్రెస్ నేతలు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారని ఎద్దేవా చేశారు. అరెస్టు చేసుకోండి... అరెస్టు భయం తనకు లేదని స్పష్టం చేశారు. . తన అరెస్టుతో సీఎం రేవంత్‌రెడ్డికి పైశాచిక ఆనందం తప్ప మరొకటి రాదని కేటీఆర్ మండిపడ్డారు. తాను ఏ తప్పు చేయలేదని... ఏం చేసుకుంటారో చేసుకోవాలని సవాల్ విసిరారు. తనతో రేవంత్‌రెడ్డి లై డిటెక్టర్ టెస్ట్‌కు రావాలని ఛాలెంజ్ చేశారు కేటీఆర్. ఏసీబీ కేసు తనపై ఉందని... రేవంత్‌రెడ్డిపైనా ఏసీబీ కేసుందని గుర్తుచేశారు. ఆర్ఎస్ బ్రదర్స్‌కు ప్రజా సమస్యలు పట్టవని విమర్శించారు. ఆర్ఎస్ బ్రదర్స్‌కు తాను ఏ కారులో తిరుగుతున్నానో మాత్రమే కావాలని ఎద్దేవా చేశారు.

# మహిళలతో పెట్టుకుంటే అంతే సంగతులు

- కెటీఆర్ తీరుపై మండిపడ్డ మంత్రి సీతక్క
- రవీంద్రభారతిలో బతుకమ్మ ఉత్సవాలకు హాజరు



హైదరాబాద్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) : మహిళలతో పెట్టుకున్న వారు ఎవరూ బాగుపడరని మంత్రి సీతక్క హెచ్చరించారు. సొంత ఇంట్లో ఆడపడచుకు న్యాయం చేయలేని వారు తమపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం గాంధీ భవన్‌లో మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. సొంత ఇంటి ఆడబిడ్డను గోస పెడుతున్నారని.. మాజీ మంత్రి కేటీఆర్ కు ఇది తగునా..? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం చేపడుతున్న మహిళా సంక్షేమ కార్యక్రమాల్లో మహిళా కాంగ్రెస్ భాగస్వామ్యం కానుందని ఉద్ఘాటించారు. మహిళా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తామని చెప్పుకొచ్చారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమే కాదని... మహిళలను బస్సు ఓనర్లను చేశామని ఉద్ఘాటించారు. అభయహస్తం నిధులను బీఆర్ఎస్ ప్రభుత్వం కాజేసిందని మంత్రి సీతక్క ఆరోపించారు. మరోవైపు... రవీంద్ర భారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలకు ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరయ్యారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. అనంతరం రవీంద్రభారతిలో పువ్వుల బతుకమ్మ పాటను ఆవిష్కరించారు. తెలంగాణ పర్యాటక సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పువ్వుల బతుకమ్మ పాటను రూపొందించారు. సింగర్స్ గడ్డం సంతోష్, శ్రీనిధి పువ్వుల బతుకమ్మ పాటను ఆలపించగా.. నయని పావని నటించింది. ఈ సందర్భంగా సింగర్స్, నాయని పావనీని మంత్రి సీతక్క, కాంగ్రెస్ సీనియర్ నేత ఇందిరా శోభన్ సన్మానించారు.

# రాయలసీమ జిల్లాల్లో రాజధాని ఉంటే బాగుండేది

- కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్



కర్నూలు (జనంసాక్షి) : రాయలసీమ జిల్లాల్లో ఎక్కడైనా సరే రాజధాని పెట్టి ఉంటే బాగుండేదని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ అన్నారు. రాయలసీమలో పుట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతిలో రాజధాని పెట్టారని దుయ్యబట్టారు. కర్నూల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు మూడు జిల్లాల ప్రజలు తప్ప, మిగిలిన అన్ని జిల్లాల ప్రజలు అమరావతిపై సంతోషంగా లేరని తెలిపారు. 70 సంవత్సరాల క్రితం, మద్రాస్ రాష్ట్రం నుంచి విడిపోయి, కర్నూలుకు రాజధాని వచ్చింది. కర్నూలు నుంచి హైదరాబాద్ వెళ్లిందని, హైదరాబాదు నుంచి తుళ్లూరుకు చేరిందని, అనంతపురంలో జరిగిన సూపర్ సిక్స్ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సామాజిక న్యాయం గురించి తరిమెల నాగిరెడ్డి లాగా మాట్లాడారని తెలిపారు. కులాల మధ్య చిచ్చు పెట్టడం, మాల మాదిగల మధ్య తగాదా పెట్టడాన్ని సామాజిక న్యాయం అంటారా? అని ప్రశ్నించారు. మాదిగలకు సామాజిక న్యాయం చేయాలనుకుంటే, ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని, తాము సంతోషిస్తామని తెలిపారు. 15 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నారు కదా ఇక దిగిపోవాలని సూచించారు.

'నిన్న నేను కర్నూలులో ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆఫీస్కు వెళ్లాను. గత 11 సంవత్సరాలుగా ఎంత మంది ఎస్సీలకు రుణాలు ఇచ్చారని ఆఫీసర్ ను అడిగాను. రుణాలు ఇవ్వలేదని ఆ అధికారి సమాధానం చెప్పారు. రుణాలు తీసుకున్న ఎస్సీలకు నోటీసులు ఇస్తున్నామని నాతో అన్నారు. 14.50 లక్షలు కోట్ల రూపాయలు కోటీశ్వరులకు రుణమాఫీ చేశారు కదా? ఎస్సీలు తీసుకున్న రుణాలను ఎందుకు మాఫీ చేయరు? ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందిన దళితుల అప్పులను వెంటనే మాఫీ చేయాలని ముఖ్యమంత్రిని కోరుతున్నాను. కర్నూలు సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ను, మరియు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ గారిని కలిసాను. ఫుల్ మెస్ చార్జీలు, స్కాలర్షిప్పు వస్తున్నాయా? అని విచారించాను. 25 % మెస్ చార్జీలు వస్తున్నాయని, మిగిలిన 75% మెస్ చార్జీలు విద్యార్థులే కట్టుకోవాలని అధికారులు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఫుల్ మెస్ చార్జీలు, స్కాలర్షిప్పు ఇచ్చాము. కూటమి ప్రభుత్వం ఎందుకు ఇవ్వలేకపోతోంది?? మెస్ చార్జీలు కట్టలేక ఎస్సీ, ఎస్టీ ఓబీసీ విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారు. ఏపీలో పరిపాలన బాగాలేదు. అభివృద్ధి ఆగిపోయింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 30 సంవత్సరాలు ఎమ్మెల్యేగా, మంత్రిగా, ముఖ్యమంత్రి గా చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో మంచి ఇడ్లీ కొట్టు కూడా కట్టలేకపోయారు' అని అన్నారు. మోడీ గారు తన ఇద్దరు మిత్రులకు రష్యా క్రూడ్ ఆయిల్ ను ఇస్తున్నారు. వాళ్లు సంవత్సరానికి 50 వేల కోట్ల రూపాయలు లాభం పొందుతున్నారని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు అశోక్ రత్నం, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

# ఆదాయం కోసం మద్యం ఏరులై పారిస్తారా?

- ఆదాయం పెంచుకునేందుకు అడ్డదారులు వెతుక్కుంటున్న రేవంత్ సర్కార్
- మాజీ మంత్రి హరీష్ రావు ఫైర్



హైదరాబాద్ (జనంసాక్షి) : ఆదాయం కోసం మద్యం ఏరులై పారిస్తారా? అని రేవంత్ సర్కార్‌పై మాజీ మంత్రి హరీష్‌రావు ఫైరయ్యారు. 6 గ్యారంటీలు 420 హామీల ఊసు లేదు కానీ మద్యం ఆదాయం రెట్టింపు చేసుకునే దిశగా కొత్త పాలసీ తెచ్చారని, కేసీఆర్ తెచ్చిన పథకాలకు కోతలు, ప్రజలకు పన్నుల వాతలు తప్ప 22 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని తెలిపారు. ఇప్పటికే మద్యం ధరలను ఇష్టారీతిగా పెంచిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆదాయాన్ని మరింత పెంచుకునే విధంగా కొత్త పాలసీ తెచ్చింది. ఇపుడు మద్యం షాపుల దరఖాస్తు ఫీజును ఏకంగా రెండు లక్షల నుంచి మూడు లక్షల రూపాయలకు పెంచారని, ఎన్నికలప్పుడు మాయ మాటలు - పాలనలోకి రాగానే మోసపు చేతలని దుయ్యబట్టారు. ప్రజలపై ఆర్టీసీ బస్సు చార్జీలు మోతలు, వాహనాలపై పన్నుల భారం మోపారని, ఆర్ఆర్ టాక్స్ లు వేశారని తెలిపారు. ప్రజలకు సంక్షేమం పెంచుతామని ఎన్నికల్లో హామీ ఇచ్చి గద్దె నెక్కగానే గరీబోళ్ల సంపాదనను కొల్లగొట్టే పథకాలు రచిస్తున్నారని తెలిపారు. బెల్ట్ షాపులు ఎత్తివేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ దాన్ని తుంగలో తొక్కి గ్రామ గ్రామాన మద్యం ఏరులై పారేలా చేసిందని, ప్రజలకు మద్యం తాగించడం ఖజానా నింపుకోవడం అనే విధానం రేవంత్ రెడ్డి పాటిస్తున్నాడు, అందుకోసం అన్ని రకాల మద్యంపై ధరలు పెంచాడని, మద్యం అమ్మకాలు పెరగాలని అధికారులపై ఒత్తిడి తెస్తూ వేధిస్తున్నాడని, మద్యం అమ్మకాలు టార్గెట్ రీచ్ కాలేదని అధికారులకు మెమోలు ఇచ్చిన ఘనత రేవంత్ సర్కారుదని, ఊరూరికి మైక్రో బ్రూవరీ తెచ్చి తాగుబోతుల తెలంగాణ చేస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా రేవంత్ రెడ్డి? అని ప్రశ్నించారు. అడ్డదారులు తొక్కడం, ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడటం రేవంత్ రెడ్డికి అలవాటుగా మారిందని, రాష్ట్రంలో మద్య నిషేధం తప్పదనే రీతిలో ఆనాడు బిల్డప్ ఇచ్చి ఈనాడు ఊరూరా మైక్రో బ్రూవరీలు తెస్తున్నాడని తెలిపారు. మహిళలకు కల్యాణ లక్ష్మితోపాటు తులం బంగారం ఇస్తానని ఇవ్వలేదని, యువతులకు నెలకు 2500 ఇస్తానని ఇవ్వలేదని, ఇవేమీ చేయకుండా బెల్ట్ షాపులు పెంచి మహిళల ఉసురు పోసుకుంటున్నాడని తెలిపారు. అప్పుల పాలైనా, గ్యారంటీల అమలు అయినా, మద్యం అమ్మకాలైనా ఏవైనా రేవంత్ రెడ్డిది రెండు నాలుకల ధోరణి అని, గౌడ సోదరులకు వైన్ షాపుల్లో 25 శాతం రిజర్వేషన్లు అని ఊదరగొట్టి .. కేసీఆర్ ఇచ్చిన 15% రిజర్వేషన్ కూడా ఇవ్వడం లేదని తెలిపారు. గౌడన్నలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని, రాత్రికి రాత్రే మద్యం షాపులు ఒక చోటు నుంచి మరో చోటుకు తరలించే వెసులుబాటు ఎందుకు కల్పించారని తెలిపారు. పబ్బులకు అనుమతి రద్దు చేయకపోగా కొత్త పబ్బులకు పర్మిషన్ ఇస్తూ కమిషన్లు దండుకుంటున్నాడని ఆరోపించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370